
సోమవారం 6-3-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 170


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సొంతగడ్డపై భావోద్వేగం
ఇటీవల అంతర్జాతీయ టెన్నిస్ నుంచి వీడ్కోలు తీసుకున్న సానియా మీర్జా ఆదివారం సొంతగడ్డపై చివరి మ్యాచ్ ఆడారు. హైదరాబాద్‌లో బోపన్న, బెథానీ, కారా బ్లాక్, ఇవాన్ దోడిగ్, మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్‌తో కలిసి ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడిన ఆమె భావోద్వేగానికి గురయ్యారు.
- వివరాలు 12లో



ప్రజాస్వామ్యంపై దారుణ దాడి
భారత ప్రజాస్వామ్య మౌలిక స్వరూపంపై మోదీ సర్కార్ దాడికి తెగబడిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు.
వివరాలు 6లో ▸



చైనా సైన్యం మరింత శక్తివంతం
సైనిక శక్తిని బలోపేతం చేయాలని నిర్ణయించుకున్న చైనా.. తమ రక్షణ బడ్జెట్‌ను 1.55 ట్రిలియన్ యువాన్‌లకు పెంచింది.
వివరాలు 6లో ▸



ఉత్తర కొరియాలో ఆకలి కేకలు
ఉత్తర కొరియా కనీవినీ ఎరుగని కరువు కోరల్లో చిక్కి అల్లాడుతోంది. తిండిలేక జనం అలమటిస్తున్నారు.
వివరాలు 6లో ▸



అధిక పెన్షన్.. అంత ఈజీ కాదు
వేతన జీవుల పెన్షన్‌పై ఈపీఎఫ్‌లోనూ స్పష్టత కొరవడిన నేపథ్యంలో దీనిపై అందుబాటులో ఉన్న వివరాలతో కథనం.
వివరాలు 13లో ▸

కోతకు గురైన ప్రాంతంలో కొత్త డయాఫ్రమ్ వాల్

- దెబ్బతిన్న చోట సమాంతరంగా కొత్తగా నిర్మాణం
- మరో రెండు చోట్ల సరిదిద్దే విధానంపై సీడబ్ల్యూసీతో చర్చ
- ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి
- ఆ పనులు గోదావరికి వరద వచ్చేలోగా పూర్తి.. ఆ తర్వాత ప్రధాన డ్యామ్ పనులు
- జలవనరుల శాఖకు డీడీఆర్పీ దిశానిర్దేశం

2 లో

ఇది నిరంకుశత్వం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విపక్ష నేతల బహిరంగ లేఖ

విపక్షమే లేకుండా అంతం చేసే ప్రయత్నాలు

- దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు
- ప్రతిపక్షాల ముఖ్య నేతలు టార్గెట్‌గా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- మనీశ్ సిసోడియా అరెస్టుతో ఈ పరిస్థితి ప్రపంచానికీ తెలిసింది
- అత్యధిక కేసులు ఎన్నికల సమయాల్లోనే.. అదే బీజేపీలో చేరినవారి కేసుల దర్యాప్తు గాలికి..
- విపక్షాల పాలనలోని రాష్ట్రాలపై గవర్నర్లను ఉసిగొల్పారు
- ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హితవు



సాక్షి, హైదరాబాద్: ''మన దేశం ఇంకా ప్రజాస్వామికమేనని మీరూ అంగీకరిస్తారని భావిస్తున్నాం. కానీ ప్రతిపక్షాల నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను తీవ్రస్థాయిలో ఉసిగొల్పి దుర్వినియోగపర్చడాన్ని చూస్తుంటే.. మనం ప్రజాస్వామ్యం నుంచి నిరంకుశత్వం వైపు పరిణామం చెందినట్టు అనిపిస్తోంది''అని ప్రధాని మోదీపై దేశంలోని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. విపక్షాల ముఖ్య నేతలను లక్ష్యంగా చేసుకుంటున్న తీరును పరిశీలిస్తే.. విపక్షమనేదే లేకుండా అంతం చేయడానికి దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారన్న ఆరోపణలకు బలం చేకూరుస్తోందని పేర్కొన్నాయి. ఎన్నికల క్షేత్రం వెలుపల ప్రతీకారం తీర్చుకోవడానికి

మిగతా 3వ పేజీలో ▶

విశాఖపై విమానయాన సంస్థల చూపు

పాలనా రాజధాని కానున్న నేపథ్యంలో ఆసక్తి

- ఇప్పటికే ఊపందుకున్న ప్రయాణికుల రాకపోకలు.. 2022లో 27% పెరుగుదల
- విమాన సర్వీసుల్లో 23.91 శాతం వృద్ధి
- పెరుగుతున్న అంతర్జాతీయ సర్వీసులు
- దేశీయంగానూ మరిన్ని కొత్త సర్వీసులు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖపట్నంపై దాదాపు అన్ని విమానయాన సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. పరిపాలనా రాజధానిగా కూడా ఉండటంతో అన్ని విమానయాన సంస్థలు విశాఖ వైపు దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటికే విశాఖ ఎయిర్‌పోర్ట్ అంతర్జాతీయ విమానాశ్రయం హోదాను దక్కించుకుంది. దీంతో ప్రయాణికుల తాకిడి పెరిగింది. విమానయాన సంస్థలు సైతం తమ సర్వీసులు పెంచుతున్నాయి. అలాగే కొత్త సర్వీసులనూ ప్రారంభిస్తున్నాయి. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రయాణికుల రాకపోకల్లో పెరుగుదలను గమనిస్తే 2021తో పోల్చుకుంటే ఈ క్యాలెండర్ సంవత్సరం (2022)లో 27.70 శాతం వృద్ధి నమోదైంది. అదే సమయంలో విమాన సర్వీసుల్లో కూడా 23.91 శాతం వృద్ధి కనిపించింది.

పెరుగుదల ఇలా..

కోవిడ్‌కు ముందు 2018–19లో విశాఖ విమానాశ్రయం నుంచి 28 లక్షలు, 2019–20లో 27 లక్షలు, 2020–21లో 16.11 లక్షల మంది రాకపోకలు సాగించారు. 2021–22లో 22.28 లక్షల మంది ప్రయాణికులు వెళ్లి వచ్చారు. ఇది 2021తో పోల్చుకుంటే 27.70 శాతం అధికం. ఇక విమానాల రాకపోకల విషయానికొస్తే 2021 క్యాలెండర్ సంవత్సరంలో 15,040 ఉండగా, 2022లో అది 19,766 (23.91 శాతం)కు పెరిగాయి. అలాగే 2022 జనవరిలో 1,37,590 మంది వచ్చి, వెళ్లగా, 2023 జనవరిలో ఆ సంఖ్య 2,44,816కి పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల తాకిడి కోవిడ్‌కు ముందు నాటి పరిస్థితికి చేరుకుంటుందని భావిస్తున్నట్టు విశాఖ విమానాశ్రయం డైరెక్టర్ కె.శ్రీనివాసరావు 'సాక్షి'కి చెప్పారు. కోవిడ్ తర్వాత విశాఖ విమానాశ్రయం నుంచి మార్చి 4న రికార్డు స్థాయిలో 9,994 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. 64 విమానాలు వచ్చి వెళ్లాయి.

విస్తృతమవుతున్న విమాన సర్వీసులు..

ప్రయాణికుల తాకిడితో దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం విశాఖ–సింగపూర్ మధ్య ఒక విమాన సర్వీసు నడుస్తోంది. త్వరలో విశాఖకు విమాన సర్వీసును నడపనున్నట్టు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. విశాఖ నుంచి హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, పోర్టుబ్లెయిర్‌కు ఫిబ్రవరి 13 నుంచి, 21 నుంచి కొత్త సర్వీసులు మొదలయ్యాయి. ఫిబ్రవరి 28 నుంచి వైజాగ్ నుంచి గోవాకు, మార్చి 3 నుంచి హైదరాబాద్, బెంగళూరులకు అదనంగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో విమానయాన సంస్థలు తమ సర్వీసుల పెంపుపై దృష్టి సారిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఒ.నరేష్‌కుమార్, డీఎస్ వర్మ 'సాక్షి'కి తెలిపారు.

ప్రభుత్వ మద్దతు అమోఘం

- అందుకే మా పెట్టుబడులను ఇక్కడే భారీగా విస్తరిస్తున్నాం
- జీఐఎస్ వేదికగా చాటిచెప్పిన పారిశ్రామికవేత్తలు
- ఏపీ అత్యంత కీలకమైన రాష్ట్రం.. అందుకే రూ.50,000 కోట్ల అదనపు పెట్టుబడులు పెడుతున్నాం: ముఖేష్ అంబానీ
- ఇప్పటికే రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టాం, ఇంకా విస్తరిస్తాం: కరణ్ అదానీ
- 14 నెలల్లోనే యూనిట్ పూర్తిచేశాం: నోవా ఎయిర్
- రాష్ట్రంలో మరో యూనిట్ ఏర్పాటుకూ ఒప్పందం
- పచ్చపత్రికల విషప్రచారాన్ని తిప్పికొట్టిన జీఐఎస్

2 లో

టీకాలు 100%

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం

- జాతీయ సగటుకు మించి 100% వ్యాక్సినేషన్
- ఏపీలో 99.9 శాతం ఆస్పత్రుల్లోనే కాన్పులు
- నూటికి నూరు శాతం యాంటి నేటల్ చెకప్‌లు
- బడికి వెళ్లే బాలబాలికలకు ఐరన్ ట్యాబ్లెట్లు
- రాష్ట్రాల్లో 2021–22 వైద్య సేవలపై కేంద్రం నివేదిక


10 లో

మూలికా వైద్యం.. కేరాఫ్

గంధసిరి

సనాతన వైద్యంతో మొండి రోగాలు సైతం మాయం




వన మూలికల వివరాలు వెల్లడిస్తున్న గురూజీ

అంతరించిపోతున్న సనాతన వనమూలికా వైద్యానికి ఓ గ్రామం నెలవుగా మారింది. మొండి రోగాలను సైతం ఈ వైద్యం మాయం చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులను సైతం ఆకర్షిస్తూ వారి ప్రశంసలందుకుంటోంది. లక్షలాది మంది సాధారణ ప్రజల జబ్బులు సైతం తగ్గిస్తూ ఈ మూలికా వైద్యం అపర సంజీవనిగా నిలుస్తోంది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని గంధసిరి గ్రామం ఇందుకు వేదికగా మారింది. వనమూలికా వైద్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన, ఈ గ్రామానికి చెందిన పస్తం సహదేవరాజ్ తాను వైద్య సేవలందిస్తూనే, తన తెగకు చెందిన 150 మందికి ఇందులో శిక్షణ ఇచ్చారు. ఈ వైద్యం తనతోనే అంతరించి పోకుండా తన పిల్లలకు సైతం నేర్పించారు.

దేశ, విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన వైనం

- మొత్తం 364 వన మూలికలతో చికిత్స
- మాజీ ప్రధానులు, ప్రముఖుల నుంచి ప్రశంసలు
- సాధారణ ప్రజల మన్ననలూ పొందుతున్న సహదేవరాజ్



తాతల కాలం నాటి విద్య..

- సాక్షి ప్రతినిధి, ఖమ్మం

శబరికోయ తెగకు చెందిన కొన్ని కుటుంబాలు ఏళ్ల క్రితం భద్రాచలం ప్రాంతం నుంచి గంధసిరి గ్రామానికి వలస వచ్చాయి. తమ తాతలు, తండ్రులు నేర్పిన మూలికా వైద్యాన్ని వంట బట్టించుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైద్యం చేయడం ప్రారంభించాయి. ఈ కుటుంబాలకు చెందిన సహదేవరాజ్ 1979లో మొదలుపెట్టిన మూలికా వైద్యం దేశ విదేశాలకు విస్తరించింది. దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు తొలిసారిగా 1996లో లండన్ వెళ్లారు. అక్కడ బ్రిటన్ రాణిని కూడా కలిశారు. ఈ క్రమంలోనే నేపాల్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, మలేసియా, ఇండోనేసియా తదితర దేశాల్లోనూ వైద్య సేవలందించారు. మరోవైపు అమెరికా, కెనడా నుంచి కూడా పలువురు ఇక్కడకు వచ్చి మూలికా వైద్యం చేయించుకున్నారు. పక్షవాతం, ఆస్తమా, సోరియాసిస్, కీళ్లవాతం తదితర దీర్ఘకాల రోగాల నుంచి ఉపశమనం పొందుతున్నారు.

ధన్వంతరి స్ఫూర్తిగా..

మా ముత్తాతలు, తాతలు, తండ్రులు చేసిన వైద్యాన్నే మేమూ చేస్తున్నాం. కుటుంబంలో ఎవరికి జబ్బుచేసినా అదే కుటుంబంలోని మరొకరు కాపాడటంతోనే ఈ మూలికా వైద్యం పుట్టింది. మాకు ధన్వంతరి భగవాన్ స్ఫూర్తి. దేశ, విదేశాలకు వెళ్లి ప్రముఖులకు చికిత్స చేశాం. ఈ విధానం అంతరించిపోకుకుండా దీన్ని మా పిల్లలకూ నేర్పించాం. మూలికా వైద్యంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

అడవుల్లో సేకరించి అనువుగా మార్చి..

ఈ వైద్య విధానంలో 364 రకాల మూలికలను ఉపయోగిస్తామని సహదేవరాజ్ చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌లోని కుంట, బస్తర్, శ్రీశైలం, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని అడవుల్లో వనమూలికలను సేకరించి గంధసిరి, కోయంబత్తూరులోని సహదేవరాజ్ ఆశ్రమాల్లో వైద్యానికి అనువుగా తయారు చేస్తారు. గ్రామానికి చెందిన 150 మంది ఆయన పర్యవేక్షణలో శిక్షణ పొంది అడవుల నుంచి మూలికలు తీసుకురావడంలో సహకరిస్తున్నారు.



ఎలిజబెత్ రాణి ప్రశంసలు..

గంధసిరి మూలికా వైద్యం సామాన్యులతో పాటు ప్రముఖుల మన్ననలు కూడా పొందింది. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, చంద్రశేఖర్, మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్, ఉమ్మడి ఏపీలోని పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు ఈ వైద్యం తీసుకున్నారు. ఇక నాటి బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 కూడా సహదేవ్‌రాజ్ ములికా వైద్యాన్ని ప్రశంసించారు. దీంతో ఆయన ఆస్ట్రేలియాలో బ్రాంచ్ ఏర్పాటు చేయగా మరిన్ని దేశాల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. మన దేశం, రాష్ట్రానికి చెందిన ప్రముఖులు కూడా ఆయన వద్ద వైద్యం పొందుతున్నారు. గంధసిరిలో ఈ నెల 6న వైద్య వనమూలిక ట్రస్ట్ ప్రారంభించేందుకు సహదేవ్‌రాజ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన తెగకు చెందిన ఇంకొందరికి ఈ ట్రస్ట్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు.





నెలరోజుల్లో సైనస్ తగ్గింది..

నాకు సైనస్, మోకాళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉండేవి. ఇవి తగ్గడానికి గతంలో వేల రూపాయలు ఖర్చు చేశా. ఫలితం లేకపోవడంతో గురూజీ సహదేవరాజ్ వనమూలిక వైద్యం గురించి తెలుసుకుని గత నెల గంధసిరికి వచ్చా. నాతోపాటు నా కుమారుడికి సైనస్, భార్యకు బీపీ, థైరాయిడ్‌కు సంబంధించి కూడా వనమూలికలు తీసుకున్నా. నాకు నెలరోజుల్లో సైనస్ తగ్గింది. వారికి కూడా ఉపశమనం కలిగింది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మూలికా వైద్యం చాలా బాగుంది.
- పసునూరు జయపాల్‌రెడ్డి, ప్రసన్నాంజనేయస్వామి టెంపుల్ చైర్మన్, చంపాపేట, హైదరాబాద్

నీటిలోని చేప

నేలమీద పడ్డట్టు..



రెండు రోజులుగా వేలాదిగా మృత్యువాత
కోనసీమలోని పర్ర భూముల్లో పరిస్థితి

నీటిలో చేప నేల మీదకొచ్చి గిలగిలా కొట్టుకుంటోంది.. కాలుష్యం వాటి ఊపిరి తీస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సహజ సిద్ధంగా ఏర్పడిన పర్ర భూముల్లో ప్రస్తుత పరిస్థితి ఇది.. గౌతమీ నది సముద్ర సంగమ ప్రాంతం నుంచి వైనతేయ నది సముద్ర సంగమ ప్రాంతం వరకూ పర్ర భూములు విస్తరించి ఉన్నాయి. తీరంలోని మత్స్యకార గ్రామాలకు చెందిన వేలాది కుటుంబాలకు ఇవే ఆధారం. అటువంటి పర్ర భూముల్లోని సహజ సిద్ధమైన మత్స్య సంపదను కాలుష్యం కాటేస్తోంది. రెండు రోజులుగా వేలాది చేపలు చనిపోతుండడమే అందుకు సాక్ష్యం.

– సాక్షి అమలాపురం/ఉప్పలగుప్తం

జిల్లాలో కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో సహజ సిద్ధమైన పర్ర భూములు ఉన్నాయి. సుమారు ఆరు వేల ఎకరాల్లో పర్ర భూములు, 6,500 హెక్టార్లలో మడ అడవులు కలసి ఉన్నాయి. పర్ర భూమితో పాటు నదీ పాయల మధ్య ఉన్న మడ అడవుల్లో అపార మత్స్య సంపద ఉంది. పండుగొప్ప, కొయ్యింగ, చందువా, కట్టి చేపలు, మడ పీత, తెల్ల పీత, పచ్చి పీత, టైగర్ రొయ్యలతో పాటు పలు రొయ్యలు ఉంటాయి. మురుగునీటి కాలువలు, నదీపాయలు, సముద్ర పోటు సమయంలో వచ్చే నీటితో నిండి ఉండే పర్ర భూముల్లో చేపలు, రొయ్యలు, పీతలు సహజ సిద్ధంగా పెరుగుతాయి. అందువల్ల ఇవి రుచికరంగా ఉంటాయి. దీనివల్ల డిమాండ్ అధికంగా ఉంటోంది. వీటిని మత్స్యకారులు వేటాడి స్థానిక మార్కెట్‌కే కాకుండా హైదరాబాద్, ముంబయి వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. పచ్చ పీత సింగపూర్‌కు సైతం ఎగుమతి అవుతోంది.

మత్స్యకారుల జీవనం అదే..

కాట్రేనికోన మండల పరిధిలోని పల్లం, కొత్తపాలెం, బలుసుతిప్ప, చిర్రయానాం, మొల్లేటిమొగ, పోర, గచ్చకాయల పొర గ్రామాలతో పాటు, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, చల్లపల్లి, వాసాలతిప్ప, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి, అల్లవరం మండలం నక్కా రామేశ్వరం, కొమరగిరిపట్నం, సామంతకుర్రుల్లో సుమారు రెండు వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరంతా ఈ పర్ర భూములు, మడ అడవుల నదీ పాయల మధ్య వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ఎందుకిలా.. ఏం జరుగుతోంది!

- సహజ సిద్ధంగా పెరిగే మత్స్య సంపదను ఆక్వా, చమురు సంస్థల నుంచి వస్తున్న కాలుష్యం కాటేస్తోంది. గడచిన రెండు రోజులుగా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం అల్లిపర్రలో వేలాదిగా చేపలు మృత్యువాత పడుతున్నాయి.
- చేపలు, రొయ్యల చెరువుల నుంచి నీరు, వ్యర్థాలను పర్రభూముల్లోకి నేరుగా తోడుతున్నారు. చెరువు దిగువన ఉండే వ్యర్థాల బురదను తీసుకువచ్చి పర్రలో వదులుతున్నారు. చేపల చెరువుల్లో రెండు మూడేళ్లకు గాని నీరు మార్చరు. ఈ నీటితో పాటు వ్యర్థాలతో కూడిన నీటిని పర్ర భూములతో పాటు వాటికి అనుసంధానంగా ఉండే మురుగునీటి కాలువలు, ఉప్పుటేర్లలోకి విడిచి పెడుతున్నారు.
- చెరువుల్లో యాంటీ బయోటిక్, రసాయనాలు, కోడిపెంటను అధికంగా వాడుతున్న విషయం తెలిసిందే. వీటివల్ల బురద నీటిలో అమోనియం, నైట్రేట్ వంటి విష వాయువులు చేరి వేలాదిగా చేపలు చనిపోతున్నాయి.
- వేసవి ఎండలు పెరగడంతో పర్ర భూముల్లో నీటిమట్టం తగ్గిపోవడం వల్ల నీటిలో ఆక్సిజన్ లోపించడంతో మత్స్య సంపదకు ప్రాణసంకటంగా మారింది.
- స్థానికంగా ఉన్న చమురు సంస్థలు వాడి వదిలేసిన నీరు నేరుగా పర్రభూముల్లో వచ్చి కలుస్తోంది. దీనివల్ల చేపలు పెద్దఎత్తున చనిపోతున్నాయి. చమురు సంస్థల కార్యకలాపాలతో తీరంలోని మత్స్య సంపద తగ్గిపోగా, చివరకు పర్ర భూముల్లో కూడా తగ్గడంతో మత్స్యకారుల ఉపాధికి గండి పడుతోంది.
- పర్రభూములను ఆక్రమించి ఆక్వా సాగు చేయడంతో ఇప్పటికే వేలాది ఎకరాల భూములు కనుమరుగయ్యాయి. దీనికితోడు వీటి కాలుష్యానికి దొరికే కొద్దిపాటి మత్స్య సంపద మృత్యువాత పడడంతో తీరంలోని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వందలాది మత్స్యకారులు వేటను వదిలి ఇతర ప్రాంతాలకు వలస పోయే పరిస్థితి వచ్చింది.

వ్యర్థాలను వదిలేస్తున్నారు

పర్రను ఆనుకుని ఉన్న కెయిర్న్ సంస్థ వ్యర్థాల నీరు పర్రలోకి వదిలేస్తున్నారు. మా బతుకంతా పర్ర భూమిపైనే. మరో జీవనాధారం లేదు. వీటిలో కూడా చేపలు చనిపోతున్నాయి. ఓఎన్జీసీ అధికారులను అడిగితే మాకు సంబంధం లేదని చేతులు దులుపుకొంటున్నారు.
– లంకే చిరంజీవి, మత్స్యకార సంఘ అధ్యక్షుడు, ఎస్.యానం, ఉప్పలగుప్తం మండలం

వేట లేకుండా పోయింది

ఎస్.యానాం గ్రామంలో పర్ర భూమిపైనే 600 మంది జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు వేట లేకుండా పోయింది. ఈ సీజన్‌లోనే చేపలు ఎక్కువగా దొరుకుతాయి. మే తరువాత నుంచి సంక్రాంతి వరకూ వేట ఉండదు. ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని మమ్మల్ని ఆదుకోవాలి.
– పల్లిప్రోలు పోతురాజు, మత్స్యకారుడు, ఎస్.యానాం, ఉప్పలగుప్తం మండలం



నూతన వధూవరులకు సీఎం ఆశీస్సులు

ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమార్తె డాక్టర్ లక్ష్మీ సింధూజ, డాక్టర్ ఎ.సుబ్బరాజు వివాహం పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కలగంపూడిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం అర్ధరాత్రి ఘనంగా జరిగింది. వివాహ వేడుకకు ముందుగా జరిగిన రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. -నరసాపురం

క్రీడలతో శారీరక దృఢత్వం

- విద్యార్థులు అకడమిక్స్, స్పోర్ట్స్‌కు సమాన ప్రాధాన్యతనివ్వాలి : పీవీ సింధు
- ఘనంగా ముగిసిన విటోపియా–2023 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పీవీ సింధు

తాడికొండ : క్రీడలతో శారీరక దృఢత్వం పొందడంతో పాటు మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని.. విద్యార్థులు అకడమిక్స్‌తోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యతనివ్వాలని ఒలింపిక్ పతక విజేత, పద్మభూషణ్ పీవీ సింధు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ–ఏపీ వర్సిటీలో రెండ్రోజులుగా జరుగుతున్న విటోపియా–2023 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం ఆదివారంతో ముగిసింది. పీవీ సింధు మాట్లాడుతూ.. తాను బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ ఎంబీఏ పూర్తిచేశానన్నారు. వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కోటారెడ్డి ప్రసంగిస్తూ.. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 48 వర్సిటీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఇక విటోపియా–2023లో ప్రపంచ పారా ఒలింపిక్ వాలీబాల్ గేమ్‌కు ఇండియా తరఫున ఆడే పారా ఒలింపిక్ వాలీబాల్ జట్టును ఎంపిక చేయడం గర్వకారణమన్నారు. పోటీల్లో విజేతలకు పీవీ సింధు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో విజేతలకు చిత్ర పరిశ్రమ దర్శకులు బాబీ కొల్లి, కథానాయిక పాయల్ రాజ్‌పుత్ బహుమతులు అందజేశారు. ఫ్యాషన్ షో.. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ బృందంతో సాగిన గీతాలాపన అందరినీ ఆకట్టుకుంది. ట్విన్ స్ట్రింగ్స్ ఇండియన్ బ్యాండ్ సంగీతం ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేసింది.

బాబు నిర్వాకాలతో అదనపు భారం

- పోలవరంపై నాడు అరకొరగా, తొందరపాటు పనులు
- ఇది కచ్చితంగా మానవ తప్పిదమే: మంత్రి అంబటి



పోలవరం రూరల్: చంద్రబాబు సర్కారు తప్పిదాలే పోలవరానికి శాపాలుగా మారాయని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రాంతాన్ని ఆదివారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. మీడియాతో మాట్లాడుతూ పోలవరాన్ని చంద్రబాబు ప్రచారం కోసం మాత్రమే వాడుకున్నారని విమర్శించారు. ప్రాజెక్టు ఆవశ్యకతను గుర్తించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే తరువాతి ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా అరకొరగా చేపట్టిన పనులు, తొందరపాటు చర్యలు పోలవరం జాప్యానికి కారణమయ్యాయని తెలిపారు. గత సర్కారు నిర్వాకాలతో కీలకమైన డయాఫ్రమ్ వాల్ గోదావరి వరదలకు దెబ్బతిందని గుర్తు చేశారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు నిర్మించకుండా డయాఫ్రమ్ వాల్ కట్టడంతో వాల్ దెబ్బతినడంతో పాటు ఇరువైపులా భారీ గోతులు ఏర్పడ్డాయన్నారు. ఇది కచ్చితంగా మానవ తప్పిదమేనని, దీంతో అదనపు భారం పడుతోందన్నారు.

ఈ సీజన్‌లో పనులు వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వం పోలవరాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో రూ.3 వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంబటి తెలిపారు. ఇందులో రూ.1,800 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం సూచనప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు. ఇప్పటివరకు రూ.366 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. మిగిలిన నిధులు కూడా విడుదల చేయాలని సీఎం జగన్ కేంద్రం దృష్టికి తెచ్చారన్నారు. ఈ సీజన్‌లో పనుల పురోగతికి ఎక్కువ అవకాశం ఉందని తెలిపారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు ఇరువైపులా ఏర్పడిన గోతులను ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తామన్నారు. గుంతలను శాస్త్రీయ పద్ధతుల్లో పూడ్చి వేస్తామని తెలిపారు. డీడీఆర్‌పీ సూచనల మేరకు ఈ పనులు పూర్తిచేసి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు చేపడతామన్నారు. గుంతలు పూడ్చడానికే రూ.2 వేల కోట్లు ఖర్చయ్యే పరిస్థితి ఉందన్నారు. డయాఫ్రమ్‌వాల్ మరమ్మతులకు ఎంత ఖర్చవుతుందో తెలియాల్సి ఉందన్నారు. గతంలో డయాఫ్రమ్‌వాల్‌కు రూ.400 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులు పూర్తయ్యాయని, డయాఫ్రమ్‌వాల్ గుంతలు పూడ్చివేతకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. డయాఫ్రమ్‌వాల్ పరిస్థితిపై ఎన్‌హెచ్‌పీసీ పరిశీలన అనంతరం కొంత స్పష్టత వచ్చిందన్నారు.

ప్రభుత్వ మద్దతు అమోఘం

- అందుకే మా పెట్టుబడులను ఇక్కడే భారీగా విస్తరిస్తున్నాం
- జీఐఎస్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పిన పారిశ్రామికవేత్తలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికే వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు తమ భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై తమకున్న విశ్వాసాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు వేదికగా ప్రపంచానికి చాటిచెప్పారు. విశాఖలో జరిగిన రెండ్రోజుల జీఐఎస్ సదస్సులో కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకోవడమే కాకుండా ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న వివిధ సంస్థలు తమ భారీ విస్తరణ కార్యక్రమాలను ప్రకటించాయి. రిలయన్స్ గ్రూపు దగ్గర నుంచి కొత్త తరం నోవా ఎయిర్ సంస్థ వరకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందిస్తున్న తీరును సభా వేదికగా కీర్తించాయి. అంతేకాక.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రండి అంటూ ఇతర పారిశ్రామికవేత్తలను ఆయా సంస్థల అధిపతులు ఆహ్వానించడం విశేషం. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం, రిటైల్ వంటి వ్యాపారాల్లో ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టామని.. ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతుతో మరో రూ.50,000 కోట్లతో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ పార్కును ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు.

అదానీ మరో రూ.43,664 కోట్లు

అలాగే.. అదానీ గ్రూపు పోర్టులు, సిమెంట్ వంటి రంగాల్లో రాష్ట్రంలో సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టగా భవిష్యత్తులో ఆయా రంగాల్లో సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు ఏపీ సెజ్ సీఈఓ కరణ్ అదానీ ప్రకటించారు. రాష్ట్రంలో డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీతో పాటు వివిధ రంగాల్లో రూ.43,664 కోట్ల పెట్టుబడులను పెట్టే విధంగా అదానీ గ్రూపు ఒప్పందం కుదుర్చుకుంది. ఇక లాక్‌డౌన్ కాలంలో తక్కువ సమయంలో యూనిట్‌ను ప్రారంభించామని, దీనికి రాష్ట్ర మద్దతే కారణమని నోవా ఎయిర్ సీఈఓ, ఎండీ గజానన్ నంబియార్ స్పష్టంచేశారు. సాధారణంగా ఆక్సిజన్ వంటి పారిశ్రామిక వాయువుల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేయడానికి కనీసం 18 నుంచి 24 నెలల సమయం పడుతుందని, కానీ కేవలం 14 నెలల కాలంలోనే యూనిట్‌ను ప్రారంభించి వేలాది మంది జీవితాలను కాపాడినట్లు ఆయన తెలిపారు.

జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్లు

జిందాల్ స్టీల్ పవర్ చైర్మన్ నవీన్ జిందాల్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో ఏపీ పారిశ్రామిక రాష్ట్రంగా ఎదగనుందన్నారు. అందుకే తన సోదరుడికి చెందిన జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. ఇక, ఇతర రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ పార్కును దక్కించుకుంది. దీనితో రాష్ట్రంలో ఫార్మా రంగం మరింతగా విస్తరించనుంది. సాధారణంగా ఫార్మా పరిశ్రమ స్థాపనకు మూడు నుంచి నాలుగేళ్లు పడుతుందని, కానీ అన్ని అనుమతులున్న బల్క్ డ్రగ్ పార్కులో తక్షణం కార్యకలాపాలు మొదలుపెట్టే అవకాశం కలుగుతుందని దివీస్ ఫార్మా వైస్ ప్రెసిడెంట్ మధుబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా రంగానికి ఇస్తున్న మద్దతుతో తాము మరింతగా కార్యకలాపాలు విస్తరించడానికి రూ.వేల కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు దివీస్, లారస్, హెటిరో, అపోలో తదితర సంస్థలు ప్రకటించాయి. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్న సంస్థలు ఇలా భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించడంతో రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెళ్లిపోతున్నాయంటూ తెలుగుదేశంతో పాటు దాని అనుబంధ పత్రికల దుష్ప్రచారానికి తెరపడుతుందని భావిస్తున్నట్లు పారిశ్రామికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

సంస్థ	పెట్టుబడి (రూ.కోట్లల్లో)	ఉపాధి
ఎన్టీపీసీ	2,35,000	77,000
జేఎస్‌డబ్ల్యూ	50,632	9,500
రిలయన్స్	50,000	10,000
అదానీ గ్రూపు	43,664	53,815
హెచ్‌పీసీఎల్	14,320	1,500
అరబిందో	10,365	5,250
ఆదిత్య బిర్లా	9,300	2,850
ఐఓసీఎల్	4,300	1,500
సన్నీ ఆప్టెక్	2,500	2,000
అల్ట్రాటెక్	2,500	2,000
ఆంధ్రా పేపర్	2,000	2,300
మాండలీజ్	1,600	150
లారస్ గ్రూపు	1,210	1,700
దివీస్	1,100	3,700
సెల్‌కాన్ రిజల్యూట్	1,000	5,000

మానవ తప్పిదమే

- డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్‌పై తేల్చేసిన ఎన్‌హెచ్‌పీసీ
- వరద మళ్లించేలా స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌లు కట్టకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ఘోర తప్పిదం
- కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడంతో 2019లో పోటెత్తిన గోదావరి
- ప్రధాన డ్యామ్ గ్యాప్–2 ప్రాంతంలో 35 మీటర్ల మందంతో కోతకు గురైన నదీ గర్భం
- డయాఫ్రమ్ వాల్ ఎడమవైపు 175–363 మీటర్లు, కుడివైపు 1,170–1370 మీటర్ల మధ్య కోత
- 480–510 మీటర్లు, 950–1,020 మీటర్ల మధ్య 20 మీటర్ల లోతు వరకు దెబ్బతిన్న 'డయాఫ్రమ్'
- ఆది నుంచి చెబుతున్న వాస్తవాలను అధికారికంగా ధ్రువీకరించిన ఎన్‌హెచ్‌పీసీ నివేదిక
- చంద్రబాబు నిర్వాకాలు మరోసారి తేటతెల్లం... నిర్మాణంలో జాప్యానికి ఈ పాపాలే కారణం


దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ ప్రాంతం.. (ఫైల్)

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరంపై చంద్రబాబు సర్కారు అనాలోచిత నిర్ణయాలు.. ప్రణాళికా రాహిత్యం.. కమీషన్ల దాహంతోనే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని ఆది నుంచి చెబుతున్న వాస్తవాలను ఎన్‌హెచ్‌పీసీ నివేదిక అధికారికంగా ధ్రువీకరించింది. చంద్రబాబు పాపాలే ప్రాజెక్టుగా శాపాలుగా మారాయని, లేదంటే 2021 నాటికే సీఎం జగన్ పోలవరాన్ని పూర్తి చేసేవారని నీటి పారుదల రంగ నిపుణులు, అధికార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

800 మీటర్లకు కుచించుకుపోవడంతో..

గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ చానల్, స్పిల్‌వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా టీడీపీ సర్కారు ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడం ఘోర తప్పిదమని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) నివేదిక తేల్చి చెప్పింది. ఆ మానవ తప్పిదం వల్లే 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడంతో ఖాళీ ప్రదేశం 800 మీటర్లకు కుచించుకుపోయి ప్రవహించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇది వరద ఉధృతి తీవ్రతరం కావడానికి దారితీసింది. అందువల్లే ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గ్యాప్–1లో 35 మీటర్లు, గ్యాప్–2లో 20 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయని ఎన్‌హెచ్‌పీసీ స్పష్టం చేసింది. గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ ఎడమ వైపున 175 మీటర్ల నుంచి 363 మీటర్ల వరకు ధ్వంసం కాగా కుడి వైపున 1,170 నుంచి 1,370 మీటర్ల వరకు పూర్తిగా ధ్వంసమైందని తేల్చింది. 480 మీటర్ల నుంచి 510 మీటర్ల వరకు, 950 మీటర్ల నుంచి 1,020 మీటర్ల వరకు రెండు చోట్ల 20 మీటర్ల లోతు వరకూ డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తేల్చింది. ఫలితంగా భూగర్భంలో గోదావరి ప్రవాహాన్ని సమర్థంగా అడ్డుకట్ట వేయలేదని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను పటిష్టం చేసే చర్యలు చేపడితేనే లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపింది.

ఎన్‌హెచ్‌పీసీ సమగ్ర అధ్యయనం..

పోలవరం వద్ద భౌగోళిక పరిస్థితుల రీత్యా వరద ప్రవాహాన్ని మళ్లించే స్పిల్‌వేను నదీ తీరానికి కుడి వైపున రాతి నేలపై, 194.6 టీఎంసీలను నిల్వ చేసే ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్‌ను నదికి అడ్డంగా నిర్మించేలా కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ప్రాజెక్టు డిజైన్‌ను ఆమోదించింది. ప్రధాన డ్యామ్‌కి పునాదిగా డయాఫ్రమ్ వాల్ వేయాలని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను నిర్మిస్తేనే భూగర్భంలో గోదావరి ప్రవాహం ఎగువ నుంచి దిగువకు, దిగువ నుంచి ఎగువకు వెళ్లకుండా అడ్డుకుంటుంది. అంటే లీకేజీ (ఊట నీరు)కి పూర్తిగా అడ్డుకట్ట వేస్తుంది. ఇది ప్రధాన డ్యామ్ చెక్కు చెదరకుండా కాపాడుతుంది. ప్రధాన డ్యామ్‌కు అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్‌ను గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించే పనులు పూర్తి చేశాకే చేపట్టాలి. గత సర్కారు అనాలోచితంగా అందుకు విరుద్ధంగా చేపట్టడంతో 2019లో వచ్చిన వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈ క్రమంలో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించింది. సీడబ్ల్యూసీ సూచనల మేరకు ఎన్‌హెచ్‌పీసీకి ఈ బాధ్యతను అప్పగించింది. జనవరి 26 నుంచి ఫిబ్రవరి 10 వరకూ నాలుగు రకాల పరీక్షలు నిర్వహించిన ఎన్‌హెచ్‌పీసీ సమగ్రంగా విశ్లేషించి రాష్ట్ర జలవనరుల శాఖకు నివేదిక అందచేసింది.

ఈ పాపం.. చంద్రబాబుదే

పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయంతో తామే పూర్తి చేస్తామని విభజన చట్టం సాక్షిగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నాడు సీఎం హోదాలో చంద్రబాబు కోరారు. ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధం కావడంతో 2016 సెప్టెంబరు 6న ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. ఈ క్రమంలో 2013–14 ధరల ప్రకారమే నీటిపారుదల విభాగం వ్యయంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని కేంద్రం విధించిన షరతులకు చంద్రబాబు తలొగ్గారు. రూ.3,302 కోట్ల విలువైన జలాశయం పనులను 'ఈనాడు' రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు, ఎడమ కాలువలో రూ.150 కోట్ల పనులను నాటి ఆర్థిక మంత్రి యనమల వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కు నామినేషన్‌పై కట్టబెట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. ఈ పాపాల కారణంగానే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. వీటిని సరిదిద్ది సవాళ్లను అధిగమిస్తూ ప్రణాళికాబద్ధంగా సీఎం జగన్ పోలవరాన్ని పూర్తి చేస్తున్నారు.

ఆలయాలకు కొనే సరుకులకు నాణ్యత పరీక్ష తర్వాతే బిల్లు

- ప్రసాదం తయారీ, అన్నదానానికి ఎక్కువ మోతాదులో ఉపయోగించే సరుకులకు వర్తింపు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ప్రసాదం తయారీ, అన్నదానం, పూజా కార్యక్రమాల్లో అధిక మోతాదులో ఉపయోగించే సరుకుల కొనుగోలు సమయంలో వాటి నాణ్యత ధ్రువీకరణ తర్వాతే బిల్లులు చెల్లించాలని ఆ శాఖ నిర్ణయించింది. విజయవాడ దుర్గగుడి వంటి పెద్ద ఆలయాలు ఒక్కోటి ఏటా దాదాపు రూ.10 కోట్ల విలువ కలిగిన సరుకులు కొనుగోలు చేస్తుంటాయి. ఇందుకోసం ఆలయ ఈవో స్థాయిలోనే టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆలయాల్లో ప్రసాదాల తయారీతో పాటు అన్నదానంలో నాణ్యమైన సరుకులను ఉపయోగించే అంశంపై ఉపముఖ్యమంత్రి(దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ ఇటీవల రెండు విడతలుగా ఆ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ మేరకు వివిధ వస్తువుల కొనుగోలుకు సంబంధించి టెండర్ల విధానంలో పలు మార్పులు, చేర్పులకు సంబంధించిన విధివిధానాలపై ఆదివారం అన్ని ఆలయాల ఈవోలకు దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ ఆదేశాలిచ్చారు. ఆలయాల అవసరాల కోసం కొనుగోలు చేసే బియ్యం, శనగపిండి, శనగపప్పు, కందిపప్పు, చింతపండు, నెయ్యి, సన్‌ఫ్లవర్ లేదా ఇతర రిఫైండ్ ఆయిల్, జీడిపప్పు, కిస్మిస్, యాలకులు వంటి వాటికి నాణ్యత పరీక్షల నిర్వహణకు దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలోనే క్వాలిటీ కంట్రోల్ లేదా ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ల్యాబ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రభుత్వ ఆమోదం పొందిన ల్యాబ్‌లలో నాణ్యత ధ్రువీకరణ సర్టిఫికెట్ ఆధారంగానే బిల్లులు చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆదేశాల్లో ఏం ఉందంటే..

- ➡ కాంట్రాక్టర్ సరఫరా చేసే ప్రతి బ్యాచ్ సరుకులకు ఆహార కల్తీ పరీక్ష, రసాయన కలుషిత పరీక్ష, సూక్ష్మ జీవుల పరీక్ష, ఔషధ అవశేషాల పరీక్షలు నిర్వహించాలి. కాంట్రాక్టర్ సరుకులను సరఫరా చేసిన వెంటనే అన్ని రకాల సరుకుల నుంచి ఇద్దరు ఉద్యోగుల సమక్షంలో గాజు సీసాల్లో నమూనాలను సేకరించి, వాటిని పరీక్షలకు పంపాలి.
- ➡ అగ్‌మార్క్ ధ్రువీకరణతో కూడిన సరుకులు మాత్రమే ఆలయాల అవసరాలకు కొనుగోలు చేయాలి.
- ➡ సరుకుల కొనుగోలు టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్ కనీసం రూ.5 కోట్ల వార్షిక టర్నోవర్, అన్నదానం సరుకుల కొనుగోలు టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు కనీసం 2 కోట్ల టర్నోవర్, పూజా కార్యక్రమాల సరుకుల కొనుగోలు టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్ రూ.కోటి టర్నోవర్ కలిగి ఉండాలి.

కోతకు గురైన ప్రాంతంలో కొత్త డయాఫ్రమ్ వాల్

దెబ్బతిన్న చోట సమాంతరంగా కొత్తగా నిర్మాణం

- మరో రెండు చోట్ల సరిదిద్దే విధానంపై సీడబ్ల్యూసీతో చర్చ
- ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి
- ఆ పనులు గోదావరికి వరద వచ్చేలోగా పూర్తి
- ఆ తర్వాత ప్రధాన డ్యామ్ పనులు – జలవనరుల శాఖకు డీడీఆర్పీ దిశానిర్దేశం
- అదనపు వ్యయాన్ని చెల్లించేలా కేంద్రానికి సిఫార్సు చేయండి
- అధికారుల వినతిపై సానుకూలంగా స్పందించిన డీడీఆర్పీ చైర్మన్ పాండ్య
- కీలక సమస్యలకు పరిష్కారం దొరకడంతో పనులు వేగవంతానికి ప్రభుత్వం సన్నద్ధం

సాక్షి, అమరావతి: గోదావరి వరదల ఉధృతికి పోలవరం ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో ఇరువైపులా కోతకు గురైన ప్రాంతంలో దెబ్బతిన్న చోట సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించాలని జలవనరుల శాఖకు డీడీఆర్పీ సూచించింది. కోతకు గురికాని ప్రాంతంలో రెండు చోట్ల 20 మీటర్ల లోతు వరకు దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడంపై మరింత క్షుణ్నంగా అధ్యయనం చేసి కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ)తో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది.

జలవనరుల శాఖ అధికారులతో భేటీ

గోదావరి వరదల ఉధృతికి ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం గ్యాప్–1లో 35 మీటర్ల లోతు, గ్యాప్–2లో 20 మీటర్ల లోతుతో ఏర్పడిన భారీ అగాధాలను ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ (బోరు బావి తవ్వి వైబ్రో కాంపాక్షన్ యంత్రంతో అధిక ఒత్తిడితో భూగర్భాన్ని మెలి తిప్పడం ద్వారా పటిష్టం చేయడం) ద్వారా యథాస్థితికి తేవచ్చంటూ ఏడు నెలల క్రితం రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు చేసిన ప్రతిపాదనకు డీడీఆర్పీ తాజాగా ఆమోదం తెలిపింది. కోతకు గురైన ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులను గోదావరికి వరద వచ్చేలోగా పూర్తి చేయాలని నిర్దేశించింది. ఆ తర్వాత డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దే పనులు పూర్తి చేసి ప్రధాన డ్యామ్ పనులు చేపట్టి ప్రాజెక్టును పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేసింది. ఈ నేపథ్యంలో అత్యంత కీలకమైన సమస్యలకు డీడీఆర్పీ పరిష్కార మార్గాలు చూపడంతో పోలవరం ప్రాజెక్టు పనుల్లో మరింత వేగం పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. పోలవరం పనులను ఏబీ పాండ్య నేతృత్వంలోని డీడీఆర్పీ బృందం శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ క్రమంలో ఆదివారం రాజమహేంద్రవరంలో సీడబ్ల్యూసీ సభ్యులు ఎస్కే సిబాల్, పీపీఏ సీఈవో శివ్‌నందన్‌కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తదితరులతో సమీక్ష నిర్వహించింది. డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చే పరీక్షలు నిర్వహించిన ఎన్‌హెచ్‌పీసీ బృందం సమర్పించిన నివేదికను తాజా సమావేశంలో డీడీఆర్పీ ప్రవేశపెట్టింది.



సరిదిద్దే మార్గం ఇలా..

- ➡ కోతకు గురైన ప్రాంతంలో డయాఫ్రమ్ వాల్ గ్యాప్–2లో ఎడమ వైపున 175 నుంచి 363 మీటర్ల పొడవున అంటే 188 మీటర్ల పొడవు.. కుడి వైపున 1,170 నుంచి 1,370 మీటర్ల పొడవున అంటే 200 మీటర్ల పొడవున పూర్తిగా దెబ్బతిందని ఎన్‌హెచ్‌పీసీ తెలిపింది. ఈ ప్రాంతంలో ధ్వంసమైన డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించాలని డీడీఆర్పీ ఆదేశించింది.
- ➡ డయాఫ్రమ్ వాల్‌లో 480 – 510 మీటర్ల మధ్య 30 మీటర్ల పొడవున ఒక చోట, 950 – 1,020 మీటర్ల మధ్య 70 మీటర్ల పొడవున మరోచోట 20 మీటర్ల లోతు వరకూ డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నట్లు ఎన్‌హెచ్‌పీసీ తేల్చింది. ఈ రెండు ప్రాంతాల్లో డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడంపై మరింత అధ్యయనం చేసి సీడబ్ల్యూసీ సూచనల మేరకు దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డీడీఆర్పీ సూచించింది.
- ➡ మిగతా ప్రాంతంలో డయాఫ్రమ్ వాల్‌కు రెండు మీటర్ల లోతు నుంచి ఇరువైపులా బంకమట్టి (కోర్) నింపి దానిపై ప్రధాన డ్యామ్‌ను నిర్మించేలా సీడబ్ల్యూసీ గతంలో డిజైన్‌ను ఆమోదించింది. అయితే డయాఫ్రమ్ వాల్‌కు ఐదు మీటర్ల లోతు నుంచి ఇరువైపులా బంకమట్టి నింపి దానిపై ప్రధాన డ్యామ్‌ను నిర్మించాలని డీడీఆర్పీ సూచించింది. దీనివల్ల ఊట నీటిని డయాఫ్రమ్ వాల్ సమర్థంగా అడ్డుకుంటుందని తేల్చింది.

రూ.రెండు వేల కోట్లకు పైగా వ్యయం..

గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడం, కోతకు గురైన ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులకు సుమారు రూ.రెండు వేల కోట్లు వ్యయం అవుతుందని అధికారవర్గాలు అంచనా వేశాయి. కోతకు గురైన ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులకే 48 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని లెక్కలు వేశారు. ఈ నేపథ్యంలో అదనంగా వ్యయమయ్యే రూ.రెండు వేల కోట్లను మంజూరు చేసేలా కేంద్రానికి సిఫార్సు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ చేసిన విజ్ఞప్తిపై డీడీఆర్పీ చైర్మన్ ఏబీ పాండ్య సానుకూలంగా స్పందించారు.

రాష్ట్ర అధికారుల ప్రతిపాదనకే మొగ్గు..

గోదావరి వరద ఉధృతి ప్రభావం వల్ల ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నదీ గర్భం కోతకు గురైంది. గ్యాప్–1 నిర్మాణ ప్రాంతంలో 35 మీటర్ల లోతుతో, గ్యాప్–2లో 20 మీటర్ల లోతుతో రెండు భారీ అగాధాలు ఏర్పడ్డాయి. కోతకు గురైన ప్రాంతంతోపాటు భారీ అగాధాలను ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేయడం ద్వారా యథాస్థితికి తెచ్చే విధానాన్ని ఏడు నెలల క్రితమే జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదించగా అప్పట్లో డీడీఆర్పీ తోసిపుచ్చింది. దీంతో కోతకు గురైన ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులు చేపడుతూనే అగాధాలను పూడ్చేందుకు డీడీఆర్పీ సూచించిన మేరకు 11 రకాల పరీక్షలను నిర్వహించారు. ఆ ఫలితాలను సమావేశంలో ప్రవేశపెట్టారు. వీటితో సంతృప్తి చెందిన డీడీఆర్పీ ఏడు నెలల క్రితం రాష్ట్ర అధికారులు ప్రతిపాదించిన విధానం ప్రకారమే అగాధాలను పూడ్చి యథాస్థితికి తేవాలని ఆదేశించింది. ఈ పనులను గోదావరికి వరదలు వచ్చేలోగా పూర్తి చేయాలని సూచించింది. ఆ తర్వాత డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దే పనులు పూర్తి చేసి ప్రధాన డ్యామ్ పనులు చేపట్టడం ద్వారా ప్రాజెక్టును పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేసింది.

క్లుప్తంగా...

తండ్రికి తగ్గ తనయుడు జస్టిస్ ప్రవీణ్‌కుమార్

జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఉద్యోగ విరమణ సత్కార సభలో వక్తలు



జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జస్టిస్ ప్రవీణ్ కుమార్ తండ్రికి తగ్గ తనయుడని హైకోర్టు న్యాయమూర్తులు పలువురు పేర్కొన్నారు. జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ఉద్యోగ విరమణ సత్కార సభ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంజీ రోడ్డులోని శ్రీశేషసాయి కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ నయనాల జయసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డి, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రసంగిస్తూ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ న్యాయమూర్తి స్థానంలో ఉన్నప్పటికీ న్యాయవాదులతో ఆప్యాయంగా ఉండే వారని పేర్కొన్నారు. కక్షిదారులు తన వద్దకు వచ్చినప్పుడు అసలు ఫీజులో సగం వారికే ఇచ్చేంత గొప్ప వ్యక్తి అని తెలిపారు. న్యాయవాదుల్లో సామాజిక చైతన్యం తీసుకొచ్చేలా అనేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన దిశగా విశాఖ సమ్మిట్ : బాలినేని



వాకర్స్‌తో ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పన దిశగా విశాఖలో నిర్వహించిన సమ్మిట్ విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒంగోలులోని రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్‌తో ఆదివారం మాట్లాడారు. ముఖేష్ అంబానీలాంటి ఎంతో మంది పారిశ్రామికవేత్తలు ఏపీకి అండగా నిలబడి ఒప్పందాలు చేసుకున్నారని చెప్పారు. రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రావడానికి సీఎం జగన్ చూపిన ప్రత్యేక చొరవే కారణమన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి మద్దతుగా నిలుస్తూ వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిలను మంచి మెజార్టీతో గెలిపించాలంటూ ఆయన పిలుపునిచ్చారు.

నా భర్తనూ చంపుతామని బెదిరించారు..

- ఉమాశంకర్‌రెడ్డి భార్య స్వాతి
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో అనుమానితుడు కసనూరు పరమేశ్వరరెడ్డి, అతని కుమారుడిపై వైఎస్సార్ జిల్లా పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివేకా హత్య కేసులో గజ్జల ఉమాశంకర్‌రెడ్డి ఏ–3 నిందితుడిగా ఉండి చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న విషయం విదితమే. పులివెందులలోని అంబకపల్లెరోడ్డులోని ఉమాశంకర్‌రెడ్డి ఇంటికి శనివారం పరమేశ్వరరెడ్డి, అతని కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డిలు వెళ్లి ఇంట్లో ఉన్న ఉమాశంకర్‌రెడ్డి భార్య స్వాతిపై దాడి చేశారు. ఈ మేరకు ఉమాశంకర్‌రెడ్డి భార్య పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'పరమేశ్వరరెడ్డి, అతని కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డితో కలిసి తమ ఇంటికి వచ్చి.. వివేకానందరెడ్డిని నేనే చంపానని నీ మొగుడు కోర్టు దగ్గర అందరితో చెబుతున్నాడంటా.. నీ భర్త డబ్బులు తీసుకుని వైఎస్ వివేకాను చంపి జైల్లో ఉన్నాడు. జైలు నుంచి బయటకు రాగానే వైఎస్ వివేకాను చంపినట్లే నీ భర్తనూ చంపేస్తాం. ఇప్పుడు నిన్ను కూడా చంపుతాం.. నీకు దిక్కెవరు?' అంటూ బెదిరిస్తూ దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే నోటితో చెప్పలేని భాషలో దుర్భాషలాడారని.. బంధువులకు ఫోన్ చేయాలని ప్రయత్నించగా సెల్‌ఫోన్ లాక్కొని పగులగొట్టారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఏమైనా జరిగితే దానికి పూర్తి బాధ్యత పరమేశ్వరరెడ్డిదేనని ఆమె తెలిపారు. పోలీసులు స్వాతి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ..

- సక్సెస్ మంత్రంగా బీచ్ ఐటీ కాన్సెప్ట్
- నగర అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో పెరిగిన విశాఖ ఇమేజ్

అంతర్జాతీయ గుర్తింపుతో ప్రపంచదృష్టిని ఆకర్షించిన నగరం

పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో సరికొత్త ఇమేజ్‌కు నాంది పలికిన ప్రభుత్వం

పెట్టుబడుల స్వర్గధామంగా మారిన వైనం


సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలో ఓవైపు కడలి కెరటాలు.. మరోవైపు పెట్టుబడులు పోటెత్తాయి. బెస్త గ్రామం నుంచి మహానగరంగా మారిన విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్). పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ నగరానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. సదస్సు విజయవంతం అయిన తర్వాత 'దేశానికి ఆర్థికకోట విశాఖ..' అని అందరి నోటా ఒకే మాట. జీఐఎస్–2023తో పెట్టుబడుల స్వర్గధామంగా సరికొత్త ఇమేజ్‌కు నాంది పలికిన వైజాగ్.. ఇదే స్ఫూర్తితో జీ–20 సదస్సుకు సిద్ధమవుతోంది. రాజధానులెన్నింటికో రాదారిగా ఉన్న విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా మార్చాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం సిద్ధించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. చోదకశక్తి కేంద్రాలుగా మారుతున్న ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల జాబితాలో అగ్రభాగంలో ఉన్న విశాఖపట్నంలో రెండురోజులు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ సక్సెస్ అయింది. ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన నగరంగా విశాఖకు ఈ సమ్మిట్ నిర్వహణతో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. గత ప్రభుత్వ హయాంలో మూడుమార్లు పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా రాని ఇమేజ్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటిసారి ఏర్పాటు చేసిన జీఐఎస్‌తో వైజాగ్ పేరు ఖండాంతరాలు దాటింది. సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా నిర్వహించిన సమ్మిట్‌కు దేశవిదేశాలకు చెందిన దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు హాజరై విశాఖ నగర వైభవానికి వావ్ అన్నారు.

కొత్త ఇమేజ్ తీసుకొచ్చారు

ఇన్నాళ్లు.. విశాఖపట్నం అంటే అలల సవ్వడులతో.. అందాల నగరంగా.. పర్యాటక ప్రాంతంగా మాత్రమే గుర్తింపు ఉండేది. కానీ.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించిన తర్వాత నగరానికి సరికొత్త ఇమేజ్ వచ్చింది. ఎవరు వచ్చినా ఆహ్వానించదగ్గ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న విశాఖ నగరంలో తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించాలన్న ఆలోచనల్ని పారిశ్రామికవేత్తలు స్వయంగా చూసిన తర్వాత మరింత బలపరుచుకున్నారు. నివాసయోగ నగరాల్లో టైర్–1 సిటీలతో పోటీపడుతున్న విశాఖపట్నం పెట్టుబడులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. హైదరాబాద్‌ని మించి అభివృద్ధి చేసే అవకాశాలున్నప్పటికీ.. గత పాలకులు విశాఖని ఒక నగరంగానే గుర్తించి విస్మరించడంతో అనుకున్న మేర అభివృద్ధి చెందలేదు. కానీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. నగరానికి కొత్త ఇమేజ్ తీసుకొచ్చేందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చేలా అడుగులు వేశారు. అనుకున్నట్లుగానే పెట్టుబడుల సదస్సుతో 'తింటే గారెలే తినాలి.. వింటే భారతం వినాలి.. ఉంటే వైజాగ్‌లోనే ఉండాలి.. చేస్తే విశాఖలోనే వ్యాపారం చేయాలి..' అనే స్థాయికి తీసుకెళ్లారు.

బహుళ ప్రాజెక్టులతో ఆకర్షణ మంత్రం

సువిశాల సాగరతీరం చెంతనే ఆహ్లాదకరమైన వాతావరణంలో ఐటీ పరిశ్రమల్ని అభివృద్ధి చేసి సిటీ ఆఫ్ డెస్టినీని ఐటీ హబ్‌గా మార్చాలనే ఉద్దేశంతో బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ని తొలుత ప్రమోట్ చేయాలని భావించారు. ఇందులో భాగంగానే ఇన్ఫోసిస్, టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్, అమెజాన్ తదితర ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలన్నీ విశాఖవైపు అడుగులు వేశాయి. తాజాగా విప్రో కూడా తన సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు విశాఖనే ఎంపిక చేసుకుంది. ఇలా ఐటీ డెస్టినీగా మారుతున్న విశాఖలో ఇతర పరిశ్రమలకూ ఆస్కారం ఉందన్న ఆలోచన దిగ్గజ పారిశ్రామికవేత్తల మదిలో కలిగేలా సీఎం వైఎస్ జగన్ విశాఖని విశ్వవ్యాప్తంగా ప్రమోట్ చేశారు. అందుకే అదానీ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అదేవిధంగా వైజాగ్ టెక్‌పార్క్ కూడా డేటాసెంటర్‌తో పాటు బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీలను రూ.21,844 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసి 39,815 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చింది. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎన్టీపీసీ, ఇంధన రంగంలో హెచ్‌పీసీఎల్, పర్యాటక రంగంలో ఒబెరాయ్, తాజ్, టర్బో ఏవియేషన్.. ఇలా విభిన్న రంగాల్లో బహుళ ప్రాజెక్టుల్ని విశాఖ జిల్లాలోనే ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు మొగ్గుచూపడానికి కారణం వైజాగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన సీఎం వైఎస్ జగన్ అన్నది జగమెరిగిన సత్యం. జీఐఎస్ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు దాదాపు రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.



మరో అంతర్జాతీయ సదస్సుకు ముస్తాబు

భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి.. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూస్తున్నారు. జీఐఎస్ విజయవంతం కావడంతో అంతర్జాతీయ ప్రముఖులకు సైతం వైజాగ్ అంటే ఇష్టం పెరిగింది. మళ్లీమళ్లీ నగరానికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే షెడ్యూల్ ఖరారైన జీ–20 సదస్సుకు నగరం ముస్తాబవుతోంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ స్ఫూర్తితో జీ–20 సదస్సుని విజయవంతం చేయాలని జిల్లా అధికార యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోంది. మరోవైపు త్వరలో విశాఖ నుంచి పాలన కొనసాగిస్తానని సీఎం వైఎస్ జగన్ పునరుద్ఘాటించడంతో ప్రజల్లో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించే జీ–20 సదస్సును విజయవంతం చేయడంలో తాము కూడా భాగస్వాములవుతామని నగరవాసులు చెప్పకనే చెబుతుండటం విశేషం.

ఇది నిరంకుశత్వం

▶ మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగబద్ధ గవర్నర్ కార్యాలయాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం సరికాదని మండిపడ్డాయి. ఈ మేరకు కాంగ్రెసేతర విపక్షాలైన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, శివసేన యుబీటీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ ఆదివారం ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలోని ముఖ్యాంశాలు వారి మాటల్లోనే..

ఎన్నికల సమయాల్లోనే దాడులు అధికం

"2014 నుంచి ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుండటంతో వాటి ప్రతిష్ట మసకబారింది. వాటి స్వయం ప్రతిపత్తి, నిష్పాక్షికతపై ప్రశ్నలను లేవనెత్తింది. వీటిపై దేశ ప్రజలు నానాటికి విశ్వాసాన్ని కోల్పోతున్నారు. చాలా సందర్భాల్లో ఎన్నికల సమయంలో నమోదవుతున్న కేసులు, జరుగుతున్న అరెస్టులను పరిశీలిస్తే.. అవి ఫక్తుగా రాజకీయ ప్రేరేపితమైనవని స్పష్టంగా అర్థమవుతోంది. మీ పార్టీ (బీజేపీ)తో విరుద్ధ భావజాలాన్ని కలిగిన పార్టీకి అనుకూలంగా ప్రజలు తీర్పునిచ్చినా గౌరవించి తీరాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయం. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ తమ ప్రాధాన్యతను కోల్పోయాయి.

దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు

దర్యాప్తు, విచారణల పేరుతో సుదీర్ఘకాలం ఉద్దేశపూర్వకంగా వేటాడి, వెంటాడి ఎలాంటి ఆధారాలు లేకున్నా కూడా ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారం. రాజకీయ కుట్రతో కూడినవి. ఆయన అక్రమ అరెస్టు దేశవ్యాప్తంగా ప్రజలను ఆగ్రహానికి గురి చేసింది. పాఠశాల విద్యలో గొప్ప సంస్కరణలను తీసుకొచ్చి ప్రపంచవ్యాప్త గుర్తింపును మనీశ్ సిసోడియా పొందారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలన్న లక్ష్యంతో చేపట్టిన దురుద్దేశపూర్వక దర్యాప్తుకు ఈ అరెస్టు తార్కాణంగా నిలిచింది. నిరంకుశ బీజేపీ పాలనలో దేశంలో ప్రజాస్వామిక విలువలకు ముప్పు వాటిల్లిందన్న ప్రపంచం అనుమానాలను నిజం చేసింది.

బీజేపీలో చేరితే కేసుల నుంచి ఉపశమనం

మీ పరిపాలనలో 2014 నుంచి దర్యాప్తు సంస్థల కేసులు, అరెస్టులు, దాడులు, విచారణలను ఎదుర్కొన్న ప్రముఖ రాజకీయ నాయకుల్లో అత్యధికులు ప్రతిపక్ష నేతలే. బీజేపీలో చేరిన ప్రతిపక్ష నాయకుల కేసులపై విచారణలను దర్యాప్తు సంస్థలు నెమ్మదిగా చేస్తున్నాయి. 2014, 2015 సంవత్సరాల్లో శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో కాంగ్రెస్ మాజీ నేత, ప్రస్తుత అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మపై సీబీఐ, ఈడీ విచారణ జరిపాయి. ఆయన బీజేపీలో చేరాక కేసు దర్యాప్తు నీరుగారిపోయింది. నారద స్టింగ్ ఆపరేషన్ కేసులో టీఎంసీ మాజీ నేతలు సువేందు అధికారి, ముకుల్ రాయ్‌లను సీబీఐ, ఈడీ వెంటాడి వేధించాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారు బీజేపీలో చేరడంతో దర్యాప్తు అటకెక్కింది. మహారాష్ట్రకు చెందిన నారాయణ్ రాణే కేసు సహా మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి.

విపక్ష నేతలపై వేధింపులు

2014 నుంచి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం, కేసులు పెట్టడం, అరెస్టు చేయడం వంటివి గణనీయంగా పెరిగాయి. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, శివసేన నేత సంజయ్ రౌత్, ఎస్పీ నేత ఆజంఖాన్, ఎన్సీపీ నేతలు నవాబ్ మాలిక్, అనిల్ దేశ్‌ముఖ్, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ వంటి ప్రముఖ ప్రతిపక్ష నేతలు కేంద్ర దర్యాప్తు సంస్థల చేతిలో వేధింపులను ఎదుర్కొన్నారు. కేంద్రంలోని పాలక పార్టీకి అనుబంధ విభాగాలుగా కేంద్ర దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయనే అనుమానాలకు ఈ కేసులు బలం చేకూరుస్తున్నాయి.

ఆ సంస్థపై దర్యాప్తు చేయరా?

రూ.78,000 కోట్లకుపైగా ఒక నిర్దిష్ట సంస్థ (అదానీ గ్రూపు)లో పెట్టుబడిగా పెట్టడంతోనే ఎస్‌బీఐ, ఎల్ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ భారీగా నష్టపోయినట్టు ఓ అంతర్జాతీయ ఫోరెన్సిక్ ఆర్థిక పరిశోధన సంస్థ నివేదిక ప్రచురించింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఈ సంస్థల అవకతవకలపై కేంద్ర ఏజెన్సీలు ఎందుకు దర్యాప్తు చేయడం లేదు?

గవర్నర్లను ఉసిగొల్పి..

సమాఖ్య వ్యవస్థపై యుద్ధానికి కేంద్రం ఇంకో వ్యవస్థను ఉసిగొల్పుతోంది. దేశవ్యాప్తంగా గవర్నర్ కార్యాలయాలు రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ, రాష్ట్రాల పాలనకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. గవర్నర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను ఉద్దేశపూర్వకంగా అణగదొక్కుతున్నారు. బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లు, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అంతా కేంద్రం, రాష్ట్రాల మధ్య విభేదాలను పెంచుతూ సహకార సమాఖ్య స్ఫూర్తికి ప్రమాదకారులుగా తయారయ్యారు. సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించడంలో కేంద్రం విఫలంకాగా.. రాష్ట్రాలు రాజ్యాంగ విలువలతో సమాఖ్య స్ఫూర్తిని పాటిస్తున్నాయి. గవర్నర్ల వైఖరి పర్యవసానంగా దేశ ప్రజలు ప్రజాస్వామ్యంలో గవర్నర్ల పాత్ర ఏమిటని ప్రశ్నించడం ప్రారంభించారు.'' అని లేఖలో పేర్కొన్నారు.

వరుపుల రాజా మృతికి సీఎం సంతాపం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా మృతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సంతాప సందేశాన్ని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రత్తిపాడులో తెలిపారు. రాజా గతంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పని చేశారని గుర్తు చేశారు. వరుపుల రాజా అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాల్సిందిగా ముఖ్యమంత్రి సూచించారని, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని కన్నబాబు చెప్పారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు.

చురుకైన నాయకుడిని కోల్పోయాం: చంద్రబాబు

వరుపుల రాజా మృతితో చురుకైన నాయకుడిని కోల్పోయామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాజా పార్థివ దేహాన్ని ప్రత్తిపాడులో ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించి నివాళులర్పించారు. రాజా తల్లి సత్యవతి, భార్యాపిల్లలు సత్యప్రభ, హర్ష, మాధురిలను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కరోనా, ప్రభుత్వ వేధింపుల వల్ల ఒత్తిడికి గురై రాజా మరణించారని విమర్శించారు. రాజా కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ లాంఛనాలతో..

వరుపుల రాజా పార్థివ దేహానికి ఆయన స్వగ్రామమైన పెదశంకర్లపూడిలోని రాజా వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఏమిటా రాతలు?

- మీరు చెప్పింది భగవద్గీతలా నమ్మే రోజులు పోయాయి
- పచ్చ పత్రికలపై మంత్రి బొత్స ఫైర్



విజయనగరం: విశాఖ వేదికగా ప్రశాంత వాతావరణంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 విజయవంతంగా జరిగితే ఓర్వలేని పచ్చపత్రికలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అడ్డగోలు రాతలు రాయడం దుర్మార్గమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయనగరంలో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మంచి జరిగినప్పుడు రాయకపోయినా ఫర్వాలేదు. కానీ, చెడురాతలు రాయడం సరికాదు. సమ్మిట్ ముగిసి ఒక్కరోజు కాకముందే రూ.12 లక్షల కోట్లు ఎంవోయూలు చేయడం గొప్ప కాదు... అవి ఆచరణలో చేసి చూపించగలరా... ఆరు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించగలరా... అంటూ లెక్కలు వేసి తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటు. వారిది నోరా.. తాటి మట్టా...' అని బొత్స మండిపడ్డారు. 'పచ్చపత్రికలు చెప్పిందే భగవద్గీతలా భావించే రోజులు పోయాయి. వారేమిచెప్పినా నిజమని నమ్మే పరిస్థితి లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా నిర్వహించిన సమ్మిట్‌లపై ఎందుకు ఇలా రాయలేకపోయారు. రెండు రోజులపాటు జరిగిన విశాఖ సమ్మిట్‌కు దేశంలోని దిగ్గజ పారిశ్రామికవేత్తలు, సంస్థలు వచ్చిన విషయాన్ని ప్రజలు గమనించారు. ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు పరిశ్రమలు స్థాపించేందుకు పూర్తి సహకారం అందిస్తామని, దీనికోసం ప్రత్యేక కమిటీ వేస్తామని సీఎం చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి కొంత సమయం పడుతుంది. ఈలోపే ఏమిటా రాతలు? ప్రజలను తప్పుదోవ పట్టించేలా 2019 ఎన్నికలకు ముందు మీరు ఎన్ని రాతలు రాసినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఎన్నుకున్నారు...' అని బొత్స చెప్పారు. అదేవిధంగా కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ విశాఖలో ఎన్నో వనరులు ఉన్నాయని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉప్పు సాగు

- సీజన్ ప్రారంభం
- కోటి ఆశలతో సాగు
- తీరంలో మడుల కళకళ
- పెరిగిన గిట్టుబాటు ధర



తీరంలో సిద్ధమైన ఉప్పు మడులు

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం తీర ప్రాంతంలో ఉప్పు సాగు ఉత్సాహంగా మొదలైంది. ఇటీవల ఎండలు ముదరడంతో రైతులు సాగుకు ఉపక్రమించారు. గతేడాది వరుస విపత్తులు, అధిక వర్షాలతో నష్టాలను చవిచూసిన రైతులు ఈ ఏడాది సాగుపై గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం తీర గ్రామాల్లో ఉప్పుసాగు విస్తారంగా జరుగుతోంది. దీంతోపాటు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉప్పుకు గిట్టుబాటు ధర పెరగడంతో రైతులు ఆనందంగా సాగు పనులు మొదలుపెడుతున్నారు. జిల్లాలోని నరసాపుర, మొగల్తూరు మండలాల్లోని వేములదీవి, తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, కేపీపాలెం తదితర 8 గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాల్లో ఉప్పు సాగు మొదలైంది.

ఆరు నెలల దిగుబడి

ఉప్పు సాగు కూడా కష్టంతో కూడుకున్నది. అయితే ఒక్కసారి మడి కడితే ఆరు నెలల పాటు ఉప్పు దిగుబడి వస్తుంది. ఏటా మార్చి నెలలో ఉప్పు సాగు సీజన్ ప్రారంభమవుతుంది. ఎకరాకు 60 నుంచి 70 మడులను కడతారు. ముందుగా మడుల్లో మట్టిని కాళ్లతో తొక్కి చదును చేసి తర్వాత సముద్రం నీటిని మడుల్లో నింపుతారు. సాగు ప్రారంభమైన నాటి నుంచి మడుల్లో 60 రోజుల పాటు ఆరుగురి నుంచి పది మంది వరకు శ్రమిస్తేనే గాని ఉప్పు తయారు కాదు. ఎకరాకు పెట్టుబడి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు రోజుకు 100 కిలోల వరకు ఉప్పు దిగుబడి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

అ'ధర'హో

ఇటీవల ఉప్పుకు గిట్టుబాటు ధర పెరిగింది. ఏడాది క్రితం తీరంలో పండించే ఉప్పు బస్తా (50కిలోలు)ను రైతుల నుంచి దళారులు రూ.100కు కొనేవారు. అయితే ప్రస్తుతం బస్తా ధర రూ.300 పలుకుతోంది. ధర మూడు రెట్లు పెరిగిందని, వాతావరణం అనుకూలిస్తే లాభాలు గడిస్తామని రైతులు అంటున్నారు. నరసాపురం తీరం నుంచి ఉప్పు ఆంధ్రా, తెలంగాణలోని పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఉప్పు సరఫరా అవుతుంది. ఎక్కువ శ్రమ, తక్కువ రాబడి ఉండటంతో రైతులు ఉప్పు సాగుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏడాదికేడాది సాగు విస్తీర్ణం తగ్గుతోంది. పదేళ్ల క్రితం దాదాపు 15 గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో ఉప్పు సాగు ఉండేది.


నిల్వ మార్గం లేక..

రైతులు పండించిన ఉప్పును భద్రపరుచుకోవడానికి గిడ్డంగుల వంటి సదుపాయాలు లేవు. దీంతో రైతులు ఉప్పును ఆరుబయటే కుప్పలుగా పోసి ఉంచుతారు. అకాల వర్షాలు, తుపానుల వంటి సమయంలో ఉప్పురాశులు ధ్వంసమై తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే ఉప్పుసాగుకు అధికార పంటగా గుర్తింపు లేకపోవడంతో ధ్వంసమైన ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం రాదు. బీమా వర్తించదు. ఉప్పుసాగును అధికార పంటగా గుర్తించాలని, సదుపాయాలు కల్పించాలని, గిడ్డంగులు ఏర్పాటుచేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.



ఉప్పు గుట్టలు (ఫైల్)

వాతావరణం బాగుండాలి



ఏటా మార్చిలో ఉప్పు సాగుకు సీజన్ మొదలవుతుంది. గతేడాది జూన్, జులైలో అధిక వర్షాలతో మడుల్లోకి నీరు చేరింది. దీంతో పండించిన ఉప్పును అయినకాడికి అమ్ముకున్నాం. దీంతో నష్టాలే మిగిలాయి. ఈ ఏడాది వాతావరణం ఎలా ఉంటుందో చూడాలి.

–మైలా ఏడుకొండలు, ఉప్పురైతు, పీఎం లంక, నరసాపురం మండలం

రేటు పెరిగింది



ఉప్పు 50 కిలోల బస్తా ధర రూ. 300 పలుకుతోంది. ఈ మధ్యనే అంతరేటు పెరిగింది. గతేడాది రూ.100 మించి ధర లేదు. చప్పనీటి ప్రాంతాల్లో రొయ్యల చెరువులకు కూడా ఉప్పును ఉపయోగించడంతో డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది లాభాలు వస్తాయనుకుంటున్నా.

–పొన్నమండ రాంపండు, ఉప్పురైతు, తూర్పుతాళ్లు, నరసాపురం మండలం



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ముదిలి రాధికకు పెంఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోషి



కాకినాడ జిల్లా సామర్లకోట ఆస్పత్రిలో దాసుకు పెంఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆశాజ్యోతి



ఏలూరులో అర్జి పైడితల్లికి పెంఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజశేఖర్



తన భయాలను అధిగమించినవాడే
నిజమైన స్వేచ్ఛాజీవి.
– అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, మార్చి, 6

ఎవరి 'గోడ' వారిదే!

మనం శబ్దాన్ని గుర్తిస్తాం, శబ్దానికి చెవినిస్తాం, ఫెళఫెళార్భాటంగా సాగే శబ్దవిప్లవాలకు స్పందిస్తాం. నీటిని గుర్తిస్తాం కానీ చాపకింద నీటిని చటుక్కున గుర్తించలేకపోతాం. వాస్తవం ఏమిటంటే, మనం వెంటనే పోల్చుకోలేని నిశ్శబ్దాలూ, నిశ్శబ్ద విప్లవాలూ; చాప కింద నీరు లాంటి నిరంతర పరిణామాలూ కూడా ఉంటాయి. సాధారణంగా అవే మనిషి జీవితాన్ని, అతని నమ్మకాల్ని తలకిందులు చేస్తాయి. అతనికి తెలియకుండానే అతని కరచరణాలను కట్టడి చేసి శాసిస్తాయి.

సాంకేతికత అలాంటి ఒక నిశ్శబ్ద విప్లవం. ఎప్పుడో చరిత్రపూర్వయుగంలో మనిషి కనిపెట్టిన చక్రం, ఆ తర్వాత కొన్ని వేల సంవత్సరాలపాటు అతని భవిష్యత్తును నిర్దేశించింది; అతని జీవనాన్ని, అతను కూడా ఊహించలేనన్ని కొత్త కొత్త మలుపులు తిప్పింది. చక్రం తిప్పనిదేముంది?

ఉన్న సాంకేతికత పోయి కొత్త సాంకేతికత రావడానికీ, అది కొత్త కొత్త మార్పులు కొని తేవడానికీ నిన్నమొన్నటివరకూ ఎక్కువ సమయం పట్టేది. ఆ లోపల 'పాత' అనేది సంప్రదాయంగా ఘనీభవించిపోయి కొత్తను అడ్డుకునేది; కాలగమనాన్ని తన అరచేతులతో ఆపడానికి ప్రయత్నించేది. అలాంటి సంప్రదాయ శాసనం నుంచి బయటపడి తన ఉనికిని స్థాపించుకోవడానికి 'కొత్త' ఎంతో పెనుగులాడేది, ఆ ఘర్షణలో సంప్రదాయానిదే పై చేయి అయేది. కానీ ఆధునికకాలం దగ్గరికి వచ్చేసరికి సాంకేతికత ఒక మహావిజృంభణగా మారిపోయింది. ఒక మహావిప్లవరూపం ధరించింది. అప్పటికి కొత్త అనుకున్న సాంకేతికతకు అలవాటు పడే లోపలే దానిని పాతగా మార్చివేస్తూ అంతకన్నా కొత్తదైన సాంకేతికత అడుగుపెట్టడం ప్రారంభించింది. అందువల్ల పాతకు సంప్రదాయంగా ఘనీభవించే వ్యవధి బాగా తగ్గిపోయి, కొత్త సాంకేతికత ముందు అది కూడా తలవంచి దారినివ్వడం అనివార్యమైంది.

ఆ విధంగా సంప్రదాయ, సాంకేతికతల బలాబలాలు తారుమారైపోయాయి. కొత్త సాంకేతికత రెండు మూడు తరాల కాలవ్యవధిలో అడుగుపెట్టడం కూడా పోయి ఒకే తరంలో, కళ్ళు మూసి తెరచే లోగానే ప్రత్యక్షం కావడం ఇప్పుడు సర్వసాధారణమైంది. ఏదైనా సమాచారాన్ని 'రియల్ టైమ్'లో ప్రపంచవ్యాప్తం చేయడమూ; పుటలకు పుటలు మనం రాసినదానిని మనం కోరుకున్న భాషలోకి తక్షణం తర్జుమా చేసి ఇవ్వడమే కాదు; కీబోర్డుమీద చిటికెనవేలితో నొక్కితే చాలు, మన గురించిన మొత్తం సమాచారాన్ని మన కళ్ళముందు నిలిపే స్థాయికి సాంకేతికత చేరుకుంది. రోబోను సృష్టించిన మనిషి, సాంకేతికత చేతిలో తనే రోబోగా మారాడు.

సమాచారమాధ్యమాల రంగానికే వస్తే ఈ సాంకేతిక మహావిప్లవం తెచ్చిన మార్పు ఎన్నో ఆసక్తికరమైన పరిస్థితులను సృష్టించింది. సామాజిక మాధ్యమాల పేరిట ఫేస్‌బుక్, వాట్సప్, బ్లాగ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వగైరాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావడంతో అంతవరకూ ఆధిపత్యం చలాయించిన ప్రింటు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలు సాంప్రదాయిక మాధ్యమాలుగా మారాయి. సామాజిక, సాంప్రదాయిక మాధ్యమాల సహజీవనం వినూత్న పరిణామాలకు దారి తీసింది. అంతవరకు స్థలకాలాల నిర్ణయాధికారం సాంప్రదాయిక మాధ్యమాల నిర్వాహకుల చేతుల్లో ఉండేది. ఇప్పుడా అధికారం స్మార్ట్ ఫోన్, లేదా ల్యాప్ టాప్ దగ్గరున్న ప్రతి వ్యక్తికీ బదిలీ అయింది. అతను తాను కోరుకున్నంత స్థలంలో, తను ఎప్పుడనుకుంటే అప్పుడు తన అభిప్రాయాన్ని ప్రచురించుకునే వెసులుబాటు వచ్చింది. ఫేస్‌బుక్ పరిభాషలో చెప్పాలంటే 'గోడ' రూపంలో తను సృష్టించుకున్న తన పత్రికకు, తన ఛానెల్‌కు తనే సంపాదకుడు. తన వాల్ మీద ఏది పోస్టు చేయాలో నిర్ణయించుకునే అధికారం తనదే. 'వెనకటి మహాభారతం పద్దెనిమిది పర్వాలు కావచ్చు, ఆధునిక మహాకావ్యం పద్దెనిమిది పేజీలే' ననే అర్థంలో మహాకవి శ్రీశ్రీ చేసిన వ్యాఖ్య ఒకటి ప్రసిద్ధమే. ఇప్పుడు మన ఫేస్‌బుక్ వాల్ మీద, లేదా మన బ్లాగులో ఏకకాలంలో పద్దెనిమిది పంక్తుల్లో ఒక మినీ వ్యాసాన్ని, పద్దెనిమిది పుటల్లో ఒక కావ్యాన్నే కాదు, పద్దెనిమిది పర్వాల మహేతిహాసాన్ని కూడా రాయగలిగినంత జాగా అందుబాటులోకి వచ్చింది.

సాంకేతికవిప్లవం ఆవిష్కరించే వింతలకు అంతే ఉండదు. కొత్త సాంకేతికత ఒక్కొక్కసారి సుదూరగతానికి చెందిన పాతపద్ధతులను కూడా కొత్త మెరుపుతో ముందుకు తేగలదు. పూర్వం, అచ్చుయంత్రం కాదు సరికదా, లిఖితసంప్రదాయం కూడా వేళ్లూనుకొనని రోజుల్లో పురాణశ్రవణం ఉండేది. పౌరాణికుడు, శ్రోతలు ఎదురెదురుగా ఉండేవారు. శ్రోతల అభిరుచులు, అభిప్రాయాలూ, అనుకూల, వ్యతిరేకస్పందనలు తక్షణమే పౌరాణికుని దృష్టికి వచ్చేవి. అవి కూడా పురాణ శ్రవణాన్ని, కథానిర్మాణాన్ని ప్రభావితం చేసేవి. ఆ విధంగా పురాణకథనం ద్వికర్తృకంగా, లేదా జంట నిర్మాణంగా రూపుదాల్చేది. ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో మళ్ళీ అదే పద్ధతి పునరావృతమైంది. తను చదివిన, లేదా విన్న వాటిపై పాఠకుడు, శ్రోత అప్పటికప్పుడు స్పందించగలుగుతున్నాడు. ఆ విధంగా అది ఒక రచనను 'రియల్ టైమ్'లో ప్రభావితం చేసి అవసరమైతే మార్చుకునే అవకాశాన్నిస్తున్నది. ప్రజాస్వామికమైన చర్చను కొత్త పుంతలు తొక్కిస్తున్నది.

సంపాదకుడనే అంకుశం లోపించినప్పుడు సామాజిక మాధ్యమాలు మదపుటేనుగుల స్వైర విహారానికి ఆటపట్టులవుతాయి. ఉచితానుచితాలు, సభ్యతా సంస్కారాల హద్దులు చెరిగిపోవడమూ సంభవిస్తుంది. అయితే స్థలకాలాలు, శాస్త్రసాంకేతిక నూతనావిష్కారాలకు అతీతంగా ఎల్ల కాలాలకూ, ఎల్ల ప్రాంతాలకూ వర్తించే మన్నికైన మానవ విలువలు; విజ్ఞతావివేకాల కొలమానాలు ఎప్పుడూ సజీవంగా ఉంటూనే ఉంటాయి. సాంప్రదాయిక, సామాజిక మాధ్యమాల తేడా లేకుండా సంపాదక స్థానంలో ఉన్న ప్రతి ఒకరిపై జనాభిప్రాయమనే పెద్ద అంకుశం అజ్ఞాతంగా ఉండి నియంత్రిస్తూనే ఉంటుంది. ఆ జనాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించే పాఠకుడు అతిని ఒక కంట కనిపెట్టి చూస్తూ అవసరమనిపించిన సమయంలో కత్తెర ప్రయోగిస్తూనే ఉంటాడు. నిత్యజాగృతుడైన పాఠకుడు, లేదా శ్రోత, లేదా ప్రేక్షకుడే అంతిమంగా ఏ మాధ్యమానికైనా ఎడిటర్– ఇన్– చీఫ్!

కుదిరి చెదిరిన ఒప్పందం

కామెంట్



కరణ్ థాపర్

దీర్ఘకాల సరిహద్దు ఘర్షణలను పరిష్కరించే ఒక ఒప్పందం భారత్, పాకిస్తాన్ మధ్య దాదాపుగా కుదిరినట్లు కనిపించిందని సతీందర్ లాంబా పుస్తకం 'ఇన్ పర్స్యూట్ ఆఫ్ పీస్' వెల్లడిస్తోంది. ఈ ఒప్పందం కోసం ఇరుదేశాలు తెరవెనుక చర్చలను విస్తారంగా కొనసాగించాయనీ, దాదాపు సంతకాల దాకా వచ్చాయనీ ఈ పుస్తకం చెబుతోంది. 2014 సార్వత్రిక ఎన్నికలపై భారత్ దృష్టి పెట్టిన తర్వాత ఈ ప్రక్రియ నత్తనడక నడిచి ఆగిపోయింది. ఈ ఒప్పందం కుదిరివుంటే, చరిత్రే మారిపోయేది. ఈ ఒప్పంద ప్రక్రియను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఇరుపక్షాలూ భావిస్తే దానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలు సిద్ధంగా ఉన్నాయని ఈ పుస్తకం గట్టిగా చెబుతోంది.

మాజీ రాయబారి సతీందర్ లాంబా రచించిన పుస్తకం 'ఇన్ పర్స్యూట్ ఆఫ్ పీస్' విషాదకరంగా ఆయన మరణానంతరం ప్రచురితమైంది. అయితే భారత్, పాకిస్తాన్ బ్యాక్ చానెల్‌కు (గుప్త లేదా ద్వితీయ శ్రేణి సమాచార బదిలీ మార్గం) సంబంధించిన అద్భుతమైన వివరాలను ఈ పుస్తకం వెల్లడించింది. అలాగే రెండు దేశాలు ఒప్పందానికి ఎంత సమీపానికి వచ్చాయో కూడా ఇది చక్కగా వివరించింది. యూపీఏ ప్రభుత్వ రెండో పాలనా కాలంలో, ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ పదేళ్ల పాలన చివరలో ఈ ముసాయిదా ఒప్పందంపై సంతకాలు చేయడానికి కూడా అంగీ కారం కుదిరిందని ఈ పుస్తకం నిర్ధారిస్తోంది.

'2003 మే నుంచి 2014 మార్చి వరకు బ్యాక్ చానెల్ సమావేశాలు 36 జరిగాయి' అని నాకు తెలిసిన సతీ (సతీందర్) రాశారు. ఈ ఒప్పందంలో చాలావరకు జనరల్ ముషారఫ్ హయాంలో ముగింపునకు వచ్చింది. ఆయన అధికారం కోల్పోయిన తర్వాత ఏమీ జరగలేదు. కానీ నవాజ్ షరీఫ్ 'ఈ ప్రక్రియకు కొత్త ఊపును, వేగాన్ని తీసుకొచ్చారు'. దురదృష్టవశాత్తూ, ఆ తర్వాత 'భారత్ దృష్టి 2014 సార్వత్రిక ఎన్నికల వైపు మళ్లింది.'

నేను అనుకునేది సరైనదే అయితే, రెండు సందర్భాల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరే పరిస్థితులు ఏర్పడ్డాయి. మొదట 2007లో అది సాధ్యపడేట్టు కనిపించింది కానీ ముషారఫ్‌కు ఉన్న 'అంతర్గత సమస్యల' వల్ల వీగిపోయింది. ఇక రెండోది– ఇది నా వ్యాఖ్యానం – ఎన్నికల వైపు దృష్టిని భారత్ మరల్చడానికి ముందుగా నవాజ్ షరీఫ్ కాలంలో!


అనూహ్య ఘటన

అయితే, మోదీ గెలుపుతో ఆశలేమీ పోలేదు. 'బ్యాక్ చానెల్ ప్రక్రియను కొనసాగించాలనే ఉద్దేశం ఉన్నట్లు కనిపించింది' అని సతీ పేర్కొన్నారు. 'ఈ అంశంపై ఫైల్‌ని సమీక్షించారు. ఈ ఒప్పందంలో ఎలాంటి ముఖ్యమైన మార్పూ ఉండబోదని కూడా నాకోసారి చెప్పారు. ప్రత్యేక దూతగా ఒక విశిష్ట రాయబారిని నియమించాలని కూడా ప్రధానమంత్రి మోదీ భావించారు. నన్ను ఆయన్ని కలవాలని కోరారు.' కానీ ఆ రాయబారిని నియమించనేలేదు.

మోదీ ప్రభుత్వం 2017 ఏప్రిల్‌లో మరోసారి ఆ ఒప్పందం కోసం ప్రయత్నించింది. 'ప్రధాని కార్యాలయంలోని సీనియర్ అధికారి ఒకరు నన్ను కలవడానికి మా ఇంటికొచ్చారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్‌తో భేటీ కావడానికి మీరు పాకిస్తాన్ వెళ్లాలని ప్రధాని కోరుకుంటున్నారని ఆయన నాతో చెప్పారు'. అయ్యో! అయితే, భారత్ తరహా ఒక పరిణామం దీన్ని మొగ్గలోనే తుంచేసింది. షరీఫ్‌తో చర్చించాల్సిన అంశాల వివరాలతో పాటు పాకిస్తాన్‌కు ప్రయాణించడానికి అవసరమైన ట్రావెల్ డాక్యుమెంట్లను ఇవ్వాలని సతీందర్ కోరి, వాటికోసం వేచి ఉన్నారు. కానీ ఆ తరుణంలోనే విచిత్రమైన ఘటన జరిగింది. 'దూతగా వ్యవహరిస్తున్న ఒక ప్రముఖ భారతీయ వ్యాపారవేత్త తన వ్యక్తిగత విమానంలో పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో భేటీ కావడానికి పాకిస్తాన్ వెళ్లారనే వార్తను నేను చూశాను. అలాంటి పరిస్థితుల్లో ఒకే ఉద్దేశం కోసం పాక్ ప్రధాని వద్దకు వెళ్లడానికి ఇద్దరు వ్యక్తులు ప్రాతినిధ్యం వహించడం సరైంది కాదు.' ఆ వ్యాపారవేత్త పేరు సతీందర్ బయటపెట్టలేదు. అయితే ఆయన సజ్జన్ జిందాల్ కావచ్చునని పాకిస్తాన్ హైకమిషనర్‌గా పనిచేసిన అబ్దుల్ బాసిత్ అన్నారు. 'ఈ అంశం మీద నేను జరిపిన చివరి సంభాషణ ఇదే' అని సతీందర్ రాశారు.



పర్వేజ్ ముషారఫ్, మన్మోహన్ సింగ్





సతీందర్ లాంబా

మన్మోహన్ సింగ్ పాలనలో ఇరుదేశాల మధ్య ఒప్పందం దాదాపుగా ఫలవంతమయ్యేటట్టు కనిపించిందని సతీందర్ చెప్పిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. 'ప్రధాని మన్మోహన్‌తో నేను 68 సార్లు కలిసినట్లు నా డైరీ గుర్తుచేసింది'. పైగా 'ఈ పరిణామాల గురించిన మొత్తం సమాచారం ప్రణబ్ ముఖర్జీకి తెలియజేయడమైంది'. 2006 నవంబర్‌లో సోనియాగాంధీకి ఈ ఒప్పంద వివరాలు తెలపడం జరిగింది. అంతకుముందు 2005లో ఆర్మీ చీఫ్ ఈ విషయంలో పాలు పంచుకున్నారు. పైగా అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అడ్వాణీ, బ్రజేశ్ మిశ్రా, ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, ముఫ్తీ మహమ్మద్ సయీద్, కరణ్ సింగ్, గులామ్ నబీ ఆజాద్‌లకు కూడా ఈ సమాచారం అందించడం జరిగింది. ఈ ఒప్పందం ఫలితం భారత రాజ్యాంగానికీ, జమ్మూ–కశ్మీర్ రాజ్యాంగానికీ, పార్లమెంటరీ తీర్మానాలకూ అనుగుణంగా ఉండేలా ప్రయత్నాలు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి ఆనంద్‌తో 2006 మార్చి నుంచి 2007 మార్చి మధ్యలో సతీందర్ ఆరుసార్లు సమావేశమయ్యారు. ప్రఖ్యాత న్యాయవాది ఫాలీ నారిమన్‌ను కూడా కలిశారు.

సరిహద్దులు మారవు

ముషారఫ్ నాలుగు సూత్రాల(ఫోర్–పాయింట్ ఫార్ములా)పై, మన్మోహన్ సింగ్ అమృత్‌సర్‌లో చేసిన ప్రసంగంలోని మూడు ఆలోచనలపై ఈ ఒప్పందం ఆధారపడింది. ఈ చర్చలకు పెట్టుకున్న 14 మార్గదర్శక సూత్రాలను సతీందర్ పేర్కొన్నారు. వాటిల్లో కొన్ని: 'సరిహద్దులను తిరగరాసే ప్రసక్తి లేదు.' 'ఎల్‌ఓసీ(నియంత్రణ రేఖ)కి ఇరువైపులా, ముఖ్యంగా జనం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సైనిక కదలికలను కనిష్ఠ స్థాయిలో ఉంచాలి.' 'నియంత్రణ రేఖకు ఇరువైపులా అంతర్గత నిర్వహణ కోసం స్వయంపాలనను ఏర్పర్చాలి.' 'నియంత్రణ రేఖకు ఇరువైపులా ఉన్న ప్రజలు ఒక వైపు నుంచి మరొక వైపునకు వెళ్లడానికి స్వేచ్ఛ ఉండాలి.' అలాగే, 'ప్రభుత్వ విధానంగా ఉగ్రవాదాన్ని ఉపయోగించకుండా, తన భూభాగాన్ని రాజ్యేతర శక్తులకు అనుమతించకుండా పాక్ కట్టడి చేయాలి'.

ఈ ఒప్పందం జరిగివుంటే, 'చరిత్ర క్రమాన్ని మార్చివేయడం సాధ్యపడేది'. అయితే ఇప్పటికి కూడా ఇది ముగిసిపోలేదని సతీందర్ సూచిస్తున్నారు. 'ఈ ఒప్పంద సంభావ్యత ఇప్పటికీ ఉనికిలో ఉంది. ముసాయిదా ఒప్పంద సూత్రాలు కానీ, దాని పాఠం కానీ ఇప్పటికీ ఉన్నాయి. ఒప్పంద ప్రక్రియను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందని ఇరుపక్షాలూ భావించినప్పుడు ఎప్పుడైనా దాన్ని మొదలు పెట్టవచ్చు'. నేననుకోవడం ఆశ అనేది నిత్యవసంతం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

జీవితమా, థాంక్యూ!



ఒక్క పరుగు మన రోజును మార్చేస్తుంది. చాలా పరుగులు మన జీవితాన్ని మార్చేస్తాయి. కొండల మీది గాలి, ఎండ పొడ, మంచి పరుగు... నా శరీరంలోని ప్రతి కణంలోనూ జీవితం పట్ల కృతజ్ఞతను అనుభూతిస్తున్నాను. – సెలీనా జైట్లీ, నటి

మర్యాదలో టాప్



నా చిన్నప్పుడు ఒక లక్నో పిల్లాడు మా బాంబే స్కూల్లో చేరాడు. అందరినీ 'ఆప్' (మీరు), తనను తాను 'హమ్' (మేము) అనేవాడు. ఇతర పిల్లలు అనడం గుర్తుంది: 'ఎంత టాప్ హిందీ మాట్లాడుతాడో!' – జోయ్‌జిత్ పాల్, వ్యాఖ్యాత

బలమైన అమెరికా కోసం...



సామ్యవాదం వైపు అమెరికా జారడాన్ని ఆపడానికీ, మన దేశాన్ని దెబ్బకొడుతున్న స్వీయనిందను అంతం చేయడానికీ నేను అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. బలహీనం కాని, మేల్కొలుపువాదం(వోక్) లేని బలమైన, గర్వపడే అమెరికాను పునరుద్ధరించడానికి నేను అధ్యక్ష స్థానం కోసం పోటీచేస్తాను. – నిక్కీ హేలీ, అమెరికా అధ్యక్ష అభ్యర్థి

మురికి దేశం



అఫ్గానిస్తాన్ వాళ్లం ఎప్పుడూ పాకిస్తాన్‌ను ఒక ముస్లిం దేశంగా పరిగణించలేదు. ఇస్లాం మీద, అందరు ముస్లింల మీద పాకిస్తాన్ ఒక మురికి మరక. పాకిస్తాన్ ఎప్పుడూ ఇస్లాంను తీవ్రవాద వ్యాప్తికీ, అఫ్గాన్లు, బలోచులు, కశ్మీరీల్లాంటి అమాయకులను చంపడానికీ వాడుకుంది. తీవ్రవాదానికి తల్లివేరు పాకిస్తాన్. దానిమీద ఆంక్షలు విధించాలి. – బాసిత్ షా, మాజీ జర్నలిస్ట్

అందరం ఒక్కటే!



తమిళనాడులో వలస కూలీల మీద దాడులు జరుగుతున్నాయన్న తప్పుడు వార్తలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపించడం బాధాకరం. మేము, తమిళ ప్రజలం 'వసుధైవ కుటుంబం' భావనను నమ్ముతాం. వేర్పాటువాదాన్నీ, ఉత్తర భారత మిత్రుల పట్ల ద్వేషాన్నీ సమ్మతించం. – కె. అన్నామలై, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు

మళ్లీ అదే తప్పు



ఈ సంవత్సరం బడ్జెట్‌లో కొన్ని మంచి విధానాలున్నాయి. కానీ భారత్ వెలుపలికి పోయే చెల్లింపుల (రెమిటెన్స్) మీద 20 శాతం పన్ను (సోర్సు దగ్గర) విధించడం అనేది తప్పు. ఇది ప్రారంభంలో రూపాయిని బలపరుస్తుంది. కానీ క్రమంగా ఈ పన్ను దేశంలోకి వచ్చే చెల్లింపులను నిరుత్సాహపరుస్తుంది. ఈ రకమైన తప్పులే 1980ల్లో కూడా జరిగాయి. – కౌశిక్ బసు, ఆర్థికవేత్త

కేసు వేయాలనుంది...



ఆరోగ్యకరమైన శరీర భాగాలను చెడ్డ లోహంతో మార్పిడి చేసి నా జీవితాన్ని నాశనం చేసిన డాక్టర్ మీద కేసు వేయమని కొంతమంది సలహా ఇచ్చారు. నేను ప్రయత్నించాను. కానీ లాయర్లు చాలా ఖరీదుగా ఉన్నారు. ఆ డాక్టర్ లైసెన్సు పోతే అతడి దుర్మార్గాల నుంచి కొంతమంది జీవితాలు అయినా కాపాడినట్లు అవుతుంది కదా అనుకున్నాను. – తస్లీమా నస్రీన్, రచయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

తొలి ఆదివాసీ ఉపాధ్యాయుడు

అటవీ ప్రాంతాల్లో అమాయకపు చీకట్లను తరిమివేయాలని ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించిన గొప్ప వ్యక్తి మారూ మాస్టారు. స్వాతంత్ర్యానంతరం 1962లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన తొలి ఆదివాసీగా చెబుతారు. రాజ్ గోండ్ తెగకు చెందిన సిడాం మారూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని గడల్‌పల్లి ఏజెన్సీ గూడేనికి చెందిన సిడాం చైతూ, కాసుబాయి దంపతులకు 1925లో జన్మించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తమ జాతిలో వెనుకబాటుతనాన్ని పోగొట్టాలంటే కనీసం అక్షర జ్ఞానం నింపాలని భావించారు. గిరిజన జాతులపై పరిశోధన చేస్తున్న ఆంత్రాపాలజిస్టు ప్రొఫెసర్ హైమండార్ఫ్ అంటే మారూ మాస్టారుకు అమితమైన భక్తిభావం. ఆయనతో ఉన్న సాన్నిహిత్యంతో ఆయన సలహా మేరకే మారూ ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. అభివృద్ధి మాట అటుంచితే, బాహ్య ప్రపంచమే తెలియని ఆదిమ తెగలైన రాజ్ గోండ్, కోలాం, పర్ధాన్, నాయకపోడు, తోటి కోయ గిరిజనులను చేరదీసి వారి మాతృభాషలోనే విద్యాబోధన చేసేవారు. ఆయనకు పది హేనేళ్ల వయసు ఉన్నప్పుడు 1940లో జరిగిన జోడే ఘాట్ పోరాటంలో క్షతగాత్రులైన తమ వారిని దాచిపెట్టి, అవసరమైన సపర్యలు చేసిన మానవీయుడు, దయా మయుడు మారూ.



సిడాం మారూ

1983 ఫిబ్రవరి 28న ఉపాధ్యాయ వృత్తి నుండి పదవీ విరమణ పొందిన మారూ మాస్టారు వెనువెంటనే ఉట్నూరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) తరఫున నెలకు రూ. 400 కనీస వేతనంపై ఆదివాసీ అభివృద్ధి నిర్వాహకుడిగా నియమితులయ్యారు. ఐటీడీఏ ప్రవేశపెట్టిన పథకాలను, ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని గిరిజను లందరూ అభివృద్ధి చెందేలా చైతన్యం కలిగించిన ఘనత ఆయనకే దక్కుతుంది. గిరిజనులకు అండగా నిలబడి, గిరిజనాభివృద్ధిలో ఆదివాసులను భాగస్వాములుగా చేస్తున్న హైమండార్ఫ్ స్థాపించిన 'రాయ్ సెంటర్ల'ను పునః ప్రారంభించడానికి తగు కృషి చేశారు. తన జీవితాంతం గిరిజనాభి వృద్ధికి పాటుపడిన మారూ మాస్టారు 2000వ సంవత్సరం మార్చి 6న ప్రకృతి ఒడిలోకి చేరిపోయారు. అయినా ఆదివాసీల మదిలో చిరస్థాయిగా నిలిచే ఉంటారు.

– గుమ్మడి లక్ష్మీనారాయణ,
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి । 94913 18409
(నేడు సిడాం మారూ వర్ధంతి)

ఛాట్‌జీపీటీని ఎంత నమ్మాలి?

విశ్లేషణ



శ్రీధర్. జి

ఛాట్‌జీపీటీ అంటే ఏమిటి?

ఛాట్‌జీపీటీ అనేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ద్వారా నడిచే సహజ భాషా ప్రాసెసింగ్ సాధనం. ఇది 'ఛాట్‌బాట్'తో మానవుల్లాగా సంభాషించడానికీ, ఇటువంటి మరిన్ని ప్రయోజనాలు పొందడానికీ అవకాశం కలిపిస్తుంది. భాషా నమూనా ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలదు.

అలాగే ఈమెయిళ్లు, వ్యాసాలు, కోడ్‌ను కంపోజ్ చేయడం వంటి పనులలో సహాయం చేస్తుంది. ఛాట్ జీపీటీ... ప్రస్తుతం పరిశోధన, అభిప్రాయ సేకరణ దశలో ఉన్నందున దాని వినియోగం ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంది. ఛాట్‌జీపీటీ ప్లస్ అనే చెల్లింపు సబ్‌స్క్రిప్షన్ వెర్షన్ కూడా ఉంది.

దీన్ని ఎవరు రూపొందించారు?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–రీసెర్చ్ సంస్థ అయిన ఓపెన్‌ఏఐ అనే సంస్థ ఛాట్‌జీపీటీని సృష్టించింది. కంపెనీ 2022 నవంబర్ 30న దీనిని ప్రారంభించింది.

ఎలా యాక్సెస్ అవ్వొచ్చు?

మీరు chat.openai.com సందర్శించి, ఓపెన్‌ఏఐ ఖాతాను సృష్టించడం ద్వారా ఛాట్ జీపీటీని యాక్సెస్ చేయవచ్చు. సైన్ ఇన్ చేసిన తర్వాత, ఛాట్‌జీపీటీతో ఒక ప్రశ్న అడగడం ద్వారా మీ సంభాషణను ప్రారంభించవచ్చు.

ఎలా పనిచేస్తుంది?

ఓపెన్‌ఏఐ ప్రకారం, ఓపెన్‌ఏఐ రీఇన్‌ఫోర్స్‌మెంట్ లెర్నింగ్ ఫ్రమ్ హ్యూమన్ ఫీడ్‌బ్యాక్ (ఆర్‌ఎల్‌హెచ్‌ఎఫ్) ద్వారా భాషా నమూనాకు శిక్షణ ఇచ్చింది. మానవ ఏఐ శిక్షకులు సంభాషణలతో మోడల్ అందించారు, దీనిలో వారు వినియోగదారు, ఏఐ సహాయకులు అనే రెండు భాగాలను ప్లే చేశారు.

ఛాట్‌జీపీటీ, సెర్చ్ ఇంజిన్‌ల మధ్య తేడా ఏమిటి?

ఛాట్‌జీపీటీ అనేది తుది వినియోగదారుతో సంభాషణను నిర్వహించే ఉద్దేశ్యంతో సృష్టించిన భాషా నమూనా. వినియోగదారు అడిగిన సమాచారాన్ని కనుగొనడంలో సహాయపడటానికి సెర్చ్ ఇంజిన్ ఇంటర్నెట్‌లోని వెబ్ పేజీలను సూచిస్తుంది. సమాచారం కోసం ఇంటర్నెట్‌లో శోధించే సామర్థ్యం ఛాట్ జీపీటీకి లేదు.

పరిమితులు ఏమిటి?

చాలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, ఛాట్ జీపీటీకి ఇప్పటికీ పరిమితులు ఉన్నాయి. ఇన్‌పుట్ ప్రశ్నను అర్థం చేసుకోవడానికి రీవర్డ్ చేయడం అవసరం కాబట్టి, నిర్దిష్ట మార్గంలో ఉన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోవడం వంటి పరిమితులు ఉంటాయి. ఒక పెద్ద పరిమితి ఏమిటంటే అది అందించే ప్రతిస్పందనలలో నాణ్యత లేకపోవడం. అస్పష్టమైన ప్రశ్నలపై వివరణ కోసం అడగడానికి బదులుగా, మోడల్ ప్రశ్నకు అర్థం ఏమిటో అంచనా వేస్తుంది. ఇది ప్రశ్నలకు అనాలోచిత ప్రతిస్పందనలకు దారి తీస్తుంది. 'ప్రాథమిక సమస్య ఏమిటంటే, ఇవి ఉత్పత్తి చేసే సమాధానాలు చాలా తప్పుగా ఉన్నప్పటికీ, అవి సాధారణంగా మంచివి గానే కనిపిస్తాయి. సమాధానాలు రూపొందించటం చాలా సులభం.



మరో ప్రధాన పరిమితి ఏమిటంటే, ఛాట్‌జీపీటీ డేటా 2021కి పరిమితం చేయబడింది. అప్పటి నుండి జరిగిన సంఘటనలు లేదా వార్తల గురించి ఛాట్‌బాట్‌కు అవగాహన లేదు. అందువల్ల 2022లో ప్రపంచ కప్‌ను ఎవరు గెలుచుకున్నారు వంటి ప్రశ్నలకు అది సరైన సమాధానం చెప్పలేదు.

ఛాట్‌జీపీటీ గురించి ఆందోళన ఎందుకు?

ఏఐ ఛాట్‌బాట్‌లు మానవ మేధను భర్తీ చేయడం లేదా క్షీణింపచేయడం గురించి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు, ఛాట్‌బాట్ ఏదైనా అంశంపై ఒక కథనాన్ని క్షణాల్లో సమర్థంగా (అవసరం కానప్పటికీ) రాయగలదు. ఇది మానవ రచయిత అవసరాన్ని గణనీయంగా తొలగిస్తుంది. విద్యార్థులు తాము నేర్చుకోవలసింది నేర్చుకోకుండానే దీని సహాయంతో ఏదైనా క్షణాల్లో రాసే అవకాశం ఉంది. అందువల్ల కొన్ని పాఠశాలలు దీనిని వ్యతి రేకిస్తున్నాయి.

ఏఐ ఛాట్‌బాట్‌కు సంబంధించి మరొక ఆందోళనకరమైన విషయం ఏమిటంటే... తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం! బాట్ ఇంటర్నెట్‌కు కనెక్ట్ కానందున అది సమాచారాన్ని షేర్ చేయడంలో తప్పులు చేయవచ్చు అనేది మరో ఆందోళనకరమైన సంగతి.

బాట్ స్వయంగా ఇలా చెప్పింది, 'నా ప్రతిస్పందనలు వాస్తవం అని అనుకోవాలని నేను అనడంలేదు. నా నుండి లేదా ఏదైనా ఇతర మూలం నుండి స్వీకరించే ఏ సమాచారాన్నయినా ధ్రువీకరించుకోమని నేను ఎల్లప్పుడూ ప్రజలను ప్రోత్సహిస్తాను.' ఓపెన్‌ఏఐ కూడా ఛాట్‌జీపీటీ కొన్నిసార్లు 'అనుకూలంగా ధ్వనిస్తుంది కాని తప్పు లేదా అర్థంలేని సమాధానాలు' రాస్తుందని పేర్కొంది.

ఇంతకూ ఇది మంచిదా, చెడ్డదా?

ఛాట్‌జీపీటీ అనేది ఒక అధునాతన ఛాట్‌బాట్. ఇది ప్రజల జీవితాలను సులభతరం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈమెయిల్‌ను రాయడం లేదా సమాధానాల కోసం వెబ్‌ను నావిగేట్ చేయడం వంటి రోజువారీ దుర్భరమైన పనులలో సహాయం చేస్తుంది. ఏది ఏమైనప్పటికీ, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం వంటి ప్రతికూల ఫలితాలను నివారించడానికి, విస్తృతంగా ఉపయోగించే ముందు కొన్ని సాంకేతిక వివరాలు గమనించాలి. సాధారణంగా, ఏఐ, ఎమ్‌ఎల్ మోడళ్లు ఆదర్శవంతమైన పనితీరు స్థాయిని చేరుకోవడానికి చాలా శిక్షణ, ఫైన్–ట్యూనింగ్‌పై ఆధారపడతాయి అనేది గమనార్హం.

వ్యాసకర్త ఎంబీఏ విద్యార్థి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ । 96426 32683

గ్రహం అనుగ్రహం శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.చతుర్దశి సా.4.06 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: మఖ రా.12.02 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.10.48 నుండి 12.34 వరకు, దుర్ముహూర్తం: ప.12.33 నుండి 1.20 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.41 వరకు, అమృతఘడియలు: రా.9.23 నుండి 11.10 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 6.03.

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సుబ్బారెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన జస్టిస్ సుబ్బారెడ్డి దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం న్యాయమూర్తికి వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న శత చండీ సహిత మహా రుద్రయాగంలో జస్టిస్ సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

విశ్వాసంతో క్రీస్తును ప్రార్థించాలి

- హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ
- ముగిసిన 46వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బ్రదర్ అబ్రహాం, పాస్టర్ జాన్ వెస్లీ తదితరులు

గుంటూరు రూరల్: విశ్వాసంతో క్రీస్తును ప్రార్థిస్తే ఆయన మనకు సమస్తమూ కలుగజేస్తారని హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు. గుంటూరు నగర శివారు గోరంట్ల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 46వ గుడారాల పండుగ ఆదివారంతో ముగిసింది. ముగింపు ప్రార్థనల్లో భాగంగా పాదిలికి చెందిన పాస్టర్ ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్లు, సిస్టర్ల బృందం క్రీస్తు స్తుతి గీతాలను ఆలపించారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ క్రీస్తు భక్తులు విధేయత, విశ్వాసంతో కూడిన ప్రార్థన చేయాలన్నారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం మాట్లాడుతూ సర్వశక్తిగల దేవుడు మనలను ఆశీర్వదిస్తాడని, కష్టాల కడలి నుంచి విముక్తి కలిగిస్తాడని చెప్పారు. క్రీస్తు కృపను పొందితే విజయం తథ్యమన్నారు. ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మద్దాళి గిరి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం దంపతులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. లక్షలాది మంది భక్తులకు గుడారాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్ రమేష్, పాస్టర్ రాజు, పాస్టర్ ప్రైడిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలనిస్తున్న బహుజన ఉద్యమం

- బహుజన పరిరక్షణ సమితి నేతలు
- 889వ రోజుకు చేరిన రిలే దీక్షలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: మూడు రాజధానుల ఏర్పాటు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో బహుజన రాజ్యాధికారం దిశగా తమ ఉద్యమం సత్ఫలితాలనిస్తోందని బహుజన పరిరక్షణ సమితి నేతలు చెప్పారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 889వ రోజుకు చేరాయి. పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. విశాఖ కేంద్రంగా పరిపాలన సాగిస్తానని సీఎం జగన్ ప్రకటనతో రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, అమరావతితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందడం ద్వారా అన్ని వర్గాలకూ మేలు జరుగుతుందన్నారు. కుల వాదం ముసుగులో రాష్ట్రంలో ఓ సామాజిక వర్గం ఆధిపత్యం కోసం చేస్తున్న ఆగడాలకు ఇక చెక్ పడుతుందని చెప్పారు. రాజధానిలో పేదల అసైన్డ్ భూములను కొల్లగొట్టిన కేసులో మాజీ మంత్రి నారాయణ కుటుంబ సభ్యుల ఇంట్లో కీలక డాక్యుమెంట్లు దొరకడం.. అమరావతి పేరుతో బాబుతో కలిసి ఆయన చేసిన అరాచకాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సమితి నేతలు నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులోని మ్యూజియం

'న్యూ'జియం

- రాష్ట్రంలో పురావస్తు ప్రదర్శనశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- విశాఖలో వైఎస్సార్ పేరుతో స్టేట్ మ్యూజియం
- కర్నూలు, కాకినాడ, గుంటూరుల్లో కొత్త భవనాలకు ప్రతిపాదనలు
- శాసన మ్యూజియం ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పురావస్తు ప్రదర్శనశాలలకు (మ్యూజియాలకు) ప్రభుత్వం కొత్తకళ తీసుకురానుంది. శిథిలావస్థలోని మ్యూజియం భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మ్యూజియాల్లో అంతర్జాతీయస్థాయి సాంకేతిక ప్రమాణాలతో ఆంటిక్విటీస్ (పురాతన వస్తువులు) డిస్‌ప్లే చేసేలా ప్రత్యేకదృష్టి సారించింది. తాజాగా విశాఖపట్నంలో దివంగత ముఖ్యమంత్రి



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరుతో స్టేట్ మ్యూజియాన్ని నిర్మించనుంది. మరోవైపు కడపలోని భగవాన్ మహావీర్ మ్యూజియం, గుంటూరులోని బుద్ధశ్రీ మ్యూజియం, కర్నూలులోని జిల్లా మ్యూజియాల్లో కొత్త భవనాలు, ఇతర అభివృద్ధికి రూ.10 కోట్ల చొప్పున డీపీఆర్‌లను రూపొందించింది.

శాసనాల పరిరక్షణకు..

రాష్ట్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో లక్షలాది శాసనాలు, ఎస్టేంపేజీలు (శాసనాల కాపీలు) ఉన్నాయి. వీటిని భవిష్యత్తు తరాలకు అందించేందుకు, రాష్ట్ర సాంస్కృతిక, వారసత్వ సంపదను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వీలుగా ప్రత్యేక 'శాసన మ్యూజియం' నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. తద్వారా ఇప్పటివరకు లభ్యమైన శాసనాల వివరాలను ఒకేవేదికపై ప్రజలకు అందుబాటులో ఉంచనుంది.

పెండింగ్‌లో రూ.436.50 కోట్ల డీపీఆర్‌లు

రాష్ట్రంలోని పురావస్తు ప్రదర్శనశాలలతో పాటు వారసత్వ నగరాల అభివృద్ధి, ఆంటిక్విటీస్ డిజిటలైజేషకు సంబంధించి రూ.436.50 కోట్ల డీపీఆర్‌లు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రూ.400 కోట్లతో రాజమహేంద్రవరాన్ని వారసత్వ నగరంగా తీర్చిదిద్దనున్నారు. వైఎస్సార్ జిల్లాలోని మైలవరం, శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండ, జిల్లా కేంద్రం కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్ మ్యూజియాల డీపీఆర్‌లకు అనుమతులు రావాల్సి ఉంది.

మ్యూజియాల్లో ప్రవేశపెట్టే అంతర్జాతీయస్థాయి సాంకేతికత ఇలా..

- ఇంటరాక్టివ్ రెస్పాన్సివ్ డిజిటల్ వాల్
- వర్చువల్ రియాలిటీ టెక్నాలజీ
- ఇంటరాక్టివ్ డిస్‌ప్లే కియోస్క్
- ఆడియో–వీడియో టెక్నాలజీ
- ప్రొజెక్షన్ మ్యాపింగ్, డిజిటల్ బుక్



కర్నూలులోని మ్యూజియం

వారసత్వ విలువలను ప్రోత్సహించాలి



ఏపీలోని మ్యూజియాలను అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నాం. మన అద్భుతమైన సంస్కృతి, వారసత్వ విలువలను ప్రోత్సహించాలి. ఇందులో భాగంగానే ఇప్పటికే కొన్ని డీపీఆర్‌లు కేంద్రానికి పంపగా.. కొత్తగా మరో నాలుగు మ్యూజియాలకు భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇకపై సామాజిక మాధ్యమాల ద్వారా మన మ్యూజియాల్లోని విశిష్టతను ప్రచారం చేయనున్నాం.
– జి.వాణీమోహన్, కమిషనర్, పురావస్తుశాఖ

వెయ్యేళ్ల కిందటిదే తాతయ్యగుంట గంగమ్మ ఆలయం

- ఆలయ పునర్నిర్మాణంలో బయటపడ్డ పురాతన రాతి శిల్పాలు
- పల్లవుల కాలం నాటి ఆనవాళ్లని చెబుతున్న పురావస్తు శాఖ



రాతి శిల్పాలు, స్తంభాలను పరిశీలిస్తున్న కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి బృందం, ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వెయ్యేళ్లకు ముందే నిర్మాణం జరిగినట్లు పురావస్తుశాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన తవ్వకాల్లో ప్రాచీన రాతి శిల్పాలు బయటపడ్డాయి. ఆలయ చరిత్ర ప్రాశస్త్యాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పురాతన రాతి స్తంభాలపై పరిశోధనలు చేసి వాటి చరిత్రను తెలియజేయాలని కేంద్ర పురావస్తు శాఖను కోరారు. ఆ మేరకు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి బృందం ఆదివారం తిరుపతిలోని గంగమ్మ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణంలో బయటపడ్డ శిల్పాలతో చెక్కిన నిలువు రాతి స్తంభాలు, రాతి కట్టడాలను పరిశీలించారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయం పల్లవు రాజుల చివరి దశలోనిదని, ఈ ఆలయ నిర్మాణం పూర్తిగా వైష్ణవ ఆలయ నిర్మాణానికి అనుగుణంగా జరిగినట్లు అభిప్రాయపడ్డారు. ఆలయ నిర్మాణంలో బయటపడ్డ అన్ని రాతి శిల్పాలను మరింత లోతుగా పరిశోధిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ పురావస్తుశాఖ ద్వారా మరింత లోతుగా అధ్యయనం చేస్తే ప్రపంచంలోనే సంచలనమైనటువంటి విషయాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. 6, 7 శతాబ్దాల కాలంలో గంగమ్మ ఆలయం నిర్మితమై ఉంటుందని చెప్పారు. అన్ని ఆలయాలకంటే ముందే గంగమ్మ ఆలయం నిర్మించినట్లు తెలుస్తోందని వివరించారు.

పేరుపాలెం బీచ్‌లో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

- ఒకరి మృతి.. మరొకరి కోసం గాలింపు
- పశ్చిమగోదావరి జిల్లాలో ఘటన



కందుకూరి లోహిత్ మణికంఠ (ఫైల్)

మొగల్తూరు: పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. తమ కళ్లెదుటే స్నేహితులిద్దరూ గల్లంతు కావడంతో సహచర విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పాలకోడేరు మండలం పెన్నాడలోని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో స్నానాలు చేసేందుకు సముద్రంలోకి దిగిన విజయనగరానికి చెందిన కందుకూరి లోహిత్ మణికంఠ(19), రాజమండ్రికి చెందిన కొమ్మినేని లిఖిత్(19)లు గల్లంతయ్యారు. వీరు గల్లంతైన కొద్దిసేపటికే లోహిత్ మణికంఠ మృతదేహం తీరానికి కొట్టుకురాగా లిఖిత్ కోసం తీరం వెంబడి పోలీసులు, స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టారు. వారు గల్లంతైన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశామని, చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశామని ఏఎస్ఐ రాజేంద్ర తెలిపారు.

బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు సాగాలి

- రాష్ట్ర బ్రాహ్మణ మహిళా సదస్సులో వక్తల పిలుపు
- పాల్గొన్న ఎస్పీ శైలజ, సురభి వాణీదేవి



ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరిస్తున్న ఎస్పీ శైలజ, సముద్రాల వేణుగోపాలచారి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణ సామాజికవర్గం ఐక్యంగా ముందుకు సాగాలని, అప్పుడే ప్రాధాన్యం లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి అభ్యర్థి ఎక్కడ పోటీ చేసినా గెలిపించడానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కాతేరు వద్ద వెంకటాద్రి గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సు ఆదివారం జరిగింది. తెలంగాణ శాసన మండలి సభ్యురాలు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె సురభి వాణీదేవి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యవాడ దుర్గాప్రసాద్, కోనూరు సతీష్‌శర్మ, కోశాధికారి హెచ్‌కే మనోహర్, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు రెంటచింతల దీప్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ తోలేటి శిరీష, ప్రధాన కార్యదర్శి పప్పు సరోజని తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడి ఉన్న బ్రాహ్మణ జాతి ఐక్యంగా ముందుకు నడిస్తే రాజకీయంగా, సామాజికంగా రావాల్సిన వాటా కచ్చితంగా వచ్చి తీరుతుందని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించారు. శైలజ 'అఖిలాండేశ్వరి' పాటను శ్రావ్యంగా ఆలపించారు. సదస్సులో ఎనిమిది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ కలగా ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుర్వాసుల సత్యనారాయణ, కస్తూరి సూర్యకుమారి, జిల్లా మహిళా కన్వీనర్లు యేచూరి లక్ష్మీప్రసన్న, పూజ్యం ఫణి దివ్య, కొండేపూడి లక్ష్మీశిరీష తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు సామినేని విశ్వనాథం ఆదర్శం

- శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ పక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



విశ్వనాథం విగ్రహ ఆవిష్కరణలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జోగి రమేష్, ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాజకీయాలకు అతీతంగా జగ్గయ్యపేట అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన దివంగత 'సర్దార్' సామినేని విశ్వనాథం భవిష్యత్ తరాలకు ఆదర్శమని శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ పక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన మాజీ సర్పంచ్, సీనియర్ రాజకీయవేత్త, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తండ్రి 'సర్దార్' సామినేని విశ్వనాథం విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఉదయభాను అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, నందిగామ, తిరువూరు, మైలవరం ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహన్‌రావు, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగ్గయ్యపేట అభివృద్ధికి సామినేని విశ్వనాథం విశేష కృషి చేశారని కొనియాడారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలకు సామినేని కుటుంబం అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి, మాజీ సీఎం నీలం సంజీవరెడ్డి, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావుతో విశ్వనాథం అత్యంత సన్నిహితంగా ఉంటూ వారి ద్వారా జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ మెహబూబ్ షేక్, ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ



తిరుమల: నంద్యాల జిల్లా అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతోన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సంప్రదాయబద్ధంగా తిరుమల శ్రీవారి తరఫున టీటీడీ పట్టు వస్త్రాలను సమర్పించింది. టీటీడీ తరఫున పారుపత్తేదార్ శ్రీ ఉమామహేశ్వరరెడ్డి అహోబిలం దేవస్థానం ప్రధాన అర్చకుడు కేపీ వేణుగోపాలకు శ్రీవారి సారెను అందించారు. శ్రీలక్ష్మీనరసింహ కల్యాణం సందర్భంగా టీటీడీ సమర్పించిన పట్టు వస్త్రాలను ఆదివారం సాయంత్రం అలంకరించారు.

ఏపీకి పెట్టుబడులు వరసిద్ధి వినాయకుని అనుగ్రహమే

- విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- ముగిసిన లక్షమోదక లక్ష్మీగణపతి హవనం



గణపతికి హారతి ఇస్తున్న స్వరూపానందేంద్ర

సింహాచలం/కాణిపాకం (యాదమరి): యావత్ భారతదేశంలో ఇతర రాష్ట్రాలకు రాని పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే వచ్చాయంటే అది కాణిపాకం వరసిద్ధి వినాయకుని అనుగ్రహమేనని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. చిత్తూరు జిల్లా కాణిపాకంలో మూడురోజులు నిర్వహించిన లక్షమోదక లక్ష్మీగణపతి హవనం ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది. ఈ కార్యక్రమంలో స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ లక్షమోదక హవనం ఫలితం సిద్ధించిందని చెప్పడానికి ఏపీకి వచ్చిన రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులే నిదర్శనమని చెప్పారు. యజ్ఞయాగాదుల ఫలితాలను ప్రశ్నించే హేతువాదుల మనోభావాలు దెబ్బతీసేలా లక్షమోదక హవనం ఫలించిందన్నారు. ఇటువంటి వైదిక కార్యక్రమాలను చేపట్టడం ద్వారా రాష్ట్రం మరింత పురోభివృద్ధి చెందుతుందని చెప్పారు. లక్షమోదక హవనం ప్రారంభం నుంచి పూర్ణాహుతి వరకు కాణిపాకంలో ఉండి పర్యవేక్షించడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

పూర్ణకుంభ హారతి

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో లక్షమోదక లక్ష్మీగణపతి హవనం విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వాముల పూర్ణకుంభ హారతితో పూర్తయింది. ఆదివారం చివరిరోజు హోమాలు పీఠాధిపతుల గోపూజతో ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం వరకు హోమాలు నిర్వహించి అనంతరం పీఠాధిపతులు ఉత్సవ మూర్తులకు మహా పూర్ణకుంభ హారతి ఇచ్చి ముగించారు. భక్తులకు ఈ హవనం ప్రాధాన్యతను వివరించారు. లక్షమోదక లక్ష్మీగణపతి హవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎం.ఎస్.బాబు, ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఈ వెంకటనారాయణ, చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిత్తూరు, తిరుపతి ఎంపీలు, పూతలపట్టు ఎమ్మెల్యేలతోపాటు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు పీఠాధిపతులకు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి చిత్రపటం అందజేశారు.

ఆలయంలో ఉదయాస్తమాన సేవ ప్రారంభం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఉదయాస్తమాన సేవను విశాఖ శారదాపీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. సేవ ప్రారంభం రోజు తిరుపతికి చెందిన రామచంద్రారెడ్డి, పాలకూరుకు చెందిన జీవరత్నంరెడ్డి రూ.లక్ష వంతున చెల్లించి టికెట్లు కొనుగోలు చేశారు. వారికి పీఠాధిపతి సేవా టికెట్లు అందించారు. అనంతరం వారు సేవలో పాల్గొన్నారు.

టీటీడీకి రూ.కోటి విరాళం



డీడీని టీటీడీ అధికారులకు అందజేస్తున్న వడ్లమూడి సరోజినీ

తిరుమల: తన భర్త వడ్లమూడి రమేష్ బాబు జ్ఞాపకార్థం టీటీడీ ఆరోగ్యశ్రీ వరప్రసాదిని పథకానికి హైదరాబాద్‌కు చెందిన వడ్లమూడి సరోజినీ రూ.కోటి విరాళాన్ని అందజేశారు. విరాళం డీడీని దాతల కార్యాలయంలో ఆదివారం ఆమె అందజేశారు.

తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప



తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు తెప్పలపై విహరించారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను మాడ వీధుల్లో ఊరేగించి పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. రాత్రి 7 నుంచి విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై స్వామి, అమ్మవార్లు ఆశీనులై పుష్కరిణిలో మూడు చుట్లు విహరించారు. కాగా, శ్రీభూ సమేతంగా మలయప్పస్వామివారు నాలుగో రోజు ఐదుచుట్లు, చివరి రోజు ఏడుచుట్లు పుష్కరిణిలో తెప్పపై విహరించనున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- కేంద్ర సహాయ మంత్రి మురుగన్

నెల్లూరు (టౌన్): విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి మురుగన్ మాట్లాడుతూ.. విశ్వప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సుమారు 1.80 లక్షల మంది కోరుకుంటున్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు సహకరిస్తామని, రూల్స్‌పై 2017లో రాష్ట్రపతి గెజిట్ కూడా ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితే సర్వీస్ రూల్స్ అమలుకు సహకరిస్తామన్నారు. జేడీ రామలింగం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యా కార్యక్రమాలను వివరించారు. ఆర్ఎస్ఎస్ సహక్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, ఏబీఆర్ఎస్ఎం సహా సంఘటన మంత్రి లక్ష్మణ్, నెహ్రూ యువ కేంద్ర



జాతీయ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కొండ చిలువ హల్‌చల్

తిరుమల: తిరుమలలో ఆదివారం భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. స్థానిక బాలాజీ నగర్‌కు సమీపంలోని డ్రైనేజీ ఫిల్టర్ హౌస్ వద్ద భారీ కొండచిలువ సంచరిస్తున్నట్లు టీటీడీకి అక్కడున్న సిబ్బంది సమాచారమిచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న స్నేక్ క్యాచర్ భాస్కర్‌నాయుడు చాకచక్యంగా పది అడుగుల కొండ చిలువను పట్టి అవ్వాచారి కోనలో విడిచిపెట్టారు.



భారీ కొండచిలువతో భాస్కర్‌నాయుడు

క్లుప్తంగా...

'ఇన్సాఫ్ కె సిపాహి'కి కేజ్రీవాల్ మద్దతు

న్యూఢిల్లీ: రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ దేశంలో జరిగే అన్యాయాలపై పోరాటానికి ఏర్పాటు చేసిన 'ఇన్సాఫ్ కె సిపాహి'వేదికకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మద్దతు ప్రకటించారు. 'సిబల్ ప్రకటించిన ఇన్సాఫ్ సిపాహి చాలా ముఖ్యమైంది. అన్యాయంపై కలిసికట్టుగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ఇందులో చేరాలి'అని ఆదివారం కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. 'ఇన్సాఫ్'కు శివసేన ఉద్ధవ్ వర్గం, ఆర్‌జేడీ చీఫ్, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ మద్దతు దక్కింది.

ఆదివాసీల హక్కులపై బీజేపీతో చర్చకు సిద్ధం

అగర్తలా: తిప్రాసా ప్రజల సమస్యలపై రాజ్యాంగబద్ధ పరిష్కారం కనుగొనేందుకు బీజేపీతో ముఖాముఖి చర్చలకు సిద్ధమని తిప్రా మోథా చీఫ్ ప్రద్యోత్ దేవ్ వర్మన్ చెప్పారు. తిప్రా మోథా డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరిస్తామని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ శనివారం చేసిన ప్రకటనపై దేవ్ స్పందించారు. 'ఆర్థికంగా, రాజకీయంగా, భాషాపరంగా మాకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటిపై గౌరవప్రదంగా చర్చలకు పిలిస్తే వెళ్తాం. స్థానిక ఆదివాసీల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడానికి మేం సిద్ధం. అయితే, ఈ చర్చలు కేబినెట్ పోస్టు కోసమో, వ్యక్తిగత లబ్ధి కోసమో మాత్రం కాదు' అని స్పష్టంచేశారు. ఇటీవలి ఎన్నికల్లో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించిన తిప్రా మోథా మొత్తం 13 ఎస్టీ రిజర్వుడు స్థానాలనూ గెలుచుకుంది.

లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్ లేరు.. ఇది రాజ్యాంగ విరుద్ధం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: లోక్‌సభకు గత నాలుగేళ్లుగా డిప్యూటీ స్పీకర్ లేరని, ఇది రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ఆరోపించింది. లోక్‌సభతోపాటు పలు రాష్ట్రాల శాసనసభలకు డిప్యూటీ స్పీకర్లు లేకపోవడంపై దాఖలైన పిల్‌పై సుప్రీంకోర్టు గత నెలలో కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తాజాగా ఇదే విషయాన్ని ప్రస్తావించింది. ప్రతిపక్ష నేతకు దక్కరాదనే ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉంచుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. '1956లో ప్రధాని నెహ్రూ ప్రతిపక్ష నేత, తన విధానాలను తీవ్రంగా విమర్శించే అకాలీదళ్ ఎంపీని సర్దార్ హుకుం సింగ్ పేరును డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపాదించారు'అని అప్పటి ఘటనను జైరాం రమేశ్ ఉదహరించారు.

ఉత్తర కొరియాలో ఆకలి కేకలు



1990ల నాటి ఉత్తర కొరియా కరువు తీవ్రతకు దర్పణంగా నిలిచిందీ ఫొటో. నాటి కరువు తీవ్రతకు సంబంధించి వెలుగులోకి వచ్చిన అతి కొన్ని సాక్ష్యాల్లో ఇదొకటి

పైన పటారం, లోన లొటారం అన్నట్టుగా తయారైంది ఉత్తర కొరియా పరిస్థితి. అధ్యక్షుడు కిమ్ వరుస క్షిపణి పరీక్షలతో దాయాది దక్షిణ కొరియాకు, దాని మద్దతుదారు అమెరికాకు సవాళ్లు విసురుతుంటే దేశం మాత్రం కనీవినీ ఎరుగని కరువు కోరల్లో చిక్కి అల్లాడుతోంది. తిండికి లేక జనం అలమటిస్తున్నారు. తక్షణం దిద్దుబాటు చర్యలకు దిగకుంటే 1990ల్లో దేశం చవిచూసిన 20 లక్షల పై చిలుకు ఆకలి చావుల రికార్డు చెరిగిపోయేందుకు ఎంతో కాలం పట్టదంటూ ఆందోళన వ్యక్తమవుతోంది...!

– సాక్షి, నేషనల్ డెస్క్



తీవ్ర కరువు కోరల్లో దేశం

క్షిపణి పరీక్షల్లో కిమ్ బిజీ	చుక్కల్లో సరుకుల ధరలు

కిలో బియ్యం రూ.220

అటు కాలం కనికరించడం లేదు. తీవ్ర వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో గతేడాది పంట దిగుబడులు కుదేలయ్యాయి. ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అంతో ఇంతో ఆదుకుంటూ వచ్చిన ప్రజా పంపిణీ వ్యవస్థ చేతులెత్తేసింది. ఇంతకాలం మార్కెట్లో దొరుకుతూ వచ్చిన చైనా తిండి గింజలు, నిత్యావసరాలు కరోనా కట్టడి దెబ్బకు మూడేళ్లుగా అసలే అందుబాటులో లేకుండా పోయాయి. దాంతో ఉత్తర కొరియా అక్షరాలా ఆకలి కేకలు పెడుతోంది. జనాభాలో అధిక శాతం రోజుకు ఒక్క పూట కూడా తిండికి లేక అలమటిస్తున్నారు. నియంతృత్వపు ఇనుప తెరలు దాటుకుని ఏ విషయమూ బయటికి రాదు గనుక అధికారిక గణాంకాలు అందుబాటులో లేవు. కానీ ఇప్పటికే లక్షలాది మంది కరువు బారిన పడ్డట్టు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. కరువు మరణాల సంఖ్య కూడా నానాటికీ పెరుగుతున్నట్టు చెబుతున్నాయి. అస్తవ్యస్త పాలనకు మారుపేరైన కిమ్ ప్రభుత్వమే ఇందుకు ప్రధాన దోషిగా కనిపిస్తోంది.

కారణాలెన్నో...

- కొరియా కరువుకు చాలా కారణాలున్నాయి. కరోనా దెబ్బకు ఆహార కొరత తీవ్రతరమైంది.
- ప్రభుత్వం తీవ్ర ఆంక్షలను విధించి అత్యంత కఠినంగా అమలు చేయడం, సరిహద్దులను పూర్తిగా మూసేయడంతో సమస్య మరింత పెరిగింది.


2.5 కోట్ల జనాభా ఆహార అవసరాలు తీర్చడానికి కనీసం 55 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు అవసరం. కాగా వార్షిక సగటు ఉత్పత్తి 45 లక్షల టన్నులే. మిగతా 10 శాతం లోటు చాలావరకు చైనాతో సాగే అనధికారిక వర్తకం ద్వారా పూడేది. తిండి గింజలు, నిత్యావసరాలతో పాటు పలు ఇతర చైనా సరుకులు 2020 దాకా దేశంలోకి భారీగా వచ్చేవి. ముఖ్యంగా గ్రామీణుల అవసరాలు చాలావరకు వీటిద్వారానే తీరేవి. కానీ మూడేళ్లుగా ఆంక్షల దెబ్బకు ఈ వర్తకం దాదాపుగా పడకేసింది. ఇది సగటు కొరియన్లకు చావుదెబ్బగా మారింది. దీనికి తోడు గతేడాది తిండి గింజల ఉత్పత్తి 35 లక్షల టన్నులకు మించకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది.

- ప్రభుత్వం వద్ద భారీగా ఆహార నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవలే చైనా నుంచి భారీగా బియ్యం, గోధుమ పిండి తదితరాలను దిగుమతి చేసుకుంది కూడా. కానీ 'ముందు జాగ్రత్త' చర్యల్లో భాగంగా వాటిని కావాలనే దాచి ఉంచిందని పరిశీలకులు చెబుతున్నారు. ఫలితంగా నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతున్నాయి. ప్రజల్లో చాలామందికి కొనుగోలు శక్తి క్షీణించడంతో వారికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. కిలో బియ్యం ధర ఏకంగా 220 రూపాయలకు ఎగబాకిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు!
- వ్యవసాయ రంగంలో సమూల మార్పులు తెచ్చి దేశాన్ని స్వయంసమృద్ధంగా మార్చుకుంటామంటూ తాజాగా జరిగిన 4 రోజుల వర్కర్స్ పార్టీ సమావేశాల్లో కిమ్ గంభీరంగా ఉపన్యాసమిచ్చారు. అది ఏ మేరకు వాస్తవ రూపు దాలుస్తుందన్న దానిపైనే కొరియన్ల భవితవ్యం ఆధారపడుతుంది.

తీవ్ర అసమానతలు

- ఉత్తర కొరియా ప్రపంచంలోని అత్యంత నిరుపేద దేశాల జాబితాలో ఉంది. ప్రజల తలసరి ఆదాయం కేవలం రూ.1.3 లక్షలు!
- దేశంలో సామాజిక అసమానతలు చాలా ఎక్కువ.
- అత్యధికులకు, ముఖ్యంగా గ్రామీణులకు అన్నం, కాయగూరలే ప్రధానాహారం.
- మాంసాహారం, పండ్లు వారికి అందని ద్రాక్షే.
- పట్టణాల్లో పరిస్థితి కాస్త మెరుగు. రాజధాని ప్యాంగ్యాంగ్‌లో స్తోమత ఉంటే అన్నిరకాల ఆహారమూ దొరుకుతుంది.
- దేశంలో ప్రైవేట్‌లో ఆహారం, ఆహార ధాన్యాల అమ్మకం నిషిద్ధం. కానీ కొన్నేళ్లుగా ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా కుదేలైంది. దాంతో ప్రైవేట్ క్రయ విక్రయాలను ప్రభుత్వం చూసీ చూడనట్టు పోతోంది.

రికార్డు స్థాయిలో క్షిపణి ప్రయోగాలు



1990ల్లో ఉత్తర కొరియా చవిచూసిన భయానక కరువు గురించి ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. 'ఆర్డియస్ మార్చ్'గా పిలిచే ఈ కరువుకు అస్తవ్యస్త పాలన, సోవియట్ నుంచి సాయం ఆగిపోవడంతో పాటు 1995లో వచ్చిన భారీ వరదలు తక్షణ కారణంగా మారాయి. వాటి దెబ్బకు దేశంలో వరి పంట దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. నాలుగో వంతుకు పైగా పొలాలు రోజుల తరబడి అడుగుల లోతు నీటిలో మునిగిపోయాయి! జనమంతా పనీపాటా

ఆ కరువుకు 20 లక్షల మంది బలి!

వదిలేసి కేవలం తిండి గింజల కోసం రోజుల తరబడి పొలాల వెంబడి తిరుగుతూ అలమటించిన దృశ్యాలు అప్పట్లో అందరినీ కలచివేశాయి. కనీవినీ ఎరగని ఆ కరువుకు రెండు కోట్ల జనాభాలో పదో వంతుకు పైగా, అంటే 20 లక్షల మందికి పైగా బలైనట్టు చెబుతారు. అంతేగాక ఏకంగా 62 శాతం మందికి పైగా చిన్నారులు పౌష్టికాహార లోపానికి గురై శాశ్వత ఆరోగ్య తదితర సమస్యల బారిన పడ్డారు. రెండు మూడేళ్ల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చినా చిన్నారులు మాత్రం కోలుకోలేకపోయారు. నేటికీ ఉత్తర కొరియాలో 22 శాతం మంది బాలలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్టు అంచనా!

నిధులన్నీ సైన్యానికే!

- ఉత్తర కొరియా 12 లక్షల మందితో కూడిన ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద సైన్యాన్ని పోషిస్తోంది.
- ఏటా జీడీపీలో ఏకంగా నాలుగో వంతు సైన్యంపైనే వెచ్చిస్తోంది.
- 2022లోనైతే దేశ చరిత్రలోనే అత్యధికంగా దాదాపు 70 ఖండాంతర, క్రూయిజ్ క్షిపణులను పరీక్షించింది!
- తన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు ఇటీవలే భారీ సంఖ్యలో ఖండాంతర క్షిపణులు తదితరాలతో నెల రోజుల క్రితమే అతి పెద్ద సైనిక పరేడ్‌ను నిర్వహించింది!
- ఇలా వనరులన్నీ రక్షణ రంగానికే మళ్లుతుండటంతో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం దక్కకుండా పోతోంది.
- కిమ్ అణు పరీక్షల కారణంగా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు విధించిన ఆంక్షలతో పరిస్థితి మరింత విషమించింది.
- కేవలం గతేడాది క్షిపణి పరీక్షలకు వెచ్చించిన నిధులతో దేశ జనాభా మొత్తానికీ ఏడాది పాటు చాలినన్ని తిండి గింజలు అందించవచ్చని అంచనా.

ఇమ్రాన్ అరెస్ట్‌కు పోలీసుల యత్నం

లాహోర్‌లో ఆయన ఇంటి వద్ద ఉద్రిక్తత



ఇమ్రాన్ ఇంటివద్ద గుమిగూడిన మద్దతుదారులు

లాహోర్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టుచేసేందుకు ఇస్లామాబాద్ నుంచి పోలీసు బృందం లాహోర్‌లోని ఖాన్ నివాసానికి చేరుకోవడంతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది. వందలాది మంది ఇమ్రాన్ మద్దతుదారులు ఆయన ఇంటికి చేరుకోవడం, నినాదాలు, పోలీసులు వెనుతిరగడం వంటి ఘటనలతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

అసలేం జరిగింది?

పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్(పీటీఐ) చీఫ్ ఇమ్రాన్ పాక్ ప్రధానిగా ఉన్న కాలంలో పలు దేశాల పాలకులు, అగ్రనేతలు ఖాన్‌కు ఇచ్చిన విలువైన బహుమతులను కేంద్ర ఖజానా(తోషఖానా)కు అప్పగించకుండా వాటిని తక్కువ ధరకే కొని వేరే వ్యక్తులకు ఎక్కువ ధరకు అమ్మి లాభం గడించాడని కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే మూడు సార్లు ఇస్లామాబాద్ సెషన్స్ కోర్టుకు రాకుండా ఖాన్ ఎగ్గొట్టారు. దీంతో అరెస్ట్ చేసి అయినా కోర్టు ముందు నిలబెట్టాలని ఇస్లామాబాద్ ఎస్పీతో కూడిన పోలీసు బృందం ఆదివారం లాహోర్‌కు చేరుకుని ఆయన ఇంటికెళ్లింది. విషయం తెల్సుకున్న పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు వందలసంఖ్యలో అక్కడి చేరుకున్నారు. ఈ నెల ఏడోతేదీన ఖాన్ కోర్టుకు వస్తారని ఆయన తరఫు లాయర్లు హామీ ఇవ్వడంతో పోలీసులు వెళ్లిపోయారు. అరెస్ట్ సమయంలో ఘర్షణ ఆపేందుకు ఆ వీధిలో కంటైనర్లు అడ్డుపెట్టడం, వాటర్ కేనన్లు, బలగాలను మోహరించడంతో ఆ ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. 'కోర్టుకు తీసుకెళ్లే దారిలో నన్ను చంపాలని కుట్ర పన్నారు. 74 తప్పుడు కేసులపై పాక్ చీఫ్ జస్టిస్‌కు లేఖ రాస్తా' అని ఖాన్ ఆ తర్వాత ఆరోపించారు.

ప్రజాస్వామ్యంపై దారుణ దాడి

లండన్‌లో కార్యక్రమంలో మోదీ సర్కార్‌పై రాహుల్ ఆరోపణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

లండన్: నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ సర్కార్.. భారత ప్రజాస్వామ్య మౌలిక స్వరూపంపై దాడికి తెగబడిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే కన్యాకుమారి నుంచి కశ్మీర్‌దాకా భారత్ జోడో యాత్రగా ముందుకు కదిలామని ఆయన వివరించారు. బ్రిటన్ పర్యటనలో ఉన్న రాహుల్ శనివారం సాయంత్రం లండన్‌లోని ఇండియన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్(ఐజేఏ) కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. 'దేశ ప్రజాస్వామ్య మౌలిక స్వరూపం ప్రమాదంలో పడింది. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను మోదీ సర్కార్ ముమ్మరం చేసింది. దేశం గొంతు నొక్కాలని చూస్తున్న బీజేపీ యత్నాన్ని అడ్డుకునేందుకు భారత్ జోడో యాత్రగా ప్రజల వాణిని వినిపించాల్సిన అవసరం వచ్చింది. అందుకే యాత్ర చేపట్టాం. విపక్షాల ఐక్యత కోసం సంప్రతింపులు చురుగ్గా సాగుతున్నాయి. నిరుద్యోగిత, పెరిగిన ధరలు, మహిళలపై హింసతో పెల్లుబికిన ప్రజాగ్రహాన్ని తగ్గించేలా ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటు కోసం కృషి జరుగుతోంది' అని రాహుల్ అన్నారు. 'ఇటీవల ముంబై, ఢిల్లీలో బ్రిటన్‌కు చెందిన బీబీసీ వార్తాసంస్థ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖతో సర్వే పేరిట ఆకస్మిక దాడులు చేయించి భయపెట్టి, కేంద్రం మీడియా గొంతు నొక్కాలని చూస్తోంది. బీబీసీ మోదీ సర్కార్ మాట వింటే సంస్థపై మోపిన తప్పుడు కేసులన్నీ మాయమవుతాయి' అని ఆరోపించారు.

ప్రతిష్ట దిగజార్చింది ఆయనే

విదేశీ గడ్డపై భారత ప్రతిష్టను దిగజార్చేలా రాహుల్ మాట్లాడారని శుక్రవారం బీజేపీ చేసిన విమర్శలపై రాహుల్ బదులిచ్చారు. 'నా దేశాన్ని ఏనాడూ తక్కువ చేసి మాట్లాడలేదు. అది నా స్వభావం కూడా కాదు. ప్రధాని హోదాలో విదేశీ పర్యటనకు వెళ్లి మోదీయే ఆ పనిచేశారు. గత దశాబ్దకాలంలో భారత్ అభివృద్ధికి నోచుకోలేదని మోదీ అన్నారు. దేశ పురోగతికి పాటుపడిన ఇక్కడి ప్రజలను ఆయన అవమానించలేదా ?' అని ప్రశ్నించారు.

భయం వద్దు..తమిళులు మంచివారు

వలస కార్మికులనుద్దేశించి తమిళనాడు గవర్నర్

చెన్నై: తమిళనాడు ప్రజలు ఎంతో మంచివారని, స్నేహభావంతో ప్రవర్తిస్తారని రాష్ట్ర గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉత్తరాది వలసకార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని వారిని కోరారు. అభద్రతా భావానికి, భయాందోళనలకు లోనుకావద్దన్నారు. ఈ మేరకు ఆయన పలు ట్వీట్లు చేశారు. కాగా, వలసకార్మికుల భద్రతపై పుకార్ల నేపథ్యంలో బిహార్ అధికారుల బృందం తిరుపూర్‌లోని దుస్తుల కర్మాగారాలను సందర్శించింది. అక్కడి దుస్తుల కర్మాగారాల్లో పనిచేసే వలస కార్మికుల భద్రతపై అక్కడి అధికారులతో చర్చలు జరిపి, సంతృప్తి వ్యక్తం చేసింది. వదంతులకు కారకులుగా హిందీ వార్తా పత్రికకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై పోలీసులు కేసులు పెట్టారు. బీజేపీ తమిళనాడు చీఫ్ అన్నామలైపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనిపై అన్నామలై స్పందించారు. 'ఉత్తరాది సోదరులకు వ్యతిరేకంగా డీఎంకే 7 దశాబ్దాలుగా సాగిస్తున్న దుష్ప్రచారాన్ని బయట పెట్టినందుకే నాపై కేసు పెట్టారు. చేతనైతే అరెస్ట్ చేయాలి'అని ఆయన ప్రభుత్వానికి సవాల్ విసిరారు. తమిళనాడులో వలసకార్మికులపై దాడులు వార్తలకు కేంద్రంపై కారణమని బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఆరోపించారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణిని భారతీయ నావికాదళం ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ– డీఆర్‌డీఓ దేశీయంగా రూపొందించిన ఈ క్షిపణి షిప్ లాంచ్డ్ వెర్షన్‌ను అరేబియా సముద్రంలో పరీక్షించినట్లు సీనియర్ ఆర్మీ అధికారి ఒకరు చెప్పారు. భారత్–రష్యా సంయుక్త భాగస్వామ్య బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జలాంతర్గాములు, విమానాలు, ఓడలతోపాటు నేలపై నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేస్తోంది. బ్రహ్మోస్ క్షిపణులు ధ్వని వేగానికి దాదాపు మూడు రెట్ల వేగంతో ప్రయాణించగలవు. వీటిని భారత్ ఎగుమతి కూడా చేస్తోంది. ఇందుకు సంబంధించి గత ఏడాది ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణి యాంటీ షిప్ వెర్షన్‌ను గత ఏడాది ఏప్రిల్‌లో భారత్ విజయవంతంగా ప్రయోగించింది.

సిసోడియాను సీబీఐ చిత్రహింసలు పెడుతోంది: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో అరెస్టయిన మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ అధికారులు మానసికంగా చిత్రహింసలు పెడుతున్నారని ఆప్ ఆరోపించింది. తప్పుడు అభియోగాలను ఒప్పుకుని, సంతకాలు చేయాలంటూ ఆయన్ను బలవంతం చేస్తున్నారని పేర్కొంది. ఆప్ జాతీయ ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఆయనపై మోపిన అభియోగాలకు సంబంధించి సీబీఐ వద్ద ఆధారాలు లేవన్నారు. సిసోడియా నివాసంపై జరిపిన దాడుల్లోనూ ఏమీ దొరకలేదని చెప్పారు. సిసోడియా ఫిబ్రవరి 28వ తేదీ నుంచి సీబీఐ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే.

నానో డీఏపీతో సాగు మరింత సులువు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: నానో లిక్విడ్ డీఏపీ(డై అమ్మోనియం ఫాస్ఫేట్)కి ఆమోదం తెలపడం రైతుల జీవితాన్ని సులభతరం చేయడంలో కీలక ముందడుగని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. నానో ద్రవీకృత డీఏపీను మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చేసిన ట్వీట్‌కు ప్రధాని ఈ మేరకు స్పందించారు. ఎరువులపై స్వావలంబన దిశగా ఇది పెద్ద ముందడుగుగా ప్రధాని పేర్కొన్నారు. ఎరువుల సహకార సంఘం ఇఫ్కో 2021లో నానో లిక్విడ్ యూరియాను ప్రవేశపెట్టింది.

మహిళల కోసం 'లాడ్లి బెహనా'యోజన

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా లాడ్లి బెహనా(ప్రియమైన సోదరి) పథకాన్ని ప్రకటించింది. భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి 'లాడ్లి బెహనా యోజన'ఫలకాన్ని ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. పథకం కింద ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.వెయ్యి అందజేస్తుంది. ఇందుకు అర్హులుగా.. ఆదాయ పన్ను చెల్లించని, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉండే వారు, తదితర కేటగిరీలను నిర్ణయించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ఈ పథకంతో లబ్ధి కలుగనుంది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లను కేటాయించారు. మార్చి 15–ఏప్రిల్ 30 తేదీల మధ్య దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

విమానం సీట్లోనే మూత్ర విసర్జన

న్యూయార్క్–ఢిల్లీ ఫ్లైట్‌లో ఘటన

న్యూఢిల్లీ: న్యూయార్క్–ఢిల్లీ విమానంలో మత్తులో ఉన్న ప్రయాణికుడు నిద్రలోనే మూత్ర విసర్జన చేసిన మరో ఘటన నమోదైంది. ఈసారి ఓ విద్యార్థి తను కూర్చున్న సీట్లోనే మూత్ర విసర్జన చేయగా, తోటి ప్రయాణికుడి దుస్తులు తడిచిపోయాయి. విమానం ఢిల్లీకి చేరుకున్న వెంటనే పోలీసులు సదరు విద్యార్థిని అదుపులోకి తీసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. న్యూయార్క్–ఢిల్లీ విమానంలో ఓ ప్రయాణికుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ అధికారులు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాన్ ఎఫ్ కెన్నడీ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరిన ఏఏ292 రకం విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయానికి రాగానే సీఐఎస్ఎఫ్ అధికారులు ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. అమెరికాలో చదువుకుంటున్న సదరు నిందితుడిని ఢిల్లీలోని డిఫెన్స్‌కాలనీ వాసిగా గుర్తించామని ఢిల్లీ ఎయిర్‌పోర్టు డీసీపీ దేవేశ్ చెప్పారు. అనంతరం అతడిని వదిలి పెట్టామన్నారు. 'విచారణ నివేదికను డీజీసీఏకి అందజేశాం. బాధిత ప్రయాణికుడి నుంచి మాకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు'అని చెప్పారు. నిబంధనల మేరకు చర్యలు తప్పవన్నారు. అయితే, ఫిర్యాదు చేస్తే తన భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని సదరు విద్యార్థి బాధిత ప్రయాణికుడిని వేడుకున్నట్లు తెలుస్తోంది.

త్రిపురలో సీఎం రేసులో ప్రతిమా భౌమిక్!

అగర్తలా: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ మార్కు దాటి ఎక్కువ స్థానాలను గెలుచుకున్న బీజేపీ కూటమిలో కొత్త సమస్య ఎదురయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏడాదికాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న మాణిక్ సాహాకు పోటీగా కేంద్ర సహాయ మహిళా మంత్రి ప్రతిమా భౌమిక్‌ను సీఎం రేసులో నిలపాలని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ దేవ్ భావిస్తుండటమే ఇందుకు కారణం. సీఎం అభ్యర్థిగా ఒక్కరినే ఎన్నుకునేలా, ఏకగ్రీవం కోసం ఒప్పించేందుకు ఈశాన్యభారతంలో బీజేపీ సమస్యల పరిష్కర్త, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. బిప్లవ్ వర్గాన్ని శాంతింపజేసేందుకు ప్రతిమా భౌమిక్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు శేఖర్ దత్తా అభిప్రాయపడ్డారు. 60 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ 32 చోట్ల, దాని కూటమి పార్టీ ఐపీఎఫ్‌టీ ఒక చోట విజయం సాధించిన విషయం తెల్సిందే. మరోవైపు మార్చి ఎనిమిదో తేదీన కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరుకానున్నారు. త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాల ఏర్పాటుపై బీజేపీ అగ్రనేత అమిత్ షాతో అస్సాం సీఎం హిమంత భేటీ అయ్యారు. భేటీలో నాగాలాండ్ సీఎం నేపియూ రియో సైతం పాల్గొన్నారు.

మరింత శక్తివంతంగా చైనా సైన్యం

బీజింగ్: భారత్, తైవాన్‌లతో కయ్యానికి కాలుదువ్వుతున్న చైనా తన సైనిక శక్తిని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకుంది. అందులోభాగంగా రక్షణ బడ్జెట్‌ను వరసగా ఎనిమిదోసారి పెంచింది. దీంతో చైనా రక్షణ బడ్జెట్ గత ఏడాదితో పోలిస్తే 7.2 శాతం ఎగసి 1.55 ట్రిలియన్ యువాన్‌లకు చేరుకుంది. గత ఏడాది 1.45 ట్రిలియన్ యువాన్లు కేటాయించింది. డాలర్లలో చూస్తే గత కేటాయింపులు 230 బిలియన్ డాలర్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈసారి డాలర్‌తో యువాన్ మారకం విలువ తగ్గడంతో కేటాయింపులు గతంతో పోలిస్తే కాస్త తక్కువగా 225 బిలియన్ డాలర్లుగా నమోదవడం గమనార్హం. బడ్జెట్ వివరాలను ఆదివారం దేశ పార్లమెంట్(నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్–ఎన్‌సీపీ)లో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆ దేశ ప్రధాని లీ కెక్వియాంగ్ సరిహద్దులో సైన్యం విజయాలను గుర్తుచేశారు. 'సరిహద్దుల్లో ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. సరిహద్దు రక్షణ, ప్రాదేశిక సముద్ర జలాలపై హక్కుల పరిరక్షణ, కోవిడ్ సంక్షోభం వంటి వాటిని విజయవంతంగా ఎదుర్కొన్నాం' అంటూ పరోక్షంగా తూర్పు లద్దాఖ్‌ను ప్రస్తావించారు. 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ శతాబ్ది ఉత్సవాల నాటికి పెట్టుకున్న లక్ష్యాలను పూర్తిచేసేలా సైనిక చర్యలను చేపట్టాలి' అని ఆర్మీనుద్దేశించి అన్నారు. దక్షిణ, తూర్పు సముద్ర జల్లాలపై పూర్తి హక్కులు తమకే దక్కుతాయని వాదిస్తూ పొరుగు దేశాలతో చైనా ఘర్షణలకు దిగడం తెల్సిందే. వియత్నాం, మలేసియా, ఫిలిప్పీన్స్, తైవాన్, జపాన్‌లతో చైనా తగవులకు దిగుతోంది. ఈ ఆర్థికసంవత్సరంలో భారత రక్షణ బడ్జెట్ కేటాయింపులు 72 బిలియన్ డాలర్లుకావడం గమనార్హం.

మళ్లీ యెడ్డీ వైపే బీజేపీ మొగ్గు

- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారకర్తగా ముందుంచే అవకాశం
- మరో ప్రత్యామ్నాయం లేకనే అంటున్న విశ్లేషకులు



బెంగళూరు: కర్ణాటకలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్పపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఎన్నికల ప్రచార బాధ్యతలను ప్రధాని మోదీతోపాటు యెడియూరప్ప సారథ్యం వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయబోనంటూ ఇప్పటికే ప్రకటించిన యెడియూరప్పను మళ్లీ క్రియాశీలకంగా మార్చేందుకు కమలనాథులు ప్రయత్నాలు ప్రారంభించారు. అట్టడుగు స్థాయి నుంచి పార్టీని విస్తరించి, నాలుగు పర్యాయాలు సీఎం పీఠం అధిరోహించిన నేతగా ఆయనపై ఇప్పటికీ ప్రజాభిమానం చెక్కుచెదరలేదు. మరీ ముఖ్యంగా లింగాయత్ కులస్తుల్లో80 ఏళ్ల ఈ వృద్ధ నేతకున్న పలుకుబడి మరే ఇతర రాజకీయ పార్టీ నేతకూ లేదు. ఈ విషయాన్ని గ్రహించే ఆయన కేంద్ర నాయకత్వం రానున్న ఎన్నికల్లో ఆయన్ను 'పోస్టర్ బాయ్'గా ఉంచి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రణాళికలు వేస్తోంది. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో జరిగిన పలు బహిరంగ సభలు, సమావేశాల్లో ప్రధాని మోదీతోపాటు హోం మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యెడియూరప్పపై ప్రశంసలు కురిపించడం వెనుక కారణం ఇదే. ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడం, లింగాయత్ ఓటు బ్యాంకును పదిలం చేసుకోవడంతోపాటు ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష కాంగ్రెస్‌ను కట్టడి చేసేందుకు సైతం యెడియూరప్ప అవసరం ఎంతో ఉందని రాజకీయ పరిశీలకులతోపాటు కాషాయ వర్గాలు సైతం అంటున్నాయి. రాష్ట్ర బీజేపీకి మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఇష్టం లేకున్నా యెడియూరప్పనే ప్రచారంలో ముందుంచేందుకు బీజేపీ అధిష్టానం సిద్ధమవుతోందని అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన రాజకీయ విశ్లేషకుడు ఎ.నారాయణ చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం | 6 | మార్చి | 2023

అమ్మవారికి చందన సేవ

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే బనశంకరీదేవి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ శాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలు చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.


చందన అలంకరణలో బనశంకరీదేవి

న్యూస్‌రీల్

హెల్త్ ఇన్స్‌పెక్టర్ పట్టివేత


నిందితుడు రామయ్య

కృష్ణరాజపురం: బీబీఎంపీ ఆరోగ్య శాఖ విభాగం హెల్త్ ఇన్స్‌పెక్టర్ లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కాడు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కోసం సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి దరఖాస్తు చేశాడు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామయ్య రూ. 18 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో అతను లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం హోసతిప్పసంద్ర వార్డులో హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామయ్య లంచం తీసుకుంటుండగా లోకాయుక్త దాడి చేసి పట్టుకుంది. అతని వద్ద అదనంగా ఉన్న రూ. 50 వేల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు.

రూ.33 లక్షల జరిమానా చెల్లించిన బీఎంటీసీ

బనశంకరి: బెంగళూరు నగరంలో 12 వేల సిగ్నల్ జంప్‌లు చేసిన బీఎంటీసీ డ్రైవర్లు, సంస్థకు కోటి రూపాయలు నష్టం కలిగించారు. నగరంలోని బీఎంటీసీ డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్‌కు అనేక ప్రాణాలు గాల్లో కలిశాయి. ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు 12 వేల సిగ్నల్ జంప్ చేసిన కేసులు మొత్తం జరిమానా కోటి రూపాయలకు చేరుకుంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పక్కా కేసుల్లో రూ.66 లక్షలు జరిమానాలో ట్రాఫిక్ పోలీసులు 50 శాతం రాయితీతో రూ.33 లక్షలు జరిమానాను బీఎంటీసీ పాలక మండలి చెల్లించింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడిన డ్రైవర్లకు వారి వేతనంలో జరిమానా మొత్తం చెల్లించాలి. అలా చేసినప్పటికీ ట్రాఫిక్ రూల్స్ పట్ల డ్రైవర్లు జాగృతం కాలేదు. దీంతో బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్, సేఫ్టీ డ్రైవింగ్ పట్ల శిక్షణ ఇవ్వాలని బీఎంటీసీ తీర్మానించింది.

దేశ రహస్యాల విక్రయానికి యత్నం


నిందితుడు ఉదయ్‌కుమార్(ఫైల్)

కెలమంగలం: కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలోని రహస్యాలను సెల్‌ఫోన్ ద్వారా ఫోటోలు తీసి విదేశీ గూఢచార సంస్థలకు విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని బైరగొండపల్లి గ్రామానికి చెందిన రామక్రిష్ణారెడ్డి కొడుకు ఉదయ్‌కుమార్ (32). బెంగళూరులో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా 2017 నుంచి 2019 వరకు పనిచేశాడు. ఈ సమయంలో కార్యాలయంలో భద్రపరిచిన పలు ధృవీకరణ పత్రాలు, పరిశోధనా ఉపకరణాలను సెల్‌ఫోన్ ద్వారా ఫోటోలు తీసి విదేశీ ఏజెన్సీల వద్ద విక్రయించి డబ్బు సంపాదించడానికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకొన్న తరువాత పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టి ఉదయ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. కేసు విచారణలో ఉంది.

సింహం కన్నుమూత


మృతిచెందిన సింహం (ఫైల్)

బొమ్మనహళ్లి: బెంగళూరు బన్నేరుఘట్ట ఉద్యాన వనంలో రెండేళ్ల నందిని అనే ఆడ సింహం మృతి చెందినట్లు ఉద్యానవన డైరెక్టర్ సునీల్ పన్వార్ తెలిపారు. సానియా, రామ అనే సింహాలకు జన్మించిన నందిని పుట్టినప్పటి నుంచి నరాల రోగంతో బాధపడుతోంది. చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూసింది.

ఆచూకీ లేని ఎమ్మెల్యే

- విరూపాక్షప్ప కోసం లోకాయుక్త లుక్‌ఔట్ జారీ!
- మూడు రోజులుగా అదృశ్యం
- విచారణలో ముడుపుల కేసు

బనశంకరి: లక్షలాది రూపాయల ముడుపుల కేసులో అరెస్ట్ భయంతో పరారీలో ఉన్న దావణగెరె జిల్లా చెన్నగిరి బీజేపీ ఎమ్మెల్యే మాడాళ విరూపాక్షప్పకు లోకాయుక్త పోలీసులు లుక్‌ఔట్ నోటీస్ జారీచేయాలని నిర్ణయించారు. లుక్‌ఔట్ నోటీస్ జారీచేస్తే ఆయన విదేశాలకు వెళ్లిపోవడం కుదరదు. విమానాశ్రయాలు, ఓడరేవులతో పాటు దేశవ్యాప్తంగా ఈ లుక్‌ఔట్ నోటీస్ జారీచేస్తారు. సదరు వ్యక్తి విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తే దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకోవడం లేదా అరెస్ట్ చేసే అవకాశం ఉంది. మాడాళ విరూపాక్షప్ప కోసం లోకాయుక్త పోలీసులు 7 బృందాలతో గాలిస్తున్నారు. అంతేగాక విచారణకు రావాలని నోటీసులు పంపారు. ఆయన కుమారుడు ప్రశాంత్ మాడాళ్ నివాసంలో లభించిన రూ.6 కోట్లు నగదు, ప్రైవేటు కార్యాలయంలో రూ.2 కోట్లుకు పైగా నగదు ఎక్కడి నుంచి వచ్చిందో దర్యాప్తు జరుగుతోంది.


ఎమ్మెల్యే కోసం పలు బృందాల గాలింపు


మాడాళ్ విరూపాక్షప్పకు గద్దుకాలం

లుక్‌ఔట్‌కు సన్నాహాలు

ఈ కేసులో మాడాళ్ విరూపాక్షప్ప ఏ1 నిందితుడు కాగా గత మూడురోజులనుంచి ఆయన ఎక్కడ ఉన్నారనేది లోకాయుక్త పోలీసులు కనిపెట్టలేకపోయారు. దీంతో లుక్‌ఔట్ నోటీస్ ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిసింది. బెంగళూరు డాలర్స్‌కాలనీలోని నివాసం, దావణగెరె, చెన్నగిరి నివాసం, కేఎస్‌డీఎల్ కార్యాలయం, బంధువుల ఇళ్లతో పాటు ఇతర చోట్ల లుక్‌ఔట్ నోటీస్‌లు అతికిస్తారు. లుక్‌ఔట్ నోటీస్ వెలువడితే సంబంధిత వ్యక్తి కచ్చితంగా లొంగిపోవాల్సి ఉంటుంది. ఆయనకు ఆశ్రయం కల్పించినవారు కూడా చట్టాన్ని అతిక్రమించినవారవుతారు.

దర్శకుని వ్యంగ్యోక్తులు

శివాజీనగర: మైసూరు శాండల్ సోప్ ఉపయోగించాలంటే వెనుకంజ వేసే పరిస్థితి వచ్చిందని సినీ దర్శకుడు నాగతిహళ్ళి చంద్రశేఖర్ ట్వీట్ చేశారు. మాడాళ్ విరుపాక్షప్ప, కుమారుని ఇంట్లో కోట్లాది రూపాయలు నగదు లభించడంపై వ్యంగ్యంగా స్పందించారు. మాడాళ్ చేసిన అవినీతితో ప్రభుత్వ అనుబంధ సంస్థ, ఉత్పత్తుల్లో విశ్వాసం, గౌరవం కోల్పోయినట్లయింది. నాలాంటివారు చాలా ఏళ్లుగా ఉపయోగిస్తున్న మైసూరు శాండల్ సోప్‌పై నమ్మకం పోయేలా చేశారు అని వాపోయారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు: సీఎం

లోకాయుక్తకు పూర్తి అధికారాలు అందించి తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవడం మా నైతికత. తప్పులను దాచిపెట్టడం కాంగ్రెస్ నైతికత అని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై అన్నారు. ఆదివారం బాళె హొన్నూరులో విలేకరులతో బొమ్మై మాట్లాడుతూ.. సీఎం రాజీనామా చేయాలని కాంగ్రెస్‌వారు అడుగుతున్నారు సరే, సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక మంత్రి ఆఫీసులో రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఆ రోజు సిద్దరామయ్య ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. లోకాయుక్త ఉన్నట్లయితే అప్పుడే అతడిపై కేసు పెట్టేవారు, అవినీతిని దాచిపెట్టుకుని మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే విరూపాక్షప్ప రాజీనామా గురించి ఇంకా నిర్ణయించలేదని, లోకాయుక్తకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రాయగఢలో తాను ఆవిష్కరించిన శివాజీ విగ్రహాన్ని మళ్లీ కాంగ్రెస్ నేతలు ప్రారంభించడం హాస్యాస్పదమని అన్నారు.

ఫాక్స్‌కాన్ వస్తోందా.. లేదా?

- పరిశ్రమ ఏర్పాటుపై భిన్నవాదనలు



ఒప్పందం కుదరలేదని ప్రచారం

సాక్షి, బెంగళూరు: ప్రతిష్టాత్మక ఆపిల్ ఉత్పత్తుల తయారీ కంపెనీ ఫాక్స్‌కాన్ బెంగళూరుకు వస్తోందా, లేదా అనేదానిపై సందిగ్ధం ఏర్పడింది. మార్చి 3న తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సంస్థ అధ్యక్షుడు యంగ్ లియు 17 మంది బృందంతో కలసి పర్యటించారు. దొడ్డబళ్లాపుర వద్ద పారిశ్రామిక ప్రాంతంలో ఉత్పత్తి కేంద్రం ప్రారంభించేందుకు స్థల పరిశీలన కూడా చేశారు. తరువాత సీఎంతో భేటీ అయి చర్చించారు. దొడ్డబళ్లాపురం వద్ద రూ. 5 వేల కోట్ల పెట్టుబడితో యాపిల్ ఫోన్లు, పరికరాల విడి భాగాల తయారీ కేంద్రం రానుందని, ఇందుకోసం ఫాక్స్‌కాన్ ముందుకు వచ్చినట్లు సీఎం ట్విట్టర్‌లో ప్రకటించారు.



సీఎంపై ప్రతిపక్షాల ఆగ్రహం

భారతదేశంలో ఎలాంటి పెట్టుబడులు పెట్టడం లేదని ఫాక్స్‌కాన్ అధ్యక్షుడు స్పష్టం చేసినట్లు ఒక ఆంగ్ల దినపత్రిక వార్తను ప్రచురించింది. ఇది ప్రతిపక్షాలకు ఆయుధమైంది. సీఎం ఎన్నికల విన్యాసాలు చేస్తున్నారని సుర్జేవాలా, ప్రియాంక్ ఖర్గే తదితర కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారు. ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, చెవుల్లో పువ్వులు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎలాంటి ఒప్పందం చేసుకోకుండానే సర్కారు అబద్ధ ప్రచారానికి దిగిందని జేడీఎస్ మాజీ సీఎం కుమారస్వామి విమర్శించారు. దీనిపై ప్రభుత్వం ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు.

పంచమసాలిల రాస్తారోకో

- 2ఏ రిజర్వేషన్ల కోసం డిమాండు

దొడ్డబళ్లాపురం: 2ఏ రిజర్వేషన్లకై డిమాండు చేస్తూ పంచమసాలి సామాజికవర్గం 50 రోజులుగా బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో చేస్తున్న పోరాటానికి మద్దతుగా పంచమసాలి లింగాయత్ జగద్గురు శ్రీబసవ జయమృత్యుంజయ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం నెలమంగల సమీపంలోని జాస్ టోల్ వద్ద భారీ రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రార్థన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన స్వామిజీ పంచమసాలి సామాజికవర్గం వారు రెండేళ్లుగా 2ఏ రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం మాత్రం హామీకే పరిమితమయిందన్నారు. తల్లిమీద ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి మంత్రివర్గంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మాట ఇచ్చి ఇప్పుడు మాట తప్పారన్నారు. అందువల్ల తమ సామాజికవర్గం ఇలా వీధికెక్కాల్సి వచ్చిందన్నారు. ఇకపై పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల తనిఖీ


పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

మండ్య: ఈ నెల 12వ తేదీన మండ్య నగరంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా కలెక్టర్ హెచ్‌ఎస్ గోపాలకృష్ణ, ఎస్పీ ఎన్. యతీష్‌లు ఆదివారం బెంగళూరు–మైసూరు వేగమార్గంపై ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని మోదీ ఈ దశపథ రోడ్డును ప్రారంభించి రోడ్ షో నిర్వహిస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఇరువురూ తనిఖీ చేశారు. పర్యాటక మందిరం నుంచి జేసీ సర్కిల్ మీదుగా నంద సర్కిల్ ద్వారా రోడ్‌షో సాగుతుంది. ఎక్కడా అపరిశుభ్రత అనేది ఉండరాదని ఆదేశించారు. నగరంలో పలు మార్గాల్లో సాధారణ ప్రజల రాకపోకలపై నియంత్రణ ఉంటుంది.




హోలీ ఆయీరే

హోలీ సంబరాలు రావడంతో ఆదివారం బెంగళూరు మల్లేశ్వరంలో రంగుల కొనుగోలులో బాలికలు. ఇక ధార్వాడలో హోలీకి ముందు హలగి హబ్బ సందర్భంగా తప్పెట్లు కొడుతున్న బాలలు

సినీఫక్కీలో మోస్ట్ వాంటెడ్ అరెస్టు

- నగరంలో ఎన్‌ఐఏ ఆపరేషన్

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లాలో బీజేపీ నాయకుడు ప్రవీణ్ నెట్టారు హత్య కేసులో ఎన్‌ఐఏ అధికారులు మోస్ట్ వాంటెడ్ నిందితున్ని అరెస్ట్ చేశారు. బెంగళూరు అమృతహళ్లి స్టేషన్ పరిధిలోని దాసరహళ్లిలో శనివారం రాత్రి తౌఫిల్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతని స్వస్థలం కొడగు జిల్లా కాగా ఇక్కడ దాక్కున్నాడు. ఐదు నెలల నుంచి అమృతహళ్లి మారుతీ లేఔట్‌లో నంజుండప్ప ఇంటిలో తౌఫిల్ బాడుగకు ఉంటున్నాడు. ఎవరితోను మాట్లాడేవాడు కాదు. అతన్ని పట్టుకోవాలని ఆటోలో, ప్లంబర్ పనిచేసేవారిగా ఇద్దరు ఎన్‌ఐఏ అధికారులు రించ్ పట్టుకొని వెళ్లారు, అదే సమయంలో మాంసం కోస్తున్న తౌఫిల్ వారిపై దాడికి యత్నించగా, అడ్డుకుని నిర్బంధించారు. గతంలో ఇతని ఆచూకీ చెబితే రూ. 5 లక్షలు నజరానా ఇస్తామని ఎన్‌ఐఏ ప్రకటించింది. ప్రవీణ్ హత్య కేసులో ఎన్‌ఐఏ ఇప్పటికే సుమారు 240 మంది సాక్షులను విచారించి 15 వందల పేజీల చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది.


నిందితుడు తౌఫిల్

మళ్లీ కోవిడ్ గుబులు



- నెమ్మదిగా పెరుగుతున్న కేసులు
- నేడు ఆరోగ్యమంత్రి సమీక్ష

శివాజీనగర: రాష్ట్రంలో గత ఒక వారం నుంచి కరోనా కేసులు పెరుగుతున్నందున సురక్షిత చర్యల అమలుపై ఆరోగ్య మంత్రి కే.సుధాకర్ సోమవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. వారం రోజుల నుంచి రాష్ట్రంలో కరోనా వైరస్ కేసులు పెరిగాయి. అంతేకాకుండా పలువరిలో హెచ్3ఎన్2 అనే వైరస్ కూడా బయటపడింది. జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి లక్షణాలు హెచ్3ఎన్2 కారక ఇన్‌ఫ్లూయెంజాలో కనిపిస్తాయి. పశుపక్ష్యాదులకు కూడా ఈ వైరస్ బెడదగా మారింది.

ఆదివారం ఉదయం విధానసౌధ వద్ద మంత్రి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్3ఎన్2 వైరస్‌పై నిఘా వహించాలని రాష్ట్రానికి సూచించింది. ఈ విషయమై సోమవారం అధికారులు, నిపుణుల సమావేశం జరపనున్నట్లు తెలిపారు.

శనివారం 95 కేసులు

రాష్ట్రంలో ఒక వారం నుంచి కరోనా వైరస్ కేసులు పెరిగాయి, శనివారం 95 మంది కరోనాకు గురైనట్లు తెలిసింది, ఇందులో బెంగళూరులోనే 70 కేసులు బయటపడ్డాయని మంత్రి చెప్పారు. 100 రోజుల తరువాత రాష్ట్రంలో కోవిడ్ కేసుల్లో మార్పు వచ్చిందన్నారు. ప్రతి వంద పరీక్షల్లో 2.44 శాతం పాజిటివ్‌గా వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి సురక్షితా చర్యలను అమలు చేయాలనేదానిపై, వైరస్ నియంత్రణ చర్యల గురించి ఈ భేటీలో చర్చిస్తామని చెప్పారు.

కొడవలితో నరికివేత

- నంజనగూడు తాలూకాలో పాతకక్షలతో హత్య


హతుడు మహేష్

మైసూరు: పట్టపగలే వ్యక్తి పైన మరో వ్యక్తి వేట కొడవలితో నరికి చంపిన సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకా హెడియాల గ్రామంలో జరిగింది. హతుడు మహేష్ (27). మహేష్ ఆదివారం ఇంటి వద్ద ఆటోలో కూర్చుని ఉండగా గిరీష్ అనే వ్యక్తి హఠాత్తుగా వచ్చి కొడవలతో ఇష్టానుసారం నరికాడు. తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో మహేష్ రక్తపు మడుగులో పడిపోయాడు. స్థానికులు మైసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. హుల్లహళ్ళి పోలీసులు పరారీలో ఉన్న గిరీష్‌ను అరెస్టు చేశారు. పాత కక్షలే హత్యకు కారణమని తెలిసింది.

ఇద్దరు గొలుసు దొంగల అరెస్టు

మైసూరులో తరచూ గొలుసు చోరీలు జరగడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ఇద్దరు చైన్ స్నాచర్‌లను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ. 7.10 లక్షల విలువ చేసే 205 గ్రాముల 5 చైన్‌లను స్వాధీనం చేసుకొన్నారు. రెండు బైకులు, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. నిందితులు రుమాన్ (25) సుహాల్ (26). ఎన్‌ఆర్ పోలీసులు విచారణ చేపట్టారు.

కాలువలోకి జారి పడి బాలుడు మృతి

కాలువలోకి జారిపడి అభిషేక్ (16) అనే బాలుడు మృతి చెందిన సంఘటన నంజనగూడు తాలూకాలోని హుల్లహళ్ళి గ్రామంలో చోటు చేసుకుంది. ఇతను హుల్లహళ్ళిలో 9వ తరగతి విద్యార్థి. గ్రామంలో ఆత్వాల్ కట్ట కాలువలో ముఖం కడుక్కుంటూ జారిపడ్డాడు, ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు.

24 నుంచి రవాణా ఉద్యోగుల సమ్మెబాట

శివాజీనగర: తమ డిమాండ్లు పరిష్కారం కాకపోవడంతో రవాణా (ఆర్టీసీ) ఉద్యోగులు మళ్లీ సమ్మె బాటపట్టనున్నారు. ఈ నెల 24 నుంచి బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ధర్నాకు సమాయాత్తమవుతున్నారు.

బీఎంటీసీ, కేఎస్ ఆర్టీసీ, కేకే ఆర్టీసీ, ఎన్ డబ్ల్యూ కే ఆర్టీసీ సిబ్బంది ధర్నాలో పాల్గొననున్నారు. వేతన కమిషన్ సిఫార్సుల మేరకు జీతాలను పెంచాలనే డిమాండ్‌తో సమ్మె చేయాలని నిర్ణయించామని, 2016 నుంచి వేతనాలు పెరగలేదని రవాణా ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. 2021లో ధర్నా చేయగా, రవాణా మంత్రి హామీ మేరకు విరమించామని, అయితే ఈసారి డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని చెప్పారు.

9న కాంగ్రెస్‌చే రాష్ట్ర బంద్

తుమకూరు: అధికార బీజేపీ అవినీతి ఖండిస్తూ ఈనెల 9న రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెలిపారు. ఆదివారం తుమకూరు జిల్లా కొరటిగెరెలో జరిగిన రాజీవ భవన్ ప్రారంభోత్సవంలో మీడియాతో మాట్లాడుతూ...9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రాష్ట్ర మొత్తం బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. రెండు గంటల పాటు వ్యాపారులు అందరూ సహకరించాలని కోరారు.

కులాంతర పెళ్లిపై బహిష్కార కొరడా

- రూ. 6 లక్షల జరిమానా కూడా
- చామరాజనగర జిల్లాలో అమానుషం

బనశంకరి: కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ఐదేళ్ల తరువాత కులపెద్దలు రూ.6 లక్షలు జరిమానా విధించి సంఘ బహిష్కరణ చేశారు. సినిమాలలో కనిపించే ఇటువంటి సంఘటనలు నిజ జీవితంలోనూ ఇంకా జరుగుతున్నాయి. చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూకా కుణగళ్లిలో సంఘటన జర్గా, ఈ నెల 1వ తేదీన కొళ్లేగాల డీఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని గోవిందరాజు, శ్వేత దంపతులు మనవిచేశారు.

దళిత యువతిని పెళ్లాడినందుకు



వివరాలు.. ఉప్పారశెట్టి సముదాయానికి చెందిన కుణగళ్లి గోవిందరాజు, మండ్య జిల్లా మళవళ్లి తాలూకా హువినకొప్పలు గ్రామానికి చెందిన దళిత యువతి శ్వేతను ప్రేమించి 2018 సెప్టెంబరు 19న కుటుంబసభ్యుల సమక్షంలో మళవళ్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. మళవళ్లిలో నివాసం ఉండే దంపతులు కుణగళ్లికి అప్పుడప్పుడు వెళ్లేవారు. వీరిద్దరిదీ కులాంతర పెళ్లని గోవిందరాజు కుల పెద్దలకు తెలిసింది. కొన్నిరోజుల కిందట పంచాయతీచేసి గోవిందరాజు కుటుంబానికి రూ.3 లక్షలు జరిమానా విధించారు. ఈ నెల 1వ తేదీలోగా చెల్లించాలని ఆదేశించారు.

ఫిర్యాదు చేశారని జరిమానా రెట్టింపు

తామేం తప్పుచేశామని బాధితులు ప్రశ్నించి కొళ్లేగాల డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో కులపెద్దలకు కోపం వచ్చి జరిమానాను రూ.6 లక్షలకు పెంచి ఆ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారు. వారితో గ్రామప్రజలెవరూ మాట్లాడరాదు, దుకాణాల్లో పాలు, కూరగాయలు, నిత్యావసర వస్తువులను అమ్మరాదు అని ప్రచారం చేశారు. ఈ ఘటన పై యళందూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సింహ వాహనంపై ఖాద్రీశుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో నాల్గవ రోజైన ఆదివారం స్వామి వారు సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, పండితుల వేద మంత్రాల నడుమ అర్చకులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహం శౌర్యానికి, గాంభీర్యానికి, పరాక్రమానికి ప్రతీక. స్వామివారికి ప్రీతి పాత్రమైన ఈ సింహ రూపంలోనే నరసింహ అవతారమెత్తి హిరణ్య కశిపుడిని సంహరించారు. ఎప్పటి లాగానే తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాదస్వరం, డోలు విద్వాంసులు స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతుంటే వాహనం ముందు భక్తితో పాటు తమ కళను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



సింహవాహనంపై తిరువీధుల్లో దర్శనమిస్తున్న శ్రీవారు

క్లుప్తంగా

బొమ్మైతో ప్రధాన్ భేటీ

శివాజీనగర: ఎన్నికల కార్యచరణ గురించి సీఎం బసవరాజ బొమ్మైతో రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చర్చలు జరిపారు. ముడుపులపై కాంగ్రెస్ ధర్నాల నేపథ్యంలో సమాలోచనలు సాగాయి. ఆదివారం నగరంలోని రేస్‌కోర్స్ రోడ్డులో ఉన్న సీఎం అధికార నివాసం రేస్ వ్యూ కాటేజీలో సీఎంతో భేటీ అయ్యారు. ప్రభుత్వ, పార్టీలోని ప్రస్తుత పరిస్థితుల గురించి అవలోకన చేశారు. పార్టీ ఎమ్మెల్యే మాడాళ్ విరుపాక్షప్ప ముడుపుల వ్యవహారం చర్చకు వచ్చింది. ఇలాంటివి జరగకుండా మంత్రులు, బోర్డు, కార్పొరేషన్ అధ్యక్షులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. 40 శాతం పర్సెంటేజ్ కమీషన్, అవినీతి ఆరోపణను సమర్థంగా ఎదుర్కోవాలని తెలిపారు. మంత్రులందరూ కలసికట్టుగా కాంగ్రెస్ ఆరోపణలను ఎదుర్కోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



కాలువ వంతెన పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి

సాక్షి,బళ్లారి: నగరంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. రూ. 3.5 కోట్లతో హెచ్ఎల్‌సీ కాలువ వంతెన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లుకు సూచించారు. కార్పొరేటర్లు కల్పన వెంకట్రామిరెడ్డి, మోత్కూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పబ్ వద్ద గలాటా

బనశంకరి: కర్ణాటక కార్మిక పరిషత్ అనే సంస్థకు చెందిన 15 మంది డోలు వాయిస్తూ శనివారం రాత్రి బ్రిగేడ్ రోడ్డులోని ఒక పబ్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో బౌన్సర్లు వారిని అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రెండు వర్గాలు రోడ్డుపై దాడులు చేసుకోవడంతో అక్కడ గందరగోళం ఏర్పడింది. సమాచారం అందగానే అశోకనగర పోలీసులు చేరుకుని కార్మిక పరిషత్ సభ్యులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ప్రహ్లాద అవతారంలో దర్శనం



బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి పరిధిలోని అగరలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని బ్రహ్మ రథోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు ప్రహ్లాద అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అనంతపురం చంద్రమౌళి ఆధ్వర్యంలో స్వామివారికి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి విశేషపూజలు నిర్వహించారు. తరువాత మంగళ వాయిద్యాల నడుమ స్వామిని పల్లకీపైన ఉంచి భక్తులు పల్లకీని మోస్తూ ఊరేగించారు.

దావణగెరె మేయర్‌గా వినాయక



వినాయకను అభినందిస్తున్న నాయకులు

యశవంతపుర: దావణగెరె మేయర్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన వినాయక పైల్వాన్, ఉప మేయర్‌గా యశోద యగ్గప్పా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 27వ వార్డు నుంచి ఎన్నికైన వినాయక.. ఎమ్మెల్యే శామనూరు శివశంకరప్పకు రాజకీయంగా కుడి భుజంగా గుర్తింపు పొందారు. సవితా హుల్లుమని, వినాయక పైల్వాన్ పేర్లను ప్రతిపాదించగా కాంగ్రెస్ సభ్యులు వినాయక పేరును ప్రతిపాదించారు.

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సురేంద్రబాబు

రాయచూరు రూరల్: మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కలెక్టర్ సురేంద్ర బాబు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా అధికార యంత్రాగం, జిల్లా ఆరోగ్యశాఖ, రెడ్‌క్రాస్, గ్రీన్ రాయచూరు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. బీపీ, షుగర్, క్యాన్సర్, గర్భకోశ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు నందిత, గణేష్, లలిత, షాకీర్ పాల్గొన్నారు.

తుంగభద్రలో పూడికతీత సాధ్యమే

- రూ.15వేల కోట్లు ఖర్చు చేస్తే 30 టీఎంసీల నీరు పొందొచ్చు
- విశ్రాంత సీనియర్ ఇంజినీర్ ద్వారకానాథ్



మాట్లాడుతున్న ఇంజినీర్ ద్వారకానాథ్

సాక్షి,బళ్లారి: ఆధునిక సాంకేతికతతో తుంగ భద్ర డ్యాంలో పూడిక తీత సాధ్యమేనని విశ్రాంత ఇంజినీర్ ద్వారకనాథ్ పేర్కొన్నారు. నగరంలోని గాంధీభవన్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూడికతో 30 టీఎంసీలు నీరు నష్టపోతున్నామన్నారు. రూ.15వేల కోట్లు ఖర్చు చేస్తే 30 టీఎంసీల నీటిని తిరిగి పొందవచ్చన్నారు. పూడిక తీత ద్వారా తొలగించిన మట్టిని నిల్వ చేసేందుకు తొలగించేందుకు 55వేల ఎకరాలు కావాలని తీర్మానించారని, అయితే తన అంచనా ప్రకారం 11వేల ఎకరాలు సరిపోతుందన్నారు. ఈ పనులు పూర్తి చేసేందుకు మూడు నుంచి నాలుగు సంవత్సరాలు పడుతుందన్నారు. పూడిక తీసిన ప్రాంతంలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేస్తే రూ.15వేల కోట్ల ఆదాయం వస్తుందని, పూడికతీతకు ఖర్చు చేసిన మొత్తం తిరిగి పొందవచ్చునని అంచనా వేశారు. అప్పర్ భద్ర పూర్తయితే టీబీ డ్యాంకు మరింత నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని పూడిక తీసేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. రైతు సంఘం నాయకులు చాగనూరు మల్లికార్జునరెడ్డి,మాధవరెడ్డి,సీనియర్ ఇంజినీర్లు గోవిందరాజులు, మహాబళేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలుున్ని బలిగొన్న రీఫిల్లింగ్ దందా

పేలుడు జరిగి మృతి



బాలుడు మహేశ్ (ఫైల్)

యశవంతపుర: గ్యాస్ సిలిండర్ పేలి బాలుడు మృతి చెందిన ఘటన బెంగళూరు హెబ్బాళ గుడ్డదహళ్లిలో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జరిగింది. గుడ్డదహళ్లిలో సిలిండర్ రీఫిల్ చేస్తుండగా గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. పక్కనున్న అంగడిలో తినుబండారాలు కొనుక్కునేందుకు వచ్చిన బాలుడు మహేశ్ (13)కు పేలుడులో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ చిన్నారి మరణించాడు. రీఫిల్లింగ్ గోదాము దేవరాజ్‌కు చెందినది కాగా, లియాకత్ అనే వ్యక్తి రీఫిల్లింగ్ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో బయట పడింది. హెబ్బాళ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. బాలుడు మహేశ్ చోళనాయకనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. సెలవు కావడంతో ఇంటి వద్దే ఉండి ప్రమాదం బారినపడ్డాడు.

జగద్గురు రేణుకాచార్య బోధనలు ఆచరణీయం



జగద్గురు రేణుకాచార్య చిత్రపటం ఊరేగింపు

రాయచూరు రూరల్ : వీరశైవ ధర్మాన్ని వ్యాప్తి చేసిన మహనీయుడు జగద్గురు రేణుకా చార్యులని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు అన్నారు. జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా వీరశైవ కళ్యాణ మంటపంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన యుగమనోత్సవ కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. ధర్మం నుండే విశ్వ శాంతి సాధ్యమని జగద్గురు రేణుకాచార్య బోధించారన్నారు. అనంతరం జగద్గురు రేణుకాచార్య చిత్రపటాన్ని ఊరేగించారు. ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, అభినవ రాచోటి శివాచార్య, వీర సంగన బసవ శివాచార్యులు పాల్గొన్నారు. అదేవిధంగా లింగసూ గురు బైపాస్ సర్కిల్‌లో రేణుకాచార్యుల చిత్ర పటానికి రాయచూరు రూరల్ శాసన సభ్యుడు బసన గౌడ, మాజీ ఎమ్మెల్యేలు శంకరప్ప, బోసురాజ్, నగరసభ అధ్యక్షుడు లలిత పూజలు చేశారు.

అటవీ సీఐడీ సంచారదళ పోలీస్‌స్టేషన్ ప్రారంభం



పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించిన దృశ్యం

బళ్లారి రూరల్ : వన్యజీవులు, అటవీసంపద పరిరక్షణకు సీఐడీ సంచారదళ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసినట్లు బెంగుళూరు అటవీశాఖ సీఐడీ ఏడీజీపీ కె.వి.శరత్‌చంద్ర అన్నారు. విమ్స్ డైరెక్టర్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన అటవీ సీఐడీ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుత్తూరు నుంచి ఈ పోలీస్‌స్టేషన్‌ను బళ్లారికి మార్చినట్లు తెలిపారు. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాలు వస్తాయన్నారు. కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల అమ్మకాలను సాగించే ముఠాచర్యలను అరికట్టడానికి ప్రజలు సహకరించాలని కోరారు. బళ్లారి డీజీపీ బి.ఎస్.లోకేశ్, ఎస్పీరంజిత్‌కుమార్ బండారు, డీవైఎస్పీ నటరాజ్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతుండగా పేలిన సెల్‌ఫోన్



కాలిపోయిన మొబైల్ ఫోన్, కంటికి గాయాలైన దృశ్యం

హొసపేటె: సెల్‌ఫోన్ పేలి యువకుడు గాయపడ్డాడు. ఈఘటన కూడ్లిగి తాలూకా గడ్లెగట్టి గ్రామంలో చోటు చేసుకుంది. పవన్‌రెడ్డి అనే యువకుడు ఆదివారం తన ఇంటి నుంచి స్నేహితుడితో ఫోన్‌లో మాట్లాడుతుండగా మొబైల్ పెద్ద శబ్దంతో పేలి మంటలు చెలరేగి కాలిపోయింది. ఘటనలో పవన్‌కు ముఖంతో పాటు కళ్లకు గాయాలైనట్లు తండ్రి నాగరాజు తెలిపారు. పవన్‌ను కూడ్లిగి ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

హొసపేటె: విజయనగర జిల్లా హిరేహడగలి రాజవాళ గ్రామ సమీపంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా శనివారం రాత్రి హిరేహడగలి పోలీసులు దాడి చేశారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దొంగ, ఇద్దరు వ్యాపారుల అరెస్టు



అరెస్టయిన నిందితులు

దొడ్డబళ్లాపురం: చోరీ చేసిన నగలను కొనుగోలు చేస్తున్న ఇద్దరు మార్వాడీ వ్యాపారులను అరెస్టు చేసిన సంఘటన నెలమంగలలో చోటుచేసుకుంది. నంజనగూడు తాలూకాకు చెందిన గిరీష్ అలియాస్ పవన్ (32) గత ఏడాది డిసెంబర్‌లో నెలమంగల తాలూకాలో జాతరలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేశారు, ఇతని నుంచి దొంగ సొత్తు కొంటున్న నంజనగూడులోని శ్రీనాథ్ బ్యాంకర్స్, మురుదర్ జ్యువెల్లర్స్ యజమానులను కూడా అరెస్టు చేశారు. పవన్ బెంగళూరు చుట్టుపక్కల జిల్లాల్లో స్నాచింగ్‌లు, దోపిడీలకు పాల్పడి ఆ నగలను వీరిద్దరికీ విక్రయించి జల్సాలు చేసేవాడు.

ఎస్కాం టెండర్లలో అవినీతి

మైసూరు: రాష్ట్రంలో ఉన్న ఐదు ఎస్కాంల పరిధిలో ఐపి సెట్‌లకు మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 800 కోట్లతో అభివృద్ధి పనులకు టెండర్లను పిలిచారని, ఇందులో అక్రమాలు జరిగాయని కేపీసీసీ నేత ఎం.లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ అక్రమాలపై ఆధారాలతో వారం రోజుల్లో లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తానన్నారు. కేపిటి చట్టం ప్రకారం టెండర్ వేయడానికి ఒక నెల గడువు ఉంటుంది, కానీ 10 రోజులు సమయం ఇచ్చి నియమాలు పాటించకుండా రూ.800 కోట్ల రూపాయలను లూటీ చేయాలని చూస్తున్నారని అన్నారు.

దాహం తీర్చండి మహాప్రభో



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

రాయచూరురూరల్ : నగరంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి ప్రారంభమైంది. గుక్కెడు నీటి కోసం అల్లాడి పోతున్నారు. ఏపీఎంసీ కాలనీలో, మెడికల్ కళాశాల వద్ద రక్షిత మంచినీటి పథకాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో కాలనీల వాసులు కిలోమీటర్ దూరం వెళ్లి బోరు నీటిని తెచ్చుకుంటున్నారు. ఏపీఎంసీ హమాలీ కాలనీ వాసులు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. నగరసభ అధికారుల తీరుపై మండిపడ్డారు. తక్షణం నీటి ఎద్దడి తీర్చాలని డిమాండ్ చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్ల రికవరీ

హుబ్లీ: ప్రజలు పోగొట్టుకున్న, చోరికి గురైన మొబైల్ ఫోన్ల ఆచూకీ కనుగొనేందుకు ఆధునిక సాంకేతిక సహకారంతో పోలీసు శాఖ నూతన ప్రయోగాలు చేపట్టి విజయవంతమైంది. ఈ మేరకు హుబ్లీ,ధార్వాడ జంట నగరాల్లో చోరీకి గురైన రూ. 3 లక్షల విలువైన 30 సెల్‌ఫోన్లను గుర్తించి స్వంతదారులకు అందజేసినట్లు జంట నగరాల పోలీసు కమిషనర్ రమణగుప్తా తెలిపారు. డీసీపీ గోపాల నేతృత్వంలో నలుగురు పోలీసుల బృందం సెల్‌ఫోన్ల జాడను గుర్తిస్తోందన్నారు. మొబైల్ పోయిన సమయంలో అందులోనుంచి వెళ్లిన చివరిసందేశం ద్వారా మొబైల్‌జాడ తెలుసుకుని సొంతదారులకు అందజేస్తున్నారన్నారు.

సాహిత్య పరిషత్ సమ్మేళనానికి సర్వం సిద్ధం

గంగావతి రూరల్: గంగావతి కన్నడ సాహిత్య పరిషత్ నేతృత్వంలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించనున్న గంగావతి తాలూకా 8వ కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏర్పాట్లను ఎమ్మెల్యే పరణ్ణ మూనవళి, తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాస్ అంగడి పరిశీలించారు. హాజరయ్యే ప్రజలకు తాగునీరు, నీడ కల్పించినట్లు తెలిపారు. ఎండల నేపథ్యంలో మజ్జిగ పంపిణీ ఉండాలని స్వాగత కమిటీ అధ్యక్షులకు సూచించారు. కార్యక్రమాలను నిర్ణీత అవధిలో పూర్తి చేయాలన్నారు. సమ్మేళనం జరిగే ప్రాంతంలో స్వచ్ఛతా చర్యలు చేపట్టాలని నగరసభ అధికారులకు సూచించారు.

కాంగ్రెస్‌ను విమర్శించడమే ప్రధాని పని: మల్లికార్జున ఖర్గే

తుమకూరు: దేశాభివృద్ధి కోసం ప్రజలు మోదీకి అధికారం ఇస్తే ఆయన ఎక్కడికి పోయినా కాంగ్రెస్ పార్టీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. తన 52 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రధానిని తాను చూడలేదన్నారు. కొరటిగెరెలో బ్లాక్ కాంగ్రెస్‌సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రాజీవ్ భవన్‌ను ఖర్గే ప్రారంభించి మాట్లాడారు. ఈడీ, సీబీఐ అధికారుల ద్వారా కాంగ్రెస్‌పార్టీ నాయకులను బెదిరించి బీజేపీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తోందని ఆరోపించారు. చక్కెర కర్మాగారం, సహకార సంఘం యజమానులను అమిత్ షా బెదిరించారని ఆరోపించారు.

9న బంద్..

బీజేపీ సర్కార్ అవినీతిలో కూరుకుపోయిందని, ఇందుకు ఇటీవల లోకాయుక్తా సోదాల్లో పట్టుబడిన నగదు ప్రత్యక్ష సాక్ష్యమని డీకే శివకుమార్ ఆరోపించారు. సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న ఉదయం 9 నుంచి 11 గంటల వకు కర్ణాటక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు చెప్పారు.

సిద్ధూ నీతి మాటలు కట్టిపెట్టు : జగదీశ్ శెట్టర్

సాక్షి,బళ్లారి: బీజేపీ అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం సిద్ధరామయ్యకు లేదని మాజీ ముఖ్యమంత్రి జగదీష్‌శెట్టర్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం కలబుర్గిలో విలేకరులతో మాట్లాడారు. ఆర్కావతి డీనోటిఫికేషన్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య వేలాది కోట్లు అవినీతికి పాల్పడ్డారన్నారు. ఎవరూ చూడలేదని పిల్లి కళ్లుమూసుకుని పాలుతాగినట్లు సిద్ధూ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. నీతి వ్యాక్యాలు కట్టిపెట్టాలని సూచించారు. అప్పట్లో తాము సీబీఐ తనిఖీ చేయాలని డిమాండ్ చేయగా కంపెయ్య కమిటీకి అప్పగించారని గుర్తుచేశారు. విధానసభలోఎందుకు క్లీన్ చిట్ గురించి ప్రస్తావన చేయలేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని భయంతో బీజేపీతో ఆరోపణలు చూస్తూ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్ని ఎత్తులు వేసినా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని అడ్డుకోలేదన్నారు. 130కి పైగా స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు.

సంక్షేమానికి పెద్దపీట: సీఎం



కార్యక్రమంలో పాల్గొన్న సీఎం బొమ్మై

తుమకూరు: జీవితంలో నిలదొక్కుకునేలా అనేక పథకాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేయడం చేస్తున్నట్లు సీఎం బొమ్మై చెప్పారు. తుమకూరు జిల్లాలో సుమారు 24 లక్షల మంది ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిని పొందారని అన్నారు. ఆదివారం సాయంత్రం తుమకూరులో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు సహా పలు పథకాలను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారుల సమ్మేళనంలో మాట్లాడారు. కన్నడనాడులో ఉన్న పేదరికాన్ని సంపూర్ణంగా రూపుమాపడం కోసం సంకల్పం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పథకాల ద్వారా రాష్ట్రమంతటా లబ్ధిపొందిన వారి గణాంకాలను వివరించారు.

9న హుబ్లీ జగ్గలిగి పండుగ

హుబ్లీ: హుబ్లీలో ఈనెల 9న జగ్గలిపండుగను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి లోగోను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, రాష్ట్ర మంత్రి సీసీ పాటిల్, విధానపరిషత్ స్పీకర్ బసవరాజ్ హొరట్టి తదితరులు విడుదల చేశారు. కేంద్ర మంత్రి జోషి మాట్లాడుతూ 9న స్థానిక ప్రముఖ మూరుసావిర మఠంలో వేడుకలు జరుగుతాయన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలోపాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాడాళ్ విరుపాక్షప్ప కేసుకు స్పందించి ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ లోకాయుక్తను కోరలు లేని సంస్థగా చేసిందన్నారు. తాము లోకాయుక్తను శక్తివంతంగా చేశామన్నారు. ఏ పార్టీ నేత తప్పు చేసినా వారికి వ్యతిరేకంగా చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్రానికి మోదీ, అమిత్ షా వచ్చినా ఫలితం ఉండదని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారని, అయితే వారికి ఎందుకు భయం పుట్టుకుందని ప్రశ్నించారు.



ఆదివారం ఉదయం బెంగళూరులో చట్టసభ విధానసౌధ ఆవరణలో పచ్చదనం పెంచే పనిలో కార్మికులు



ఐటీ సిటీ యశవంతపురలో సండే కూరగాయల మార్కెట్ దృశ్యం. ఇంకా వేసవి ప్రభావం లేనందున కూరగాయలకు కొరత లేదు. ధరలు కూడా అందుబాటులోనే ఉన్నాయి

కోలారు వార్తలు...

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పాలనాదక్షుడు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వర్సిటీ కులపతి ప్రొఫెసర్ నిరంజన్ వానళ్లి

కోలారు : శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పాలనాదక్షుడని, ఆయన ధైర్యసాహసాలు, కళాపోషణ గురించి నేటికి కథలు కథలుగా చెప్పుకుంటున్నామని బెంగుళూరు ఉత్తర విశ్వ విద్యాలయం కులపతి ప్రొఫెసర్ నిరంజన్ వానళ్లి అన్నారు. శనివారం సాయంత్రం నగరంలోని సువర్ణ కన్నడ భవనంలో శ్రీకృష్ణదేవరాయ అభివృద్ధి ప్రతిష్టాన ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ దేవరాయల జయంత్యుత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీకృష్ణ దేవరాయల వంటి పాలనా దక్షుల, మహనీయుల గురించి యువత తెలుసుకోవాలన్నారు. భారతదేశ సంస్కృతి, చరిత్రను విదేశీయుల రచనల ద్వారా తెలుసుకోవాల్సి రావడం దురదృష్టకరమన్నారు. నివృత్త డీఐజీ ఎస్ ఎం మూర్తి మాట్లాడుతూ కోలారు జిల్లాలో శ్రీకృష్ణ దేవరాయల అధ్యయన పీఠాన్ని, విగ్రహాన్ని స్థాపించాలన్నారు. సీనియర్ సాహితీ వేత్త స.రఘునాథ్, పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బీవీ గోపినాథ్, ప్రొఫెసర్ అరివు శివప్ప, కసాప జిల్లా అధ్యక్షుడు ఎన్ బి గోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ మునివెంకటప్పకు నేడు సన్మానం

శ్రీనివాసపుర: పద్మశ్రీ అవార్డు గ్రహీత, తమట కళాకారుడు పిండిపాపనహళ్లి మునివెంకటప్పను ఈనెల 6న సమాన మనస్కుల సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు దళిత సీనియర్ నాయకుడు మునిస్వామి తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం మునివెంకటప్పను ముళబాగిలు సర్కిల్ నుంచి పుష్పపల్లకీలో ఊరేగింపుగా తాలూకా కార్యాలయానికి తీసుకొచ్చి సన్మానం చేయనున్నట్లు తెలిపారు.

మూఢవిశ్వాసాలు వీడితే అంటరానితనం నిర్మూలన

కోలారు : మూఢ నమ్మకాలను వదలినప్పుడే సమాజంలో అంటరానితనం నిర్మూలన సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకుడు డాక్టర్ అరివు జీ శివప్ప అన్నారు. తాలూకాలోని ముదువత్తి గ్రామంలో ఈనేల, ఈ జల, సాంస్కృతిక సంస్థ సహకారంతో ఆదివారం నిర్వహించిన అస్పృశ్యత నిర్మూలనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12వ శతాబ్దంలో బసవణ్ణ సామాజిక అసమానతలపై పోరాటం చేశారన్నారు. విశ్వకవి కువెంపు తన రచనల ద్వారా అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి సమానతకు కృషి చేశారన్నారు. దళితులు విద్యావంతులైనప్పుడే అంటరానితనం తనకు తానే దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు నాగేంద్రబాబు, న్యాయవాది సతీష్, ఎన్ గణేషప్ప, మునివెంకటప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌కు అధికారం ఖాయం

శ్రీనివాసపురం: వచ్చే విధానసభ ఎన్నికల్లో జేడీఎస్ అధికారంలోకి రావడం తథ్యమని జిల్లా అధ్యక్షుడు వెంకటశివారెడ్డి అన్నారు. తాలూకాలోని గుండమనత్త గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు పలువురు జేడీఎస్‌లో చేరారు. వారికి వెంకటశివారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి జనతా జలధార, పంచరత్న రథయాత్ర ద్వారా ప్రజలకు మరింత చేరువ అవుతున్నారన్నారు. తాలూకాను సమస్యలు పట్టి పీడిస్తున్నా ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌కు పట్టినట్లు లేదని విమర్శించారు. నాయకులు తూపల్లి నారాయణ స్వామి, ఎంవీ శ్రీనివాస్,బీవీ శివారెడ్డి రామచంద్రేగౌడ పాల్గొన్నారు.

గాణిగ సముదాయం అన్ని రంగాల్లో రాణించాలి

రాయచూరురూరల్: గాణిగ సముదాయం అన్ని రంగాల్లో రాణించాలని కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు పిలుపునిచ్చారు. విద్యానగర్ శివగణేష్ పార్వతీ ఆలయంలో ఆదివారం జరిగిన నూతన పదాధికారుల సమావేశాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. గాణిగ సముదాయం సంక్షేమానికి రిజర్వేషన్ల కోసం పోరాటం చేయాలన్నారు. అనంతరం పదాధికారులను సన్మానించారు. వీర సంగన బసవ శివాచార్యులు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, నగరసభ అధ్యక్షురాలు లలిత, మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్, బోసురాజ్, నగరసభ మాజీ అధ్యక్షుడు వినయ్ కుమార్, గాణిగ సమాజం రాష్ట్రాధ్యక్షుడు అమరగుండప్ప, జిల్లాధ్యక్షుడు చెన్నప్ప, బసప్పగోరెబాళ్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కోలారు : తాలూకాలోని కెంబోడి గ్రామంలో ఉన్న చౌడేశ్వరి దేవాలయంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి దుండగులు ప్రధాన ద్వారం తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి అమ్మవారి నగలు దోచుకున్నారు. అనంతరం హుండీతో ఉడాయించారు. ఆదివారం ఉదయం ఈ ఘటన వె లుగు చూసింది. కోలారు రూరల్ పోలీసులు వచ్చి పరిశీలించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితుడితో అబ్కారి పోలీసులు

కోలారు : కారులో రవాణా చేస్తున్న రూ.60వేల విలువైన 10 కిలోల గంజాయిని అబ్కారి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారిపై వ్యాలీ పబ్లిక్ పాఠశాల సమీపంలో అబ్కారి పోలీసులు ఓ కారును అడ్డుకొని తనిఖీ చేశారు. గంజాయి కనిపించడంతో స్వాధీనం చేసుకొని రవాణాదారుడైన మహమ్మద్ శోయబ్‌ను అరెస్టు చేశారు. కార్యాచరణలో అబ్కారి అధికారులు అనిల్‌కుమార్, సాబు కాత్రాళ, అబ్కారి కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

ప్రజల మద్దతుతో విజయం సాధిస్తా

కోలారు : విధానసభ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధిస్తానని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు వర్తూరు ప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు. కోగిలహళ్లిలోని తన నివాసంలో ఆదివారం వీఆర్‌పీ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీని ప్రారంభించి మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రుణాలు అందిస్తామన్నారు. ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని మహిళలకు విజ్ఞప్తిచేశారు.

కరెంటు షాక్‌తో కార్మికుడి మృతి

దొడ్డబళ్లాపురం: విద్యుదాఘాతంలో కార్మికుడు మృతిచెందిన సంఘటన నెలమంగల తాలూకా సోంపుర పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. తమిళనాడు ఈరోడ్ జిల్లా భాగ్యలక్ష్మినగర్‌కు చెందిన గౌతమన్ (35) కోకో కార్బన్ ఇండియా కంపెనీలో కార్మికుడు, బాయిలర్ శుభ్రం చేస్తుండగా విద్యుత్ ప్రవహించి షాక్ కొట్టి చనిపోయాడు. దాబస్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

త్రిచక్ర వాహనాల పంపిణీ



కృష్ణరాజపురం: హోసకోటి నియోజకవర్గం పరిధి అనుగొండనహళ్లి హోబ్లిలో ఉన్న ముత్తూరు గ్రామంలో ఇద్దరు వికలాంగులకు త్రిచక్ర వాహనాలను స్థానిక ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ అందజేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు

మైసూరు: మైసూరు చామరాజ నియోజకవర్గంలో 200 మంది యువకులు బీజేపీలో చేరారు. నగరంలోని ఒంటి కొప్పలులో ఉన్న చామరాజ నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలకు చెందిన 200 మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మైసూరు నగర బీజేపీ యువ మోర్చ అధ్యక్షుడు కిరణ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



వైద్య శిబిరంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలో జీవిస్తున్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ఎం.సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఆరికెరె వార్డులోని శాంతి నికేతన్ లేఔట్‌లో ఉన్న శ్రీ వాసవి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి మురళి, పురుషోత్తం (రవి), ఎం. మంజునాథ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పని చేస్తూనే ఉంటా

మైసూరు: తాను అధికారంలో ఉన్నంత వరకు ప్రజలకు కోసం పనిచేస్తూనే ఉంటానని, తానేమి ఈ నియోజకవర్గానికి శాశ్వతంగా ఉండే ఎమ్మెల్యేను కాదని ఎస్.ఎ.రామదాసు అన్నారు. ఆదివారం మైసురు నగరంలోని కృష్ణరాజ నియోజకవర్గం 47వ వార్డు నవిలు రోడ్డులో ఉన్న రాఘవేంద్ర మఠం ఆవరణంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ యోగక్షేమ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, ఏదో ఒకరోజు తన స్థానంలో మరో వ్యక్తి వస్తారని అన్నారు.

పథకాలపై కాంగ్రెస్ ముమ్మర ప్రచారం



బొమ్మనహళ్లి: వచ్చే శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు రూ. 2 వేల నగదు, సబ్సిడీ సిలిండర్ వంటి పథకాలు అమలు చేస్తామని, పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని జక్కసంద్ర వార్డు కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి చలపతి అన్నారు. ఆదివారం నగరంలోని బీటీఎం లేఔట్ పరిధి జక్కసంద్ర, వెంకటాపుర, కోరమంగళ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఆమె కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల ప్రయోజనాలను వివరించారు.

సంగొళ్లి రాయణ్ణ విగ్రహం ఆవిష్కరణ

శివాజీనగర: హాసన్ జిల్లాలోని అరసీకెర తాలూకా గుత్తినకెరెలో సంగొళ్లి రాయణ్ణ కంచు విగ్రహాన్ని మాజీ సీఎం సిద్దరామయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు చేరుకోగా, తమ అభిమాన నాయకుడు సిద్దరామయ్యను చూడటానికి పోటీపడ్డారు. హెలికాప్టర్‌లో చేరుకున్న సిద్దరామయ్య ఓపెన్ టాప్ వాహనంలో రోడ్ షో చేపట్టారు. ఈ సమయంలో ఆయనను చూడటానికి దూసుకువచ్చారు. అరసీకెరలోని గుత్తినకెరలో ఎమ్మెల్యే శివలింగేగౌడ సిద్దరామయ్యతో కలసి వేదికలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి సన్మానం



చింతామణి: తాలూకాలో ఇటీవల కేఏఎస్, పీఎస్ఐ, పీడీఓ, ఎఫ్‌డీఏ తదితర ప్రవేశ పరీక్షలకు బెంగళూరు నుంచి అధ్యాపకులను పిలిపించి ఉచిత శిక్షణ ఇప్పించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని అభ్యర్థులు ఘనంగా సన్మానించారు. అభ్యర్థులు రాజేశ్, ఆది, నందీశ్, అశోక్, సతీష్, భరత్, జగదీశ్, వెంకటేశ్, శివారెడ్డి పాల్గొన్నారు.

దక్షిణ కన్నడ జిల్లా భగభగ



అమాంతం పెరిగిన ఎండల తీవ్రత



గొడుగు లేనిదే బయటకు రాలేని పరిస్థితి (ఫైల్)

- ప్రారంభంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు
- బెంబేలెత్తుతున్న కరావళి ప్రజలు

బనశంకరి: దక్షిణ కన్నడ జిల్లాలో వేసవి భానుడు భగభగ మండుతున్నాడు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండటంతో వడగాల్పులు కూడా మొదలయ్యాయి. ఉదయం పది గంటలు దాటితే బయటకు వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు.

మార్చి మొదటి వారంలోనే...

కరావళి, ఒళనాడు ప్రాంతాల్లో ప్రజలు భానుడి ప్రతాపంతో తల్లడిల్లుతున్నారు. ప్రత్యేకత ఏమిటంటే మూడబిదిరె, సుళ్యలో గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. శుక్రవారం 3 తేదీ దక్షిణ కన్నడ జిల్లాల్లో పలుచోట్ల 40–41 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. గత కొద్దిరోజులుగా ఎండల తీవ్రత పెరగ్గా వేడి గాలులు కూడా అధికమయ్యాయి. సూర్యుడు నిప్పుల కొలిమిలా మారుతున్నాడు. అదే విధంగా మూడబిదిరె ప్రాంతంలో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

ఉదయం చలి, మంచు ..

మంగళూరు నగరంతో పాటు జిల్లాలోని పలుప్రాంతాల్లో ఉదయం మంచు, చలితో కూడిన వాతావరణం నెలకొంది. ఉదయం 11 గంటలు కాగానే ఉష్ణోగ్రతలు పెరుగుతూ 12.30 గంటలు కాగానే ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. 12.30 నుంచి 1 గంట సమయానికి ఎండ భగభగ మండిపోతుంది. 11 గంటల నుంచి 3 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ప్రజలు ఇళ్లలోనుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది.

ఆరోగ్య సమస్య..

వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తీవ్రత, ఎండల వేడితో జిల్లావ్యాప్తంగా ప్రజలు జ్వరాలు, తలనొప్పి, జలుబు తదితర ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వీచే గాలి కూడా వేడిగా ఉండటంతో బావులు, చెరువులు, బోర్లలో నీటి ప్రమాణం కూడా తగ్గుముఖం పడుతోంది. ఇలా ఎన్నిరోజులు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉంటుంది అనేది వేచిచూడాలి.

తాగునీటి ఇబ్బందులు..

దక్షిణ కన్నడ జిల్లాలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో తాగునీటికి కష్టాలు తప్పవనే భయం నెలకొంది. మంగళూరు నగరానికి తాగునీరు అందించే తుంబేబెంటెడ్ డ్యాంలో నీటిమట్టం తగ్గింది. డ్యాంలో నీటిమట్టం 5.95 మీటర్లకు తగ్గుముఖం పట్టింది. జీవనదిగా పేరుపొందిన నేత్రావతి ఇన్‌ఫ్లో కూడా తగ్గుముఖం పట్టడంతో తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు.

పొలం గట్టున చిన్న ఉసిరి సాగు



ఉసిరి కాయలు



ఉసిరి చెట్టు వద్ద రైతు శివప్రసాదరెడ్డి

- రైతుకు అదనపు ఆదాయం

గౌరిబిదనూరు: ఉసిరికాయలు అనగానే నోట్లో నీరూరడం సహజం. ఇందులో మరింత రుచిగా ఉండేది చిన్న ఉసిరి. దీనినే రాచ ఉసిరి, నక్షత్ర ఉసిరి అని కూడా పిలుస్తారు. ఉప్పు కారంలో అద్దుకుని కొరికితే జిహ్వ జివ్వుమంటుంది. ఈ చెట్లను పొలం గట్టును పెంచుకుంటే అదనంగా ఆదాయం పొందవచ్చు. గౌరిబిదనూరు తాలూకా కొండేనహళ్ళి సమీపంలో శివప్రసాదరెడ్డి తన పొలం గట్టులో సుమారు 20 చెట్లను వేశారు. ప్రస్తుతం వీటిలో 5 చెట్లు కాపుకొచ్చాయి. ఈ చెట్లకు ఎరువులు కానీ ఎలాంటి పోషకాంశాలను ఇవ్వడం లేదు. అప్పుడప్పుడు నీళ్ళను మాత్రం పెడుతూ వుంటారు.

జనవరి నుంచి మార్చి, ఏప్రిల్ దాకా పూత పూస్తాయి, తదుపరి దీపావళి పండుగ వరకు కాయలు కాస్తాయని రైతు తెలిపారు. విత్తనాలు వేసిన 4 సంవత్సరాల తరువాత కాయలు కాయడం మొదలవుతుంది.

ఆరోగ్య వర్ధిని..

ఈ ఉసిరికాయలను కాలక్షేపానికి తినవచ్చు. లేదా రసం చేసుకుని తాగితే అనేక పోషకాలు లభిస్తాయి. ఆయుర్వేదంలో వంద జబ్బులకు మందుగా దీనిని పిలుస్తారు. జీర్ణశక్తిని పెంచడమే కాక శరీరంలో వాయు, పిత్త, కఫ దోషాలను పోగొడుతుందని ఆయుర్వేద నిపుణులు తెలిపారు. కోత సమయంలో ఉసిరికాయలను విక్రయించడం ద్వారా అదనంగా ఆదాయం లభిస్తుందని రైతు తెలిపారు.

ఘనంగా జంగ్లిపీర్ దర్గా ఉరుసు



సన్మానించిన దృశ్యం

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని దేవనహళ్లి రోడ్డులో ఉన్న జంగ్లిపీర్ బాబా దర్గాలో ఉరుసు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం, పుష్ప కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. వేడుకల్లో మంజునాథ్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మంజునాథ్ పాల్గొని సందడి చేశారు. దర్గా సభ్యులు ఈ సందర్భంగా మంజునాథ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కవ్వాలి కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు ఆర్.కె. నంజేగౌడ, విశ్వనాథ్ గౌడ, దర్గా వ్యవస్థాపకుడు, ఆజ్మత్, కలీం, జంగ్లిపీర్ బాబా దర్గా అభివృద్ధి సమితి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీజగద్గురు రేణుకాచార్య జయంతి



తుమకూరులో రేణుకాచార్య చిత్రపటానికి పూజలు



విజయపురలో రేణుకా చార్య జయంతి వేడుకల దృశ్యం

తుమకూరు: తుమకూరు జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, మహా నగర పాలికె, తుమకూరు కన్నడ సంస్కృతి శాఖ, కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జగద్గురు శ్రీ రేణుకాచార్య జయంతి వేడుకలను ఆదివారం కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయంలో నిరాడంబరంగా నిర్వహించారు. జగద్గురు శ్రీరేణుకాచార్య చిత్రపటానికి జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కేఎస్ సిద్దలింగప్ప ప్రారంభించి మాట్లాడుతూ... వీరశైవ ధర్మాన్ని ప్రారంభించి బసవణ్ణ కంటే మొదలు వృత్తి గౌరవానికి అతి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చి మహానుభావులు శ్రీరేణుకాచార్యులు అని, అలాంటి మహాన్ వ్యక్తి జయంతి వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

రేణుకాచార్యకు పూజలు

విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలో పురసభ సమావేశం హాల్లో ఆదివారం జగద్గురు శ్రీరేణుకాచార్య జయంతి వేడుకలను నిరాడంబరంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జగద్గురు శ్రీరేణుకాచార్య చిత్రపటానికి పురసభ సభ్యురాలు విమలా బసవరాజు పూజలు చేశారు. కార్యక్రమంలో సముదాయం సభ్యులు సదాశివయ్య, మల్లికార్జున, చంద్రు, రవి, సతీష్, నాగరాజు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

చిరుత పంజాకు 3 ఆవులు బలి

మైసూరు: చిరుత పులి దాడి చేసి మూడు ఆవులను పొట్టనబెట్టుకుంది. చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేటె తాలూకాలోని కల్లహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. బసవరాజప్ప అనే రైతు పొలంలో మూడు ఆవులను కట్టి వేశాడు. శనివారం రాత్రి వచ్చిన చిరుత ఆ మూడు ఆవులను చంపివేసి కొంత భాగం తినివేసింది. ఆదివారం ఉదయం తిరిగి వచ్చిన రైతు విగతజీవులుగా ఉన్న ఆవులను చూసి గట్టిగా అరవడంతో దగ్గరే చెట్ల పొదల్లో దాగి ఉన్న చిరుత పారిపోయింది. అటవీ శాఖ అధికారులు పరిశీలించి చిరుత కోసం గాలింపు చేపట్టారు.

మూత్రపిండాల సంరక్షణపై సైక్లోథాన్

బనశంకరి: మూత్రపిండాల సంరక్షణ, ఆరోగ్యంపై నగరంలోని మణిపాల్ ఆసుపత్రి సైక్లోథాన్ నిర్వహించింది. ఆదివారం హెచ్ఏఎల్ రోడ్డులోని మణిపాల్ హాస్పిటల్స్ అధ్యక్షుడు డాక్టర్ హెచ్.సుదర్శన్ బల్లాళ్ ఆసుపత్రి ఆవరణలో సైక్లోథాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. మణిపాల్ ఆసుపత్రుల్లో ఈ ఏడాది సైక్లోథాన్ 2.0 మరింత పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఉత్తమ ఆరోగ్యం కల్పించాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని తెలిపారు. మూత్రపిండాల రోగాలతో బాధపడుతున్న వారిలో ఆత్మస్థైర్యం నింపతున్నామన్నారు. మూత్రపిండం ఆకారంలో సైక్లోథాన్ నిర్వహించారు.

హోసూరు వార్తలు..

యువకుడి అరెస్ట్

హోసూరు: 17 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి బంధువుల ఇంట్లో దాచిన యువకున్ని మహిళా పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుప్పూర్ ప్రాంతానికి చెందిన బాలిక హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని ప్రైవేట్ పరిశ్రమ హాస్టల్లో ఉంటోంది. అదే పరిశ్రమలో పనిచేస్తున్న బాగలూరు సమీపంలోని ఇచ్చంగూరు గ్రామానికి చెందిన నందు (20)తో పరిచయం ఏర్పడింది. కొద్ది రోజుల క్రితం బాలిక విధులకు రాకపోవడంతో యాజమాన్యం ఆమె తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. వెంటనే హోసూరుకు చేరుకొన్న బాలిక తండ్రి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేయగా నందు బాలికను కిడ్నాప్ చేసి నవధి గ్రామంలోని బంధువుల ఇంట్లో దాచినట్లు తెలిసింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

బీర్ బాటిల్‌తో దాడి.. వ్యక్తి అరెస్ట్

హోసూరు: జన్మదిన వేడుకల సంబరాల్లో మిత్రుల మధ్య ఏర్పడిన గొడవల్లో బీర్ బాటిల్‌తో దాడి చేసిన వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... పట్టణంలోని ఎంజీ రోడ్డు ప్రాంతానికి చెందిన మిస్బర్ (35), వసంత్ నగర్ ప్రాంతానికి చెందిన విష్ణు(29) మిత్రులు. శనివారం విష్ణు జన్మదిన వేడుకలను జరుపుకొన్నాడు. సంబరాల్లో మిస్బర్ పాల్గొన్నాడు. ఈ సమయంలో మిత్రుల మధ్య గొడవలేర్పడ్డాయి. మిస్బర్ విష్ణుపై బీర్‌బాటిల్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి మిస్బర్‌ను అరెస్ట్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

క్రిష్ణగిరి: గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందిన ఘటన ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు సమీపంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు సయ్యద్ అస్సేన్ (65) శనివారం సాయంత్రం ఉప్పరతమంద్రపల్లి వద్ద నడచి వెళ్తుండగా ఆ మార్గంలో వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సయ్యద్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ప్రగతి రథం ప్రారంభం



చింతామణి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేయడానికి బీజేపీ భరవసే (హామీ) ప్రగతి రథానికి నాయకులు స్వాగతం పలికారు. డిపో దగ్గర వున్న ఆలయంలో పూజలు జరిపారు. ఈసందర్భంగా నాయకుడు గోపి మాట్లాడుతూ... డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి ప్రజలకు వివరించి జాగృతి చేసి మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు శివారెడ్డి, మహేశ్‌బై, శంకర్, మంజు, నారాయణరెడ్డి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జయ రామోత్సవం



ఊరేగింపు దృశ్యం

మండ్య: మండ్య నగరంలో ఆదివారం జయరామోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన ఎస్.డి.జయరామ్ చిత్రపటాన్ని వెండి పల్లకీలో ఏర్పాటు జానపద కళాకారులు, కన్నడ నాడిన వివిధ సమాజ సేవకుల చిత్రపటాలతో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. డొల్లుకుణిత, పూజా కుణిత, వీరగాసె, గారడిబొమ్మ, సోమనకుణిత, కంసాలే నృత్యాలు అలరించాయి.

కనులపండువగా శ్రీనివాస కల్యాణం





కల్యాణోత్సవం దృశ్యం, ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

గౌరిబిదనూరు: నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి, కెహెచ్‌పీ ఫౌండేషన్ అధినేత పుట్టస్వామిగౌడ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. వేల మంది పాల్గొన్న కార్యక్రమంలో పుట్టస్వామి గౌడ మాట్లాడుతూ... నియోజక వర్గం ప్రజలు క్షేమంగా ఉండాలని, పంటలు బాగా పండాలని ఆ దేవదేవుడు అయిన శ్రీనివాసుడి కల్యాణం జరిపించామన్నారు. జెడీఎస్‌మాజీ అధ్యక్షుడు హోసూరు మంజునాథ్ మాట్లాడుతూ... నియోజక వర్గ ప్రజలకు ఎనలేని సమాజసేవ చేస్తున్న పుట్టస్వామిగౌడకు రాబోవు శాసనసభ ఎన్నికలలో ప్రజలందరూ మద్దతు తెలపాలని కోరారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు లడ్డూలు, అంక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతిరెడ్డి, కొచిముల్ మాజీ అధ్యక్షుడు కాంతరాజు, వాల్మీకి నాయక సంఘం నేతలు అశోక్‌కుమార్, నగరసభ అధ్యక్షులు రూపా అనంతరాజు, మాజీ సభ్యులు అనంతరాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి రథోత్సవం



తుమకూరు: తుమకూరు జిల్లా హులిహూరు హోబ్లి పరిధిలో ఉన్న కారెహళ్లిలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచి కంకణం, అంకురార్పణ, ధ్వజారోహణం, ఉయ్యాలోత్సవం, గజారోహణం, గరుడ హావహనోత్సవం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగారు.

నాగవాహనంపై విహారం



నాగవాహనంపై ఊరేగుతున్న శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఉత్సవమూర్తి



హోసూరు: మరకతాంబసమేత శ్రీ చంద్రచూడేశ్వర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి ఉత్సవమూర్తిని నాగవాహనంపై ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 7వ తేదీ మంగళవారం చంద్ర చూడేశ్వరస్వామి ఆలయ రథోత్సవం వైభవంగా జరుగనుంది. 5 రోజులుగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించి శ్రీ చంద్ర చూడేశ్వరస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి వివిధ వాహనాలపై ఉంచి తేరుపేట తిరువీధుల్లో ఊరేగింపు జరుగుతోంది.

7న స్థానిక సెలవు

హోసూరులో 7వ తేదీ శ్రీ చంద్రచూడేశ్వరస్వామి రథోత్సవం నేపథ్యంలో హోసూరు, డెంకణీకోట, సూళగిరి, అంచెట్టి తాలూకాలకు జిల్లా కలెక్టర్ దీపక్ జేకబ్ స్థానిక సెలవు ప్రకటించారు. ప్రతి సంవత్సరం రథోత్సవం సందర్భంగా నాలుగు తాలూకాలకు స్థానిక సెలవు ప్రకటించడం ఆనవాయితీ. 18వ తేదీ పనిదినంగా ఆచరిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కండగానపల్లిలో ఏనుగుల గోల



కండగానపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

కెలమంగలం: డెంకణీకోట అటవీ ప్రాంతంలో మకాం వేసిన 20 ఏనుగుల మంద నుంచి నాలుగు ఏనుగులు విడిపోయి సమీపంలోని కండగానపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. డెంకణీకోట సమీపంలోని కస్బా అటవీ ప్రాంతంలో 20 ఏనుగులు మకాం వేసి రైతు పంటలపై దాడి చేయడంతో రైతులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బాధిత రైతులు అటవీశాఖాధికార్లకు సమాచారం అందజేయడంతో వారు వచ్చి టపాకాయలు పేల్చి, డప్పులు వాయిస్తూ దట్టమైన అటవీ ప్రాంతానికి మళ్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో 20 ఏనుగుల మంద నుంచి నాలుగు ఏనుగులు విడిపోయి కండగానపల్లి అటవీ ప్రాంతానికి చేరుకొన్నాయి. ఆ ప్రాంతంలోని ఓ కుంటలో జలకాలాడుతూ స్థానికుల కంటబడ్డాయి. ప్రజలు ఏనుగులను తరిమేందుకు యత్నించగా నీటికుంట నుంచి బయటకొచ్చి రైతు పంటలపై దాడులు చేస్తున్నాయని వాపోయారు.

ఐటీ ఇంజనీరుకు రూ. 38 లక్షలు టోపీ

హోసూరు: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వద్ద రూ. 38 లక్షలు అబేస్ చేసిన మోసగాళ్ల కోసం క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులు గాలిస్తున్నారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని టైటాన్ టౌన్‌షిప్ తులసీనగర్‌కు చెందిన రామక్రిష్ణశర్మ (45) హోసూరులోని ప్రైవేట్ పరిశ్రమలో ఐటీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 1వ తేదీ అతని మొబైల్‌కు ఓ వ్యక్తి కాల్ చేశాడు, టాస్క్ కంప్లీట్ యాప్ ద్వారా పార్ట్‌టైం జాబ్ చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చునని తెలిపాడు. అతని మాటలు నమ్మిన రామక్రిష్ణశర్మ రూ. 100 పెట్టుబడి పెట్టగా, నిమిషంలో రూ. 1000 అతని ఖాతాలో జమైంది. తరువాత వెయ్యి, రెండు వేలు ఇలా కొద్దికొద్దిగా పెంచుకొంటూపోయాడు. ఇలా అతని వద్ద ఉన్న రూ. 38 లక్షలను మోసగాళ్లు చెప్పిన లింక్ ద్వారా జమచేశాడు. ఆ తరువాత యాప్ పనిచేయడం మానేసింది. మోసపోయానని తెలుసుకున్న రామక్రిష్ణశర్మ క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

పాఠశాల స్థలం ఆక్రమణకు యత్నం



ప్రైవేట్ వ్యక్తులచే పాఠశాల స్థలాన్ని చదును చేసిన దృశ్యం

హోసూరు: అత్తిముగంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల స్థలాన్ని ఓ వ్యక్తి రాత్రికి రాత్రే జేసీబీ యంత్రాన్ని ఉంచి చదును చేసి ఆక్రమించుకొనేందుకు యత్నించాడని, అధికారులు చర్యలు చేపట్టాలని పాఠశాల యంత్రాంగం, స్థానిక ప్రజలు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సూళగిరి తాలూకా అత్తిముగం గ్రామంలో ప్రభుత్వ ఉర్దూ మాధ్యమిక పాఠశాల నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం విద్యార్థుల కోసం నిర్మించిన ఐదు మరుగుదొడ్లను ధ్వంసం చేశారు. ఈ విషయంపై స్థానికులు పలుసార్లు సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో మళ్లీ పాఠశాల ఆవరణాన్ని ఆక్రమించుకొనేందుకు రాత్రి సమయంలో జేసీబీ యంత్రం ద్వారా చదును చేశారని, ఈ స్థలంలో తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.

చాముండి కొండపై స్వచ్ఛత కార్యక్రమాలు



చెత్తను సేకరించిన దృశ్యం



కొండపై మద్యం బాటిళ్లు

మైసూరు: చాముండి కొండపై ఉలిసి సమితి సభ్యులు అటవీ సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం పెద్ద ఎత్తున సభ్యులు రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తను సేకరించి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ రహిత చాముండి కొండ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌ను గెలిపించండి

ఉద్యోగులకు ఏపీజీఈఎఫ్ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి పిలుపు



సీతంపేట(విశాఖ ఉత్తర): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఏపీజీఈఎఫ్ విశాఖ జిల్లా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో ఏపీజీఈఎఫ్ ద్వారా ఉద్యోగులకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 27 అంశాలను పరిష్కరించగలిగామని తెలిపారు. ఫెడరేషన్‌కు మద్దతు ఇచ్చేవారిని ఎమ్మెల్సీలుగా గెలిపించుకుంటే ఉద్యోగుల సమస్యలు మరింత సులభంగా పరిష్కారమవుతాయని చెప్పారు. తమ భావజాలానికి దగ్గరగా ఉండే నాయకుడు సీతంరాజు సుధాకర్‌కు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్‌లో ఉన్న 40 ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు చిరంజీవి రావు, పాలాకి శ్రీనివాసరావు, కన్నబాబు, భాస్కరరెడ్డి, పుల్లారావు, అంకమరావు, భార్గవ్ సుతేజ్, కరుణాకర్, ఖాదర్‌బాబా, జ్యోతి, జేఎం నాయుడు, సుదర్శన్ పి.చంద్రరావు, బీఎస్ఆర్ శర్మ, మధుకుమార్, గోవర్ధన్, సంపత్, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

నా పాదయాత్రతో జగన్‌కు నిద్ర కరువు: లోకేశ్

పీలేరు : ఒక్క చాన్స్ అన్న జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని టీడీపీ నేత లోకేశ్ విమర్శించారు. ఆయన నిర్వహిస్తున్న పాదయాత్ర ఆదివారం అన్నమయ్య జిల్లా పీలేరుకు చేరుకుంది. స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ తాను పాదయాత్ర చేపట్టినప్పటి నుంచి సీఎం జగన్‌కు నిద్ర రావడం లేదన్నారు. పాదయాత్రను అడ్డుకోవడానికి పోలీసులను ఉపయోగిస్తున్నారన్నారు. పీలేరుకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అయితే.. అనధికారికంగా మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, హరీష్‌రెడ్డి ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉన్నారని చెప్పారు. కాగా, ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలంటే జూనియర్ ఎన్టీఆర్ రావాలంటూ పీలేరులో బ్యానర్లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

వాటమ్మా.. వాట్సాప్ 'స్పామ్'మ్మా



- చిర్రెత్తిస్తున్న స్పామ్ మెసేజ్‌లు
- ఈ సమస్య ఎదుర్కొంటున్న వారు 95 శాతం మంది
- లోకల్ సర్కిల్ సంస్థ సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: ఆఫీస్‌లోనో.. ఇంట్లోనో పనిలో నిమగ్నమై ఉండగా వాట్సాప్ నోటిఫికేషన్ వస్తుంది. ఎవరు మెసేజ్ పంపారో.. ఏంటోనని పని ఆపేసి మరీ చూస్తే.. 'ఫలానా షోరూమ్‌లో పండుగ ఆఫర్ ఉంది. త్వరగా షాపింగ్ చేయండి. ఆఫర్ వివరాల కోసం ఈ లింక్‌పై క్లిక్ చేయండి' అనే మెసేజ్ కనిపిస్తుంది. అలాంటివి చూడగానే చిర్రెత్తుకొస్తుంది. ఇలాంటి మెసేజ్‌లు దేశంలోని వాట్సాప్ వినియోగదారుల్లో 95 శాతం మందిని విసిగిస్తున్నాయి. రోజుకు కనీసం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లు వాట్సాప్‌లో వస్తున్నాయి. 'లోకల్ సర్కిల్' నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. తెలియని నంబర్ల నుంచి వస్తున్న ఇలాంటి మెసేజ్‌లపై దేశవ్యాప్తంగా 351 జిల్లాల్లో 51 వేల మంది వాట్సాప్ వినియోగదారులను వివిధ అంశాలపై ప్రశ్నించారు. వీటిల్లో ఎక్కువగా రియల్ ఎస్టేట్, వాణిజ్య ప్రకటనలు, ఉద్యోగ అవకాశాలు, వైద్య సేవలు వంటివి ఉంటున్నట్లు తేలింది.




ఇలా చేయండి ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు మన వాట్సాప్‌కు అభ్యంతరకర, అసభ్యమైన మెసేజ్‌లు పంపినా.. పదేపదే స్పామ్ మెసేజ్‌లతో ఇబ్బంది పెడుతున్నా సంబంధిత కాంటాక్ట్‌లను బ్లాక్ చేసే అవకాశం వాట్సాప్‌లో ఉంది. ఇలా చేస్తే వాట్సాప్ ఫిర్యాదుల బృందానికి రిపోర్ట్ ఫార్వర్డ్ చేయబడుతుంది. ఒకే కాంటాక్ట్‌పై ఎక్కువ రిపోర్ట్‌లు నమోదైతే ఆ కాంటాక్ట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తారు.

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం

టీకాలు 100 %



సాక్షి, అమరావతి: గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. అటు కాబోయే అమ్మలకు, ఇటు పిల్లలకు రోగ నిరోధక టీకాలివ్వడంలో మొదటి స్థానంలో ఉంది. ఆస్పత్రుల్లో కాన్పులు, నవజాత శిశువులకు 24 గంటల్లో హెపటైటిస్–బి డోసులివ్వడం, గర్భిణులకు యాంటి నేటల్ చెకప్‌ల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. పిల్లలకు, పోలియో టీకాలు అందించడంలోనూ జాతీయ సగటు కంటే మెరుగ్గా ఉంది. 2021–22లో వివిధ రాష్ట్రాల్లో వైద్య సేవలపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన నివేదికలో పలు ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది.



నివేదికలోని కీలక అంశాలు

- జాతీయ స్థాయిలో గర్భిణులకు రోగ నిరోధక టీకాలు 86.5 శాతం ఇవ్వగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో నూటికి నూరు శాతం వ్యాక్సిన్లు ఇచ్చారు. తమిళనాడు, దాద్రా నగర్ హవేలీ, డామన్ –డయ్యూ, మహారాష్ట్ర ఆ తరువాత స్థానాల్లో ఉన్నాయి.
- 9 నుంచి 11 నెలల వయసున్న చంటి బిడ్డలకు రోగ నిరోధక టీకాలివ్వడంలోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉంది. జాతీయ సగటు 91 శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో నూటికి నూరు శాతం చిన్నారులకు రోగ నిరోధక వ్యాక్సిన్లు ఇచ్చారు. గుజరాత్, జమ్మూ– కశ్మీర్, జార్ఖండ్, మహారాష్ట్ర తరువాత స్థానాల్లో నిలిచాయి.
- పిల్లలకు పోలియో చుక్కలు వేయడంలో జాతీయ సగటు 87.1 శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో నూరు శాతం నమోదైంది. హెపటైటిస్–బి డోస్‌లకు సంబంధించి జాతీయ సగటు 75.8 % కాగా ఆంధ్రప్రదేశ్‌లో 98.4 %ఉంది.
- ఆస్పత్రుల్లో ప్రసవాల జాతీయ సగటు 95.5 శాతం కాగా రాష్ట్రంలో 99.9 శాతం ఆస్పత్రుల్లోనే కాన్పులు జరుగుతున్నాయి.
- పూర్తిగా రోగ నిరోధక వ్యాక్సిన్లు 9,14,644 మంది గర్భిణులకు ఇచ్చారు.
- 9 – 11 నెలల వయసున్న 8,42,404 మంది చిన్నారులకు టీకాలిచ్చారు.
- పాఠశాలలకు వెళ్లే 2,58,68,458 మంది బాలికలు, 2,58,19,968 మంది బాలురకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 4,33,490 మంది బాలికలకు ఐఎఫ్ఏ మాత్రలను అందించారు. రాష్ట్రంలో 1,16,80,448 మంది కౌమార బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లను అందించి బాలికా విద్యను ప్రభుత్వం ప్రోత్సహించింది.



విష ప్రచారం మానుకోండి

- స్వలాభం, వర్గ ప్రయోజనాల కోసమే కొన్ని పత్రికలు, చానళ్ల తప్పుడు కథనాలు
- రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చినా తప్పుడు వార్తలు
- 'జర్నలిజం మౌలిక సూత్రాలు– ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో మీడియా పాత్ర'పై సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు. పక్కన మల్లాది విష్ణు, శేషగిరిరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, విజయబాబు, వెంకట్ మేడపాటి

సాక్షి, అమరావతి: ప్రజా చైతన్యానికి పెద్ద దిక్కుగా ఉంటూ ప్రజలకు వాస్తవాలను చెప్పాల్సిన కొన్ని పత్రికలు, టీవీ చానళ్లు దారి తప్పుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తమ స్వలాభం, వర్గ ప్రయోజనాల కోసం ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. విలువలను వదిలేసి విష ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినా తప్పుడు వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు కథనాలతో ఓ వర్గం మీడియా అంతిమంగా రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీసేదిగా మారుతోందన్నారు. నేడు నిబద్ధతతో పనిచేసే విలేకరుల అవసరం ఎంతగానో ఉందని చెప్పారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం 'జర్నలిజం మౌలిక సూత్రాలు–ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో మీడియా పాత్ర' అంశంపై విజయవాడలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, పత్రికా సంపాదకుడు కృష్ణంరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ శాంత కుమారి పాల్గొన్నారు.

కొన్ని పత్రికలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయి..

రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియాది ప్రధాన పాత్ర. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. అంశం ఒక్కటే అయినా గత ప్రభుత్వంలో ఒప్పు అయింది.. ఈ ప్రభుత్వంలో తప్పు అయినట్టు కథనాలు ఉంటున్నాయి. విలువలను ఉల్లంఘించడమే సంప్రదాయంగా కొన్ని పత్రికలు, చానళ్లు పనిచేస్తున్నాయి. ప్రభుత్వం మారగానే వార్తల రూపం, స్వరూపం, ప్రాధాన్యం మారిపోతున్నాయి.

– అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

లేనిది ఉన్నట్టు రాయడం క్షమించరాని తప్పు

విశాఖలో జీఐఎస్ సదస్సుకు ఎందరో పారిశ్రామికవేత్తలు వచ్చి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీనిపైనా కొన్ని పత్రికలు వక్రీకరించి కథనాలు ప్రచురించాయి. దీనివల్ల ఎవరికి లాభం?.. నష్టపోయేది ఎవరు? అనేది పాత్రికేయులు ఆలోచించాలి. సైనికుడి చేతిలో ఆయుధం, విలేకరి చేతిలోని కలం ఒకటే. లేనిది ఉన్నట్టు రాయడం క్షమించరాని తప్పు.

– కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్

సమాజ ప్రగతికి గొడ్డలిపెట్టు

మీడియాలో విలువలు దిగజారిపోతున్నాయి. ఇది సమాజ ప్రగతికి గొడ్డలిపెట్టు. తమకు వ్యక్తులపై ఉన్న కక్షను వ్యవస్థపై రుద్దేందుకు కొన్ని మీడియా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఆ పత్రికలకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు.. ప్రజాసంక్షేమం గిట్టదు.

– పి.విజయబాబు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు

ఆ రెండు పత్రికలకు మంచి కనిపించదు..

ఆ రెండు పత్రికలకు రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజలకు జరుగుతున్న మంచి కనిపించదు. జగన్ సీఎం అయినప్పటి నుంచి అవి అదే ధోరణి అవలంబిస్తున్నాయి.

–మల్లాది విష్ణు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

హైబ్రిడ్ రకం.. ఆదాయం ఘనం!



కల్లుపల్లి వద్ద హైబ్రిడ్ టమాట సాగు

హైబ్రిడ్ కూరగాయల సాగులో రైతులు

- కొత్త వంగడాల పండ్లు సైతం..
- కర్ణాటక రైతుల బాటలో పలమనేరు రైతులు
- తోటల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో హైబ్రిడ్ కూరగాయలు, పండ్ల సాగు రైతులకు లాభాలను తెచ్చిపెడుతున్నాయి. నాజూకైన, నాణ్యతతో రకరకాల సైజుల్లో ఇవి పండుతున్నాయి. అధిక దిగుబడులు వస్తుండడంతో వీటి సాగుపై రైతులు దృష్టిసారిస్తున్నారు. హైబ్రిడ్ కూరగాయల సాగులో ముందంజలో ఉన్న కర్ణాటకలోని కోలారు, మాలూరు,బెంగళూరు రూరల్ జిల్లాలకు సమీపంలోఉండడంతో అక్కడి రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుని లాభాలను ఎండిస్తున్నారు.



ఎర్రముల్లంగి,

పలమనేరు: సంప్రదాయ నాటు రకాలకు స్వస్తి పలికి హైబ్రిడ్ కూరగాయల, పండ్ల సాగుపై పలమనేరు హార్టీకల్చర్ డివిజన్‌లోని రైతులు మక్కువ చూపుతున్నారు. హైబ్రిడ్ రకాలైన టమాట, కాకర, బీర, క్యాబేజీ, బేబీకార్న్, స్వీట్‌కార్న్, ఫెన్సిల్ బీన్సు, జెలపినో మిరప(క్యాప్సికం), కాలిఫ్లవర్, రెడ్‌లేడీ బొప్పాయి, అరటి, కర్బూజా, క్యారెట్, ఎర్ర ముల్లంగి, దోస, మస్కిమిలాన్, చేతికందే మునగ, వంగ, ఎర్రబెండకాయలు, ఎల్లో కర్బూజ ఇలా రకరకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. కల్లుపల్లి, ఉయ్యాలమిట్ట, మొరం, కల్లాడు, చెన్నుపల్లి, కలగటూరు, మారేడుపల్లి, పాతూరునత్తం, నక్కపల్లి, కన్నమాకులపల్లితో పాటు పెద్దపంజాణి, వీకోట, బైరెడ్డిపల్లి, శాంతిపురం మండలాల్లో ఈపంటల సాగు ఎక్కువగా ఉంది.

చెట్టెక్కాల్సిన పని లేదు

ఇప్పటి వరకు కొబ్బరిబొండాం కోసం చెట్టు ఎక్కాల్సిందే. కాని హైబ్రిడ్ రకాల్లో నిలబడి కాయలను కోసుకోవచ్చు. కొలమాసనపల్లె సమీపంలో ఓ రైతు వీటిని సాగుచేశాడు. జామ కాయల కోసం చెట్లు ఎక్కాల్సిన పనిలేదు. తైవాన్ జామ, వీఎస్ఆర్ బిహి రకం జామ చెట్లు కేవలం మూడు నుంచి ఐదుడుగులే. ఓ జామకాయ బరువు నాలుగునుంచి ఆరు కిలోలు ఉంటుంది. గంగవరం మండలంలోని కల్లుపల్లి వద్ద దేవేంద్రనాయుడు, ఉయ్యాలమిట్ల వద్ద బాబునాయడు ఈ హైబ్రిడ్ జామతోటలను పెంచారు. పొట్టిరకం మామిడిని సైతం ఈ ప్రాంతంలోని కొందరు రైతులు వినూత్నంగా సాగు చేస్తున్నారు.

కర్ణాటక రైతులే ఆదర్శం

పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలకు ఆనుకుని ఉన్న కర్ణాటక ప్రాంతంలోని రైతులు 15 రకాల కూరగాయలు, ఏడు రకాల పండ్ల తోటలను పూర్తిగా హైబ్రిడ్ రకాలతో నాలుగైదేళ్లుగా సాగుచేస్తున్నారు. వీరి సాగు, అక్కడి రైతుల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ ఇక్కడి రైతులు స్థానికంగా ఈ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

మంచి మార్కెటింగ్ సౌకర్యం...

పలమనేరు నుంచి బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్, సేలం, మంగళూరు ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ బాగుంది. ఇక్కడ మూడు జాతీయ రహదారులుండడంతో ట్రాన్స్‌పోర్ట్‌కు అనుకూలంగా మారింది. కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు ఇక్కడి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి పండించే హైబ్రిడ్ బొప్పాయిని ఢిల్లీ వ్యాపారులు తోటలవద్దే కొంటున్నారు.

అందుబాటులో సీడ్స్

హైబ్రిడ్ రకాల కూరగాయలు, పండ్లుకు సంబంధించి దేశీయ, విదేశీ సీడ్స్ కంపెనీల సీడ్స్, కొత్త వంగడాలు అందుబాటులో ఉన్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టీకల్చర్ అండ్ రీసెర్చ్ ద్వారా కుప్పం సమీపంలోని పెద్దబంగారునత్తంలో సెంటర్‌ఫర్ ఎక్సెలెన్స్‌ఫర్ విజిటబుల్స్‌లో కొత్త వంగడాలపై ప్రయోగాలు చేసి సృష్టిస్తున్నారు. వీటిని ఇక్కడి రైతులకు పంపిణీ చేసి ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నారు.

హైబ్రిడ్ రకాలను సాగుచేస్తున్నా..



కొన్నేళ్లుగా హైబ్రిడ్ రకాలను సాగుచేస్తున్నాను. మస్కిమిలాన్, కోహినూర్ ఎల్లో కర్బూజ, మెడిసిన్ దోస, గుమ్మడి లాంటి పంటలను ఎక్కువగా చేస్తున్నాను. నాలుగైదు రాష్ట్రాల్లో మార్కెటింగ్ చేస్తుంటా. కొత్త వెరైటీ కావాలంటే ఆ కంపెనీకి చెందిన మార్కెటింగ్ ప్రతినిధులను సంప్రదిస్తే చాలు. వారే సీడ్స్‌ను ఇచ్చి సాగు అనుమానాలను నివృత్తి చేస్తుంటారు.

– మస్కిమిలాన్ గజేంద్ర, తొప్పనపల్లె

పలు రకాల వంగడాలు




దేశీయ కంపెనీలతో పాటు అంతర్జాతీయ సీడ్స్ కంపెనీల సీడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంత వాతారవరణం అన్ని రకాల కూరగాయల పంటల సాగుకు అనుకూలంగా ఉంది. రైతులకు నూతన వంగడాల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తిగల రైతులకు అవరసమైన సలహాలు, సూచనలిస్తున్నాం. కుప్పంలోని సెంటర్‌ఫర్ ఎక్సలెన్స్‌లో పలు రకాల కొత్తవంగడాలను రూపొందిస్తున్నాం.

– డాక్టర్ కోటేశ్వరావు, హార్టీకల్చర్ ఏడీ, పలమనేరు



మునగ తోట



దోస

ఊరికి ఊరట

- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా ప్రభుత్వం
- మందుల నుంచి పింఛను వరకు అన్నింటా చేదోడు
- ఊపిరి పీల్చుకుంటున్న ఉద్దానం



సోంపేటలోని డయాలసిస్ సెంటర్, అదనపు బెడ్ల కోసం ఏర్పాటు చేసిన కంటైనర్

కంచిలి, సోంపేట: ఏడుపు అలవాటై, చావు కబురు సాధారణమైపోయిన స్థితిలో ఉద్దానంలోని ఊరికి ప్రభుత్వం ఊరట కలిగిస్తోంది. ఇక్కడ దశాబ్దానికిపైగా తిష్ట వేసుకుని మనుషులను తినేస్తోన్న కిడ్నీ వ్యాధిపై పోరాటంలో.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూపిస్తున్న చిత్తశుద్ధి బాధితులకు సాంత్వన కలిగిస్తోంది. డయాలసిస్ కేంద్రాల్లో ఉన్న బెడ్లను ఎప్పటికప్పుడు పెంచుతూ, డయాలసిస్ రోగులకు జాప్యం లేకుండా వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. గతంలో విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసి డయాలసిస్ చేయించుకునేవారు. ఇప్పుడు ఆ దుస్థితి లేదు. అవసరమైన డయాలసిస్ కేంద్రాలు స్థానికంగానే ఏర్పాటు చేయడంతో పాటు బెడ్లు కూడా పెంచుతున్నారు. కొద్దిరోజుల్లో ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో కూడా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక రూ.5వేలు, రూ.10వేల పింఛన్లు కిడ్నీ బాధితులకు ఇస్తున్న ధైర్యం మాటల్లో చెప్పలేనిది.

మంత్రి హామీపై హర్షం

ఉద్దానంలోని కిడ్నీ వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు స్వయంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఇటీవలే ఇక్కడ పర్యటించారు. ఇక్కడ కిడ్నీ వ్యాధిగ్రస్తులతో ముఖాముఖి మాట్లాడారు. ఇక్కడి పరిస్థితి తీవ్రతపై ఆమెతోపాటు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఒక అంచనాకు వచ్చారు. సోంపేట, కవిటి డయాలసిస్ కేంద్రాల్లో ఐదేసి బెడ్లు పెంచుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆయా గ్రామ సచివాలయం పరిధిలో గల వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌లోనే కిడ్నీ పరీక్షలు చేయించడానికి చర్యలు చేపడతామన్నారు. ఇప్పటి వరకు ఉచితంగా ఇస్తున్న మందులతోపాటు, మరికొన్ని అవసరమైన మందులు, రక్తం వృద్ధి చెందే ఇంజెక్షన్ల సరఫరా పెంచుతామని హామీ ఇచ్చారు. పలాసలో నిర్మితమవుతున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను త్వరలో పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తామని, ఇందుకోసం యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని తెలిపారు.

సద్వినియోగం కావాలి..

కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం 36 రకాల మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. కానీ కొందరు రోగులు ప్రైవేటు వైద్యుల మాటలు నమ్మి బయట మెడికల్ షాపుల్లో లభ్యమయ్యే మందుల్నే కొనుగోలు చేసి, డబ్బును దుబారా చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత మందుల్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం నియమించిన నెఫ్రాలజిస్టులు ప్రతి 15 రోజులకు ఓ సారి వచ్చి చెప్పినప్పటికీ కొందరు రోగులు పెడచెవిన పెడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులు సరైనవేననే విషయంపైన వారికి మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డయాలసిస్ కేంద్రాల నిర్వహణ బాధ్యతను 'నెఫ్రోప్లస్' అనే ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది.

ఉద్యోగం మానేశా..

నా తల్లికి కిడ్నీ వ్యాధి సోకడం వల్ల ఆరేళ్లుగా తిరుపతిలో చేస్తున్న ఉద్యోగం మానేసి వచ్చేశాను. వారానికి రెండుసార్లు డయాలసిస్ కేంద్రానికి తీసుకొచ్చి, రక్తం మార్పిడి చేయించి, ఇంటికి తీసుకెళ్తున్నాను. అయితే కిడ్నీ డయాలసిస్ రోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.10వేలు పింఛన్‌తో ఉపశమనం కలుగుతోంది.

–జి. రుక్కు, వ్యాధిగ్రస్తురాలు కుమారుడు, లండారిపుట్టుగ గ్రామం, కవిటి మండలం

36 రకాల మందులు సరఫరా..

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన 36 రకాల మందుల్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది. ఈ మందుల్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలి. బయట మందుల్ని కొనుగోలు చేయడం వలన డబ్బు వృధా అవుతుందని రోగులు, వారి కుటుంబీకులు గుర్తించాలి.

– డాక్టర్ దుర్యోధన, సూపరింటెండెంట్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి, సోంపేట

చక్కటి సేవలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్దాన ప్రాంతాన్ని పీడిస్తున్న కిడ్నీ సమస్యను రూపుమాపేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ముందడుగు పడింది. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు చేయని పనిని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టింది. ఆ దిశగా అవసరమైన చర్యలు చేపడుతోంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగించేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం ద్వారా పర్యవేక్షిస్తూ ముందుకు వెళుతున్నాం.

– పిరియా సాయిరాజ్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఇచ్ఛాపురం

సన్నిధి

దమ్మపదం

అరటి పువ్వులా ఉండ కూడదు!



దేవదత్తుడు ఒక యువ రాజు. చిన్ననాటినుంచి బుద్ధుని పట్ల దేవదత్తుడు శత్రుభావంతో ఉండేవాడు. చిన్నప్పుడు బాణాలతో దేవదత్తుడు హంసను కొడితే, దాన్ని బుద్ధుడు సంరక్షించి, ప్రాణం కాపాడాడు.

ఆ హంస నాదంటే నాదని దేవదత్తుడు సిద్ధార్థునితో వాగ్వివాదానికి దిగాడు. 'ప్రాణం తీసిన వానిది కాదు. ప్రాణం పోసిన వానిదే హంస' అని, ఆ హంసను తీసుకుని, గాయాలు మానేలా చేసి, తిరిగి ఆకాశంలోనికి వదిలి పెట్టాడు సిద్ధార్థుడు. అప్పటినుంచి బుద్ధుడి పట్ల ద్వేషం, అసూయ పెంచుకుంటాడు దేవదత్తుడు.

వారు పెరిగి పెద్దవారయ్యాక, బుద్ధుడు బౌద్ధసంఘాన్ని స్థాపించి విశేష గౌరవ సత్కారాలు పొందడం చూసి తానూ బౌద్ధ సంఘంలో చేరాడు దేవదత్తుడు. కొన్నాళ్లకి బౌద్ధసంఘంలో తనకే అగ్రస్థానం లభించాలని, తానో నాయకుణ్ణి కావాలని పట్టుబట్టాడు దేవదత్తుడు. సంఘం అంగీకరించక పోవడంతో మగధ యువరాజు అజాత శతృవు పంచన చేరి 'నీవు నీ తండ్రిని చంపి రాజువుకా. నేను బుద్ధుణ్ణి చంపి బౌద్ధసంఘం నాయకుణ్ణవుతాను' అని నూరిపోస్తాడు.

అజాత శతృవు దేవదత్తుని మాటలు నమ్మి, అతణ్ణి ఆదరిస్తాడు. ఈ విషయం శిష్యులు బుద్ధునితో చెబుతారు. అప్పుడు బుద్ధుడు – 'భిక్షువులారా! దుష్టునికి దక్కే గౌరవ సత్కారాలు అరటిచెట్టు పువ్వులాంటివి. వెదురుచెట్టు పుష్పం లాంటివి. ఎండ్రకాయ గర్భం లాంటివి. ఒక్కపువ్వుతోనే అరటిచెట్టు అంతరిస్తుంది. వెదురు చెట్టు ఒక్క పూతతోనే తన నాశనాన్ని తాను తెచ్చుకుంటుంది. పీతకి గర్భమే దాని చావుని ప్రసాదిస్తుంది' అని చెప్పాడు.

''నిజమే, మామిడిచెట్టు పుష్పించి, ఫలాలనిస్తుంది కానీ అంతరించదు. మరలా చిగురించి, మరలా ఫలాలను ఇస్తూనే ఉంటుంది. అది ఎప్పుడూ గౌరవ సత్కారాలు పొందుతూనే ఉంటుంది. కానీ అరటిచెట్టు పుష్పించి, గెలవేసి అంతరిస్తుంది. ఒక్కకాపుతోనే దాన్ని నరికేస్తారు. దుష్టుడు పొందే గౌరవ సత్కారాలు ఇలాటివే కదా!'' అనుకున్నారు అతిథులు.

బుద్ధుడు చెప్పినట్టే, ఆ తర్వాత అజాత శతృవుకి దూరమై, ఒంటరిగా మిగిలి దైన్యంగా ప్రాణాలు పోగొట్టుకున్నాడు దేవదత్తుడు.

– బొర్రా గోవర్ధన్

మంచి మాట

8, బుధవారం మహిళా దినోత్సవం

కదిలించే కావ్యం మహిళ

సృష్టిలో ఒక గొప్ప సృష్టి మహిళ. మహిళ గొప్పతనం గురించి గొప్పవాళ్లు ఎందరో ఎంతో గొప్పగా చెప్పారు. ఆ చెప్పినది అంతా మహిళ గొప్పతనానికి ఎంతమాత్రమూ న్యాయం చెయ్యలేదు, సరితూగలేదు. మహిళ గొప్పతనం గురించి ఎవ్వరూ గొప్పగా కాదుకదా తగినట్లుగా కూడా చెప్పలేదేమో? చెప్పలేరేమో?!

అమ్మ అయింది, తోబుట్టువు అయింది, ఆలి అయింది; అడుగడుగునా మనతోడై నిలిచింది మహిళ. అనురాగం ఆప్యాయతల కలబోత అయిన మహిళ ఆనందానికి ఆలయం తానై వెలిసింది. మన ఉనికికి మూలం, మనుగడకు ఆలవాలం మహిళ. మూగిన జీవనచీకటిలో కాంతి మహిళ. మానవ బంధాలను, సంబంధాలను కలుపుతూ కదిలే కావ్యం మహిళ. మనల్ని కదిలించే కావ్యం మహిళ.

మానవ జీవితకథకు ఇతివృత్తం మహిళ; మానవ జీవనకథనానికి గమనం మహిళ. మానవచరిత్రకు ఆత్మ మహిళ. అత్యు దాత్తతకు ఆకృతి మహిళ.

తత్త్వంపరంగానూ, వ్యక్తిత్వంపరంగానూ, ప్రవర్తనపరంగానూ మహిళ ఎంతో విశిష్టమైంది. 'మహిళ ఒకదాన్ని స్వీకరిస్తుంది ఆపై దాంతో సృజన చేస్తుంది; ఆ సృజన సూత్రం విశ్వంలోనే అత్యంత అద్భుతమైంది' అని చైనీస్ తత్త్వవేత్త, కవి జుషి వందలయేళ్ల క్రితమే చెప్పారు. 'సారంలేని ఈ లోకంలో సారాన్ని ఇచ్చేది మహిళ అని తెలుసుకునే కాబోలు శివుడు తన అర్ధశరీరాన్ని మహిళకు ఇచ్చాడు' అని ఒక పూర్వ సంస్కృతశ్లోకం మనకు చెబుతోంది.

మనవాళ్లు మహిళకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చారు; మహిళకు ప్రశస్తమైన స్థానాన్ని ఇచ్చారు. వేదంలో ఒక వధువు, వరుడితో ''నేను ఋక్ (సాహిత్యం), నువ్వు సామం (గానం)'' అని అంటుంది. గానానికి సాహిత్యంలాగా మగవాడికి మహిళ ముఖ్యం. మహిళను సాహిత్యం అనడమే ఆమె గొప్పతనాన్ని చాటుతోంది. సాహిత్యం మన సుల్నీ, మస్తిష్కాల్నీ కదిలిస్తుంది. మహిళ కూడా అంతే.

మన భారతదేశంలోని ఋషులలో రోమశ, లోపాముద్ర, గార్గి, మైత్రేయి, అదితి, విశ్వనార, స్వస్తి, శశ్వతి, సూర్య, ఇంద్రాణి, శుచి, ఆపరి, ఉశన, గౌరివీతి, చైలకి, జయ, ప్రాదురాక్షి, మేధ, రమ్యాక్షి, లౌగాక్షి, వారుని, విదర్భి, విశ్వనార, వృష , సర్పరాజ్ఞి, సునీతి, హైమ ఇంకా కొందరు మహిళలు ఉండేవారు. కొన్ని మంత్రాలకు ఋషులైన మహిళలు ద్రష్టలు. వేదంలో ఒక మహిళ ''నేను శిరస్సును, నేను జెండాను, నేను నిప్పుల మాటలు పలుకుతాను. నా భర్త నన్ను అనుసరించనీ'' అంటుంది.


ఈ మాటల్నిబట్టి వేదకాలంలో మహిళకు స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం నిండుగా ఉండేవని, మహిళకు విశేషమైన, ప్రత్యేకమైన స్థానాలు ఉండేవని తెలియవస్తోంది. 'సమాజానికి, కుటుంబానికి మహిళ రక్షకురాలిగా వ్యవహరించాలి' అనీ, 'మహిళలు యుద్ధంలో పాల్గొనాలి' అనీ చెప్పిన వేదం 'భర్తకు సంపాదించే మార్గాలు నేర్పించు' అనీ మహిళకు చెబుతూ ఆమె ఆవశ్యకతను మనకు తెలియజేస్తోంది.

'ఆదిశక్తి అంటూ శక్తి అంటే మహిళే అని మనకు తెలియ చెప్పడం జరిగింది. 'శివుడు శక్తితో కలిస్తేనే జగత్తును సృష్టించే శక్తి కలవాడు అవుతాడు' అని ఆదిశంకరులు సౌందర్యలహరిలో తెలియజెప్పారు. మహిళ లేకపోతే శక్తే లేదు.

మహిపై దేవుడి మహిమ వెల్లివిరిసింది, అది మహిళ అయింది. వ్యాఖ్యానించబడలేని ఔన్నత్యం ఒక మూర్తిమత్వాన్ని పొందింది; అదే మహిళ. మహిళను సరిగ్గా అర్థం చేసుకోవడం, సరిగ్గా గౌరవించడం మనం నేర్చుకోవాలి. సరైన మహిళకు సాటి సరైన మహిళతత్త్వమే. సరైన మహిళ లేదా సరైన మహిళ తత్త్వం ప్రేరణ, స్ఫూర్తి కాగా మనం సరైన మనుగడ చెయ్యాలి.

– రోచిష్మాన్

గురువాణి



పాము పడగ మీది మణిలాగా..

శీలము, విద్య ఈ రెండూ పక్కపక్కన ఒక దానికొకటి దోహదపడాలి. శీలము అంటే నడవడిక. మనిషి ప్రవర్తన. ఎంత విద్యావంతుడో అంత వినయం కలిగిన వాడై ఉండాలి. విద్య అంటే తెలుసుకొనుట.. ఈ క్రమంలో తనకు తెలియనివి ఎన్నో ఉన్నాయని తెలుసుకుంటాడు. నాకు తెలిసింది బహు తక్కువ అని తెలుసుకుని, కొత్త వాటిని తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటాడు. అదే విద్య. తెలియనివి ఎన్నో ఉన్నాయనుకొన్నవాడు తలెత్తి గర్వంతో ఎలా తిరుగుతాడు ? అందుకే విద్య చేత వినయం.. దానితో ప్రవర్తన అలవాటవుతుంది.

శ్రీరామాయణం బాలకాండలో రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలుగురూ కలిసి వశిష్ఠ మహర్షి వద్ద నేర్చుకొన్న వైనాన్ని వర్ణిస్తూ వాల్మీకి మహర్షి..''సర్వేవేదవిదః శూరాః సర్వే లోకహితే రతాః/ సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వేసముదితా గుణైః... అంటాడు. వాళ్ళు అన్నీ చదువుకొన్నారు. అది లోకహితానికి పనికొచ్చింది... అంటాడు. మీరు ఎంత వినయంతో ప్రవర్తిస్తుంటారు, అందరి మేలు గురించి ఎంత ఆలోచిస్తుంటారు, దాన్ని గురించి ఎంత ఒత్తిడిననా ఎదుర్కోవడానికి సిద్ధపడుతుంటారు, మీరు త్యాగం చేసి పది మందికి ప్రయోజనాన్ని చేకూర్చడంలో ఎంత సంతోషంగా గడపగలరు...అన్నవి మీరు చదువుకున్న చదువుకి సార్థకత చేకూరుస్తాయి. అప్పుడే దాని వల్ల నలుగురికీ ప్రయోజనం.

''విద్యచే భూషితుండయి వెలయుచున్న/దొడరి వర్జింపన గుజుమీ దుర్జనుండు/చారు మాణిక్య భూషిత శస్తమస్త/కంబయిన పన్నగము భయంకర ముగాదె'' అంటాడు భర్తృహరి.. నాగుపాము పడగమీద మణి ఉండి ఏ ప్రయోజనం... అలాగే దుర్మార్గులవద్ద ఎంత విద్య ఉన్నా అంతే అంటాడు. పోతనకూడా అదే అంటాడు భాగవతంలో... ''జ్ఞాన ఖలునిలోని శారదయును బోలె...'' అని. నిలువెల్లా దుర్మార్గపు ఆలోచనలున్నప్పుడు, అహంకారం తలకెక్కి ఉన్నప్పుడు.. తానొక్కడే జ్ఞాని అని మిగిలిన అందరినీ చులకనగా చూస్తున్నప్పుడు వారివల్ల, వారి పాండిత్యం వల్ల ఎవరికి ప్రయోజనం!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఈనాటికీ జ్ఞాపకం చేసుకుంటున్నామంటే... వారి తెలివితేటలే కాదు.. వారి వినయ ప్రవర్తన, వారి వల్ల సమాజానికి చేకూరిన లాభం కారణం... గొల్లపూడి మారుతీరావు గారు ఒక చోట చెబుతారు... ఒక చెట్టునుంచి లక్ష అగ్గిపుల్లలు తయారవుతాయి... కానీ ఒక్క అగ్గిపుల్ల అరణ్యాన్ని మొత్తం కాల్చేస్తుంది. ఒక పక్షి బతికున్నకాలంలో ఎన్నో పురుగులను తింటుంది. అదే పక్షి చనిపోతే పురుగులు దాన్ని తింటాయి... ''మాకురు ధన జన యౌవ్వన గర్వం, హరతినిమేషత్కాలఃసర్వం/మాయామయమిదమఖిలమ్ హిత్వా, బ్రహ్మపదమ్ త్వం ప్రవిశ విదిత్వా'' అంటారు శంకరభగవత్పాదులు. దేనికోసం ఈ మిడిసిపాటు! అన్న ఆత్మ విమర్శ నిన్ను నిగ్రహిస్తూ ఉండాలి.

భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిగారు చనిపోయే నాటికి ఆయన కొనుక్కున్న ఫియట్ కారు మీద అప్పు తీరలేదు. ఎందరో అభిమానులు మనీ ఆర్డర్లు పంపబోతే ఆయన భార్య లలితా శాస్త్రిగారు వాటిని సున్నితంగా తిరస్కరించి ఆ అప్పును తానే తీర్చుకున్నారు. చదువు, మంచి నడవడిక కలిసి ఉన్నప్పుడు నీ శీలవైభవాన్ని మరింత ప్రకాశింపచేస్తాయి.

అమృత బిందువులు

- మనలో ఉన్న మంచి భావాలు మంచి సాంగత్యాన్ని ఇస్తాయి. మంచి సాంగత్యం మంచి పనులకు దారి తీస్తుంది.
- ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ఇది ముమ్మాటికీ నిజం. అందులో మన కష్టాలు కూడా ఉంటాయి.
- జీవితంలో అన్నీ కోల్పోయినా ఒకటి మాత్రం మనకోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దాని పేరే భవిష్యత్తు.
- నిన్ను వద్దనుకొన్న బంధాలముందు జాలిగా నిలబడకు. నీ వ్యక్తిత్వాన్ని ఎప్పటికీ వదులుకోకు. నీ విలువ తెలియని మనుషుల కోసం పరితపించకు.
- నిన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడేవారు ఉంటారు. ఎందరో కాకపోయినా... ఒక్కరైనా... ఆ ఒక్కరూ నీకు తోడుగా... నీతో కలసి ఉంటారు.
- సమస్యలు నిన్ను చుట్టుముడతాయి. బాధలు నిన్ను అమాంతం అలుముకుంటాయి. కష్టాలు నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అనేక భావోద్వేగాలు నిన్ను ఆవేదనకు గురిచేస్తాయి. నువ్వు అష్టదిగ్బంధనంలో ఇరుక్కుంటావు. కానీ, నువ్వు ఓర్పుతో, నేర్పుతో, పట్టుదలతో, క్రమశిక్షణతో ఉండు. కాలమే ప్రతి సంఘర్షణకు సమాధానం. ఎందుకంటే... ఏ నిమిషం శాశ్వతం కాదు.

సినిమా

వైజాగ్‌లో టైగర్



రవితేజ

హీరో రవితేజ నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపూర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న 'టైగర్ నాగేశ్వరరావు' చివరి షెడ్యూల్ వైజాగ్‌లో ప్రారంభమైంది. వంశీ, అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ–''స్టూవర్టుపురంలోని టైగర్ నాగేశ్వరరావు అనే గజదొంగ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతోన్న చిత్రమిది. 1970ల నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ పాత్ర కోసం రవితేజ కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. సరికొత్త బాడీ లాంగ్వేజ్, యాసతో అలరిస్తారు. వైజాగ్‌లో ప్రారంభమైన చివరి షెడ్యూల్‌లో కీలక తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలు తెరకెక్కిస్తున్నాం. ఈ ఏడాది సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: తేజ్ నారాయణ్ అగర్వాల్, సహ నిర్మాత: మయాంక్ సింఘానియా, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: ఆర్. మధి.

నా పాత్రలో రెండూ ఉంటాయి

– రానా



''నేను సాధారణంగా మంచి లేదా చెడు పాత్రలు పోషిస్తాను. కానీ, 'రానా నాయుడు' లో నేను చేసిన రానా పాత్రలో ఆ రెండూ కలిసి ఉంటాయి'' అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. వెంకటేష్, రానా తొలిసారి 'రానా నాయుడు' అనే వెబ్ సిరీస్‌లో నటించారు. కరణ్ అన్షుమాన్–సుపర్ణ్ ఎస్.వర్మ దర్శకత్వం వహించారు. కరణ్ అన్షుమాన్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ– ''రానా నాయుడు' లో రానా చీకటి జీవితం గడుపుతుంటాడు. కానీ తన కుటుంబాన్ని పోషించడానికి బాగా కష్ట పడతాడు. నా పాత్రలో ఎక్కువ కోపం చూపించే సన్నివేశాలున్నాయి. నిజ జీవితంలో నేను ప్రశాంతంగా ఉంటాను. కానీ ఈ సిరీస్‌లో కోపం ప్రదర్శించడం సవాలుగా అనిపించింది. అదృష్టవశాత్తూ మా బాబాయ్‌కి(వెంకటేష్), నాకు ఆఫ్ స్క్రీన్ కూడా మంచి బాండింగ్ ఉండటంతో నటించడం సులభం అయింది. వైరం ఉన్న పాత్రలో మెప్పించడం ఒక సవాల్‌తో కూడుకున్నప్పటికీ రానా, నాగా(వెంకటేష్ క్యారెక్టర్) పాత్రలు, వాటి మధ్య ఉండే ఆవేశం, భావోద్వేగాల పైనే దృష్టిపెట్టాం'' అన్నారు.

యాక్షన్‌కి వేళాయె

విజయ్ దేవరకొండ యాక్షన్ మోడ్‌లోకి వెళ్లనున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా సమంత అనారోగ్య సమస్య, కాల్షీట్స్ సర్దుబాటు వంటి అంశాలతో 'ఖుషి' సినిమా షూటింగ్‌కు కాస్త బ్రేకులు పడ్డాయి. అయితే అతిత్వరలో ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లోనే ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ప్లాన్ చేశారు శివనిర్వాణ. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి పీటర్ హెయిన్ కొరియోగ్రఫీ చేయనున్నారు. 'ఖుషి' చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటోంది చిత్ర యూనిట్.



విజయ్ దేవరకొండ

ఎమోషనల్ థ్రిల్లర్



చైతన్య కృష్ణ

దివంగత నటుడు నందమూరి తారక రామారావు మనవడు(జయకృష్ణ తనయుడు) చైతన్య కృష్ణ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బ్రీత్'. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వం వహించారు. వైదిక సెంజలియా హీరోయిన్. బసవతారకరామ క్రియేషన్స్‌పై జయకృష్ణ నిర్మించారు. 'బ్రీత్' టైటిల్ పోస్టర్‌ని హీరో కల్యాణ్ రామ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''బ్రీత్' తో మా పెదనాన్న జయకృష్ణ నిర్మాతగా, మా అన్న చైతన్యకృష్ణ హీరోగా పరిచయమవుతుండటం హ్యాపీ. పోస్టర్ ఆసక్తిగా ఉంది. ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఎమోషనల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'బ్రీత్'. సినిమా చాలా బాగా వచ్చింది.. అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు జయకృష్ణ. ఈ చిత్రానికి కెమెరా: రాకేష్ హోసమణి, సంగీతం: మార్క్ కె.రాబిన్.

అమ్ముతడా? సస్తడా?



జగదీశ్

'పుష్ప' ఫేమ్ జగదీశ్ ప్రతాప్ భండారి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సత్తిగాని రెండెకరాలు'. 'అమ్ము తడా? సస్తడా?' అనేది క్యాప్షన్. అభినవ్ దండా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 17 నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ కానున్నట్లు యూనిట్ ప్రకటించింది. ''కొల్లూరు నేపథ్యంలో పవర్‌ఫుల్ స్టోరీలైన్‌తో 'సత్తిగాని రెండెకరాలు' సినిమా రూపొందింది'' అని యూనిట్ పేర్కొంది.

కృష్ణతత్వం నేపథ్యంలో...



శేషు, శ్యామ్, జయశంకర్, శ్రీ సత్య గౌరవ్, సాయికుమార్

అనసూయ, సాయి కుమార్, సుమన్, ఆమని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్‌వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, శేషు మారంరెడ్డి నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలో కృష్ణతత్వం నేపథ్యంలో సాగే తొలిపాటను హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్ అధ్యక్షుడు శ్రీ సత్య గౌరవ్ చంద్రదాస్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని మంగ్లీ పాడారు. జయశంకర్ మాట్లాడుతూ–''కథ ప్రకారం కృష్ణుడు గురించి అందరికీ అర్థమయ్యేలా ఓ పాట కావాలని కాసర్ల శ్యామ్‌ని కోరాను. కృష్ణుడి ఫిలాసఫీ, గీత తత్వం అందరికీ అర్థమయ్యేలా రాసిచ్చారాయన'' అన్నారు. ''ఈ సినిమాలో మంచి పాత్ర చేశాను'' అన్నారు సాయికుమార్. ''అరి' బాగుంటుంది'' అన్నారు శేషు మారంరెడ్డి. ఈ కార్యక్రమంలో కాసర్ల శ్యామ్, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవ్ నాయర్, నటి, యాంకర్ అంజలి పాల్గొన్నారు.

వెబ్ ఎంట్రీ

హీరోయిన్ జ్యోతిక వెబ్ ఎంట్రీ ఖరారు అయినట్లుగా తెలుస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి హిందీ నిర్మాణ సంస్థ ఎక్సెల్ ఎంటర్‌టైన్మెంట్‌పై నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సద్వానీ రెండో వెబ్‌సిరీస్ నిర్మించనున్నారు. సోనాలీ బోస్ దర్శకత్వం వహించనున్న ఈ వెబ్‌సిరీస్‌లో ఓ లీడ్ యాక్ట్రస్‌గా జ్యోతికను అనుకున్నారట మేకర్స్. స్క్రిప్ట్ నచ్చడంతో ఆమె కూడా ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ టాక్. ఐదుగురు గృహిణులు రహస్యంగా ఓ వ్యాపారాన్ని మొదలుపెట్టినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? అన్నదే ఈ వెబ్‌సిరీస్ కథాంశమట. దీనిపై అధికారిక ప్రకటన వెల్లడైతే జ్యోతిక నటించే తొలి వెబ్‌సిరీస్ ఇదే అవుతుంది.



జ్యోతిక

వేసవిలో అహింస



గీతిక, అభిరామ్

నిర్మాత సురేశ్ బాబు తనయుడు, హీరో రానా సోదరుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. తేజ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గీతికా తివారీ హీరోయిన్. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై పి.కిరణ్ నిర్మించారు. కాగా 'అహింస' సినిమాని వేసవి కానుకగా ఏప్రిల్ 7న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''యూత్‌ఫుల్ లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'అహింస' ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. రజత్ బేడీ, సదా, రవి కాలే, కమల్ కామరాజు, మనోజ్ టైగర్, కల్పలత, దేవీ ప్రసాద్ నటించిన ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: ఆర్పీ పట్నాయక్.

వ్యాయామం చేయడం మంచిదైంది

– సుస్మితాసేన్

మాజీ మిస్‌వరల్డ్, నటి సుస్మితాసేన్ ఇటీవల తీవ్ర గుండెపోటుకు గురైన సంగతి తెలిసిందే. ఆమెకు వైద్యులు యాంజియోప్లాస్టీ చేసి, స్టంట్ వేశారు. దీంతో ఆమె ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉంది. అయితే తన తాజా ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ ఓ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేశారు సుస్మితాసేన్. ''ఇటీవల నేను తీవ్ర గుండెపోటుకు గురయ్యాను. ప్రధాన రక్తనాళం 95 శాతం క్లోజ్ అయ్యింది. వైద్యులు నా కోసం ఎంతో శ్రమించారు. హాస్పిటల్ సిబ్బందికి, నా కోసం ప్రార్థనలు చేసిన వారందరికీ ధన్యవాదాలు. నా గొంతు ఇప్పుడు సరిగ్గాలేదు. కానీ భయడాల్సిన పనేంలేదు. చిన్న ఇన్‌ఫెక్షన్ మాత్రమే. ఇటీవల ఎక్కువగా గుండెపోటు కేసులు నమోదు కావడాన్ని గమనిస్తున్నాం. దయచేసి వ్యాయామాలు చేయండి. జిమ్‌కు వెళ్లడం వల్ల ఏం ఉపయోగం లేదని కొందరు భావిస్తుంటారు. కానీ, నా విషయంలో వ్యాయామాలు చేయడం ఉపయోగపడింది. ఓ యాక్టివ్ లైఫ్‌ను లీడ్ చేస్తున్నందునే ఈ ప్రమాదం నుంచి బయటపడగలిగాను. నా ఆరోగ్యం గురించి వైద్యులు ఓకే చెప్పగానే 'ఆర్య' లేటెస్ట్ సీజన్ కోసం జైపూర్ వెళ్తాను. 'తాలి' సినిమాకు డబ్బింగ్ చెప్పాల్సి ఉంది'' అన్నారు సుస్మితాసేన్.



మహిళల సమస్యలపై...



నోయల్, రమేష్, భానుశ్రీ

నోయల్ సీన్, 'బిగ్ బాస్' ఫేమ్ భానుశ్రీ జంటగా దొంతు రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈఎమ్ఐ– ఈ అమ్మాయి'. దొంతు బుచ్చయ్య, బమ్మిడి సంగీత సమర్పణలో డి.రమేష్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ''ప్రపంచంలో అన్ని వస్తువులు ఈఎమ్ఐలో దొరుకుతాయి. అమ్మాయి కూడా అలాగే దొరికితే ఎలా ఉంటుంది? అనేదే మా చిత్ర కథ'' అన్నారు దొంతు రమేష్. ''మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో నిర్మించిన చిత్రమిది'' అన్నారు దొంతు బుచ్చయ్య.

పగ కూడా అంతే!

సృష్టిడాంగే ప్రధాన పాత్రలో ఎమ్ఏ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరఖడ్గం'. బ్రహ్మానందం, సత్యప్రకాష్, ఆనంద్ రాజ్ కీలక పాత్రలు చేశారు. కె.కోటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల మూడోవారంలో రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఎమ్ఏ చౌదరి మాట్లాడుతూ–''చరిత్ర శిథిలమైనా, దాని మూలాలు ఎక్కడో ఒక చోట మిగిలే ఉంటాయి.. పగ కూడా అంతే. వాస్తవాన్ని వెంటాడుతూ గతం చేసిన యుద్ధమే 'వీరఖడ్గం'' అన్నారు. ''సినిమా బాగా వచ్చింది'' అన్నారు లైన్‌ప్రొడ్యూసర్, ఫైనాన్షియర్ సునీల్‌కుమార్.



సృష్టిడాంగే



'అమ్మాయిల ఆటకు డబ్ల్యూపీఎల్‌తో అందలం'

దేశంలో మహిళా క్రికెటర్ల కలలు సాకారమయ్యేందుకు డబ్ల్యూపీఎల్ దోహదం చేస్తుందని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ అన్నారు. 'మరెంతో మంది యువ క్రీడాకారిణిలు క్రికెట్‌వైపు మళ్లేందుకు, కెరీర్‌గా ఎంచుకునేందుకు డబ్ల్యూపీఎల్ ఉపయోగపడుతుంది. ఇందులో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. తొలి మ్యాచ్‌లో తమ ఫ్రాంచైజీ భారీ విజయం సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నా' అని నీతా అంబానీ వ్యాఖ్యానించారు.

బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి చాంప్ వెర్‌స్టాపెన్



ఫార్ములావన్ సీజన్‌లోని తొలి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ నిర్ణీత 57 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 33 నిమిషాల 56.736 సెకన్లలో ముగించి టైటిల్ సాధించాడు. పెరెజ్ (రెడ్‌బుల్) రెండో స్థానంలో, అలోన్సో (ఆస్టన్ మార్టిన్) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని రెండో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.



గ్రేస్ హారిస్

'గ్రేట్' హారిస్...

- యూపీని ఒంటిచేత్తో గెలిపించిన గ్రేస్ హారిస్
- 26 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్
- గుజరాత్‌కు రెండో ఓటమి

ముంబై: పురుషుల లీగ్‌కు ఏమాత్రం తీసిపోని మ్యాచ్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు వన్నెలద్దింది. ఉత్తరప్రదేశ్ (యూపీ) వారియర్స్ 'హిట్టర్' గ్రేస్ హారిస్ (26 బంతుల్లో 59 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆఖరి ఓవర్ మెరుపులతో మ్యాచ్ ఫలితాన్నే మార్చింది. 170 లక్ష్యం ఛేదించే క్రమంలో యూపీ ఒకదశలో 105/7 స్కోరుతో ఓటమికి దగ్గరైంది. ఈ దశలో సోఫీ ఎకిల్‌స్టోన్ (12 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అండతో హారిస్ ధనాధన్ 'గ్రేట్' ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించింది. అభేద్యమైన 8వ వికెట్‌కు ఈ ఇద్దరు 4.1 ఓవర్లలో 70 పరుగులు జోడించి యూపీని గెలిపించారు. ఆఖరి ఓవర్లో యూపీకి 19 పరుగుల కావాల్సి ఉండగా.. అనాబెల్ వేసిన ఈ ఓవర్‌లో గ్రేస్ వరుసగా 6, వైడ్, 2, 4, వైడ్, 4, 6లతో ఏకంగా 24 పరుగులు పిండుకుంది. దీంతో యూపీ 3 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. అంతకు ముందు గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 169 పరుగులు చేసింది. హర్లీన్ డియోల్ (32 బంతుల్లో 46; 7 ఫోర్లు) రాణించగా, సబ్బినేని మేఘన (15 బంతుల్లో 24; 5 ఫోర్లు), ఆష్లే గార్డ్‌నర్ (19 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (13 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. యూపీ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్, దీప్తి శర్మ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ వారియర్స్ 19.5 ఓవర్లలో 7 వికెట్లకు 175 పరుగులు చేసి గెలిచింది. కిమ్ గార్త్ (5/36) యూపీని బెంబేలెత్తించినా ఫలితం లేకపోయింది.

స్కోరు వివరాలు

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేఘన (సి) శ్వేత (బి) సోఫీ 24; సోఫియా (బి) దీప్తి 13; హర్లిన్ (సి) తాలియా (బి) అంజలి శర్వాణి 46; అనాబెల్ సదర్లాండ్ (సి) అంజలి (బి) సోఫీ 8; సుష్మ (సి) శ్వేత (బి) తాలియా 9; గార్డ్‌నర్ (స్టంప్డ్) హీలీ (బి) దీప్తి 25; హేమలత (నాటౌట్) 21; స్నేహ్ రాణా (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 169. **వికెట్ల పతనం:** 1-34, 2-38, 3-50, 4-76, 5-120, 6-142. **బౌలింగ్:** రాజేశ్వరి 4-0-30-0, అంజలి శర్వాణి 4-0-43-1, దీప్తి 4-0-27-2, సోఫీ 4-0-25-2, తాలియా 2-0-18-1, దేవిక 2-0-24-0.

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: హీలీ (సి అండ్ బి) గార్త్ 7; శ్వేత (సి) మాన్సి (బి) గార్త్ 5, కిరణ్ నవ్‌గిరే (సి) సుష్మ (బి) గార్త్ 53; తాలియా (సి) హేమలత (బి) గార్త్ 0; దీప్తి (బి) మాన్సి 11; గ్రేస్ హారిస్ (నాటౌట్) 59; సిమ్రన్ (బి) గార్త్ 0; దేవిక (సి) హేమలత (బి) అనాబెల్ 4; సోఫీ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (19.5 ఓవర్లలో 7 వికెట్లకు) 175. **వికెట్ల పతనం:** 1-13, 2-19, 3-20, 4-86, 5-88, 6-88, 7-105. **బౌలింగ్:** కిమ్ గార్త్ 4-0-36-5, తనూజ 4-0-29-0, గార్డ్‌నెర్ 4-0-34-0, అనాబెల్ 3.5-0-41-1, స్నేహ్ రాణా 2-0-16-0, మాన్సి 2-0-15-1.

సొంతగడ్డపై భావోద్వేగం...

ఆఖరి మ్యాచ్ ఆడిన సానియా మీర్జా ● హాజరైన ప్రముఖులు



సానియా, యువరాజ్, బోపన్న, బెథానీ సెల్ఫీ



సానియా, తనయుడు ఇజ్‌హాన్

సాక్షి, హైదరాబాద్: టెన్నిస్ ఆటలో తొలి అడగులు వేసిన స్వస్థలం హైదరాబాద్‌లో భారత దిగ్గజం సానియా మీర్జా అభిమానుల కోసం చివరిసారిగా రాకెట్ పట్టింది. అంతర్జాతీయ సర్క్యూట్‌లో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనకు భాగస్వాములుగా వ్యవహరించిన బెథానీ మాటెక్ సాండ్స్ (అమెరికా), కారా బ్లాక్ (జింబాబ్వే), ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా), రోహన్ బోపన్న (భారత్)లతో కలిసి సానియా ఎల్బీ టెన్నిస్ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడింది. తన స్నేహితుడు, భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్, వింబుల్డన్ మాజీ చాంపియన్ మరియన్ బర్తోలి (ఫ్రాన్స్) కూడా కాసేపు రాకెట్ పట్టి సానియాతో కలసి ఆడారు. సానియా మ్యాచ్ తిలకించడానికి వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుత కేంద్ర న్యాయశాఖ మంత్రి, కేంద్ర మాజీ క్రీడల మంత్రి కిరణ్ రిజిజు, తెలంగాణ రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజహరుద్దీన్, రాబిన్ ఉతప్ప, అనన్య బిర్లా, సినీ నటులు దుల్కర్ సల్మాన్, హుమా ఖురేషి, బీసీసీఐ జూనియర్ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ చాముండేశ్వరీనాథ్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సానియా కుటుంబ సభ్యులు ఈ మ్యాచ్‌ను తిలకించారు. మ్యాచ్ ముగిశాక మంత్రి కేటీఆర్ సానియాను సన్మానించారు. 'నా ఆఖరి మ్యాచ్ సొంతగడ్డపై ఆడినందుకు ఆనందంగా ఉంది. ఇది సాధ్యం కావడానికి సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి నా ధన్యవాదాలు. ఎల్బీ స్టేడియంతో నాకెంతో అనుబంధం ఉంది. ఇక్కడితో టెన్నిస్ ఆడటం మానేస్తున్నా. అయితే భవిష్యత్‌లో ఈ ఆటతో మాత్రం కొనసాగుతా. నా వీడ్కోలు మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన వారందరికీ ధన్యవాదాలు. నేను ఇంత భావోద్వేగానికి గురవుతానని అనుకోలేదు. ఇవీ ఆనందభాష్పాలే. ఈ స్థాయిలో వీడ్కోలు లభిస్తుందని ఆశించలేదు. భవిష్యత్‌లో మరింత మంది సానియా మీర్జాలు వస్తారని ఆకాంక్షిస్తున్నాను' అని గత నెలలో దుబాయ్ ఓపెన్‌తో అంతర్జాతీయ టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పిన 36 ఏళ్ల సానియా వ్యాఖ్యానించింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ముంబై ఇండియన్స్ X బెంగళూరు
రాత్రి గం. 7:30 నుంచి
స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇరానీ కప్ విజేత రెస్ట్ ఆఫ్ ఇండియా

గ్వాలియర్: ఆద్యంతం ఆధిపత్యం చాటుకున్న రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు 30వ సారి ఇరానీ కప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టుతో ఆదివారం ముగిసిన ఐదు రోజుల ఫైనల్లో మయాంక్ అగర్వాల్ కెప్టెన్సీలోని రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు 238 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 437 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 58.4 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 81/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ ఆట చివరిరోజు మరో 117 పరుగులు జోడించి మిగతా ఎనిమిది వికెట్లు కోల్పోయింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో సౌరభ్ కుమార్ మూడు వికెట్లు తీయగా... ముకేశ్ కుమార్, అతీత్, పుల్కిత్ నారంగ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

షఫాలీ, లానింగ్ ధనాధన్

- ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ల మెరుపులు
- 60 పరుగులతో బెంగళూరు ఓటమి
- డబ్ల్యూపీఎల్ టోర్నీ



షఫాలీ
మెగ్ లానింగ్
తారా నోరిస్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో పరుగుల హోరెత్తుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 200 పైచిలుకు పరుగులు నమోదయ్యాయి. ఢిల్లీక్యాపిటల్స్ ఓపెనర్లు షఫాలీ వర్మ (45 బంతుల్లో 84; 10 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ మెగ్ లానింగ్ (43 బంతుల్లో 72; 14 ఫోర్లు) చెలరేగారు. బౌలింగ్‌లో తారా నోరిస్ (5/29) నిప్పులు చెరగడంతో ఢిల్లీ 60 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై జయభేరి మోగించింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో మొదట ఢిల్లీ 20 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి 223 పరుగుల భారీస్కోరు చేసింది. మహిళల టి20 క్రికెట్‌లో ఇది రెండో అత్యధిక స్కోరు కావడం విశేషం. ఓపెనర్లు లానింగ్, షఫాలీ తొలి వికెట్‌కు 162 పరుగులు జోడించారు. షఫాలీ 31 బంతుల్లో (5 ఫోర్లు, 3 సిక్స్‌లు)... లానింగ్ 30 బంతుల్లో (10 ఫోర్లు) అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఆఖర్లో మరిజన్ కాప్ (17 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), జెమీమా (15 బంతుల్లో 22 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడారు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 163 పరుగులే చేయగలిగింది. కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన (23 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలీస్ పెర్రీ (19 బంతుల్లో 31; 5 ఫోర్లు), హీథెర్‌నైట్ (21 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుగ్గా ఆడారు. తారా నోరిస్ 5, అలైస్ క్యాప్సీ 2 వికెట్లు తీశారు.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (బి) హీథెర్‌నైట్ 72; షఫాలీ (సి) రిచా (బి) హీథెర్‌నైట్ 84; మరిజన్ కాప్ (నాటౌట్) 39; జెమీమా (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20 ఓవర్లలో 2 వికెట్లకు) 223. **వికెట్ల పతనం:** 1-162, 2-163. **బౌలింగ్:** రేణుక సింగ్ 3-0-24-0, మేగన్ 4-0-45-0, ప్రీతి 4-0-35-0, పెర్రీ 3-0-29-0, సోఫీ డివైన్ 1-0-20-0, శోభన 2-0-29-0, హీథెర్‌నైట్ 3-0-40-2.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) శిఖా (బి) క్యాప్సీ 35; సోఫీ డివైన్ (సి) షఫాలీ (బి) క్యాప్సీ 14; పెర్రీ (బి) నోరిస్ 31; దిశ (సి) క్యాప్సీ (బి) నోరిస్ 9; రిచా (సి) రాధ (బి) నోరిస్ 2; హీథెర్‌నైట్ (సి) లానింగ్ (బి) నోరిస్ 34; కనిక (సి) షఫాలీ (బి) నోరిస్ 0; శోభన (సి) రాధ (బి) శిఖా 2; మేగన్ (నాటౌట్) 30; ప్రీతి బోస్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 163. **వికెట్ల పతనం:** 1-41, 2-56, 3-89, 4-90, 5-93, 6-93, 7-96, 8-150. **బౌలింగ్:** శిఖా పాండే 4-0-35-1, మరిజన్ కాప్ 4-0-36-0, జొనసెన్ 4-0-28-0, అలైస్ క్యాప్సీ 2-0-10-2, రాధ యాదవ్ 2-0-24-0, తారా నోరిస్ 4-0-29-5.

పీవీఎల్ చాంప్ అహ్మదాబాద్ డిఫెండర్స్

కొచ్చి: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) రెండో సీజన్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 15-7, 15-10, 18-20, 13-15, 15-10తో బెంగళూరు టోర్పిడోస్ జట్టుపై గెలిచింది. అహ్మదాబాద్ తరఫున అంగముత్తు రామస్వామి 16 పాయింట్లు, సంతోష్ 11 పాయింట్లు స్కోరు చేశారు. బెంగళూరు తరఫున పంకజ్ శర్మ 11 పాయింట్లు, ముజీబ్ తొమ్మిది పాయింట్లు సాధించారు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

● గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బీఎస్ఎఫ్‌లో 1284 ట్రేడ్స్‌మ్యాన్ పోస్టులు

భారత కేంద్ర హోంమంత్రిత్వ శాఖలో భాగంగా ఉన్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్).. కానిస్టేబుల్(ట్రేడ్స్‌మ్యాన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1284 » **పోస్టుల వివరాలు:** పురుషులు-1220, మహిళలు-64.
» **విభాగాలు:** కోబ్లర్, టైలర్, వాషర్‌మెన్, బార్బర్, స్వీపర్, కుక్, వెయిటర్ తదితరాలు.
» **అర్హత:** మెట్రిక్యులేషన్/పదో తరగతి/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. కొన్ని ట్రేడుల్లో ఎన్ఎస్ క్యూఎఫ్ లెవల్ 1 కోర్సు పూర్తిచేయాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు. రాతపరీక్షలో భాగంగా 100 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులకు ట్రేడ్ టెస్ట్ కూడా నిర్వహిస్తారు. ఇందులోనూ అర్హత సాధించాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.03.2023.
» **వెబ్‌సైట్:** rectt.bsf.gov.in

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీలో ఎనిమిదో తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)లో జనవరి-2024 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2024 జనవరి నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. **వయసు:** 01.01.2024 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా.. పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. 02.01.2011 నుంచి 01.07.2012 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వాయిస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్షా విధానం:** రాతపరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. అవి.. మ్యాథమేటిక్స్(200 మార్కులు), జనరల్ నాలెడ్జ్(75 మార్కులు), ఇంగ్లిష్(125 మార్కులు)నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైవా వాయిస్(50 మార్కులు) నిర్వహిస్తారు. రాతపరీక్ష, వైవా వాయిస్ కలిపి మొత్తం 450 మార్కులు కేటాయించారు. దీనిలో కనీస ఉత్తీర్ణత మార్కులు 50% ఉండాలి. ఈ రెండింటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు చివరిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఆర్ఐఎంసీ పంపిన దరఖాస్తు ఫారం నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఏపీపీఎస్సీ చిరునామకు పంపించాలి.
» **పరీక్షా కేంద్రం:** హైదరాబాద్‌లో మాత్రమే.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.
» **పరీక్ష తేది:** 03.06.2023.
» **వెబ్‌సైట్:** psc.ap.gov.in

మహాత్మా జ్యోతిబాపులే ఆర్‌జేసీ/ఆర్‌డీసీ సెట్-2023

మహాత్మాజ్యోతిబాపులే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)..రాష్ట్రంలోని వివిధ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రవేశ పరీక్ష ఆధారంగా ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి ఏడాదిలో ప్రవేశాలు కల్పిస్తారు.

» **జూనియర్ కళాశాలలు(ఇంగ్లిష్ మీడియం):** మొత్తం-255(బాలురు-130, బాలికలు-125). **ఇంటర్ గ్రూపులు(ఇంగ్లిష్ మీడియం):** ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ఇతర వృత్తి విద్యా కోర్సులు. **అర్హత:** పదో తరగతి/ఎస్ఎస్‌సీ చదువుతున్న అర్హులు.
» **మహిళా డిగ్రీ కళాశాలలు:**14(ఇంగ్లిష్ మీడియం) మహిళలు-06, పురుషులు-08. **అర్హత:** ఇంటర్ సెకండియర్ చదువుతున్నవారు అర్హులు.

కళాశాలలు అందిస్తున్న డిగ్రీ కోర్సులు

» **బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్:** ఎంపీసీ, ఎంసీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్ఏఐ అండ్ ఎంఎల్, ఎంపీజీ,ఎంఈఎస్ అండ్ ఎంఈసీఎస్.
» **బీఎస్సీ లైఫ్ సైన్సెస్:** బీజెడ్‌సీ, బీజెడ్‌జీ, బీబీసీసీ, బీటీబీసీసీ, బీటీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, ఎస్‌జెడ్‌సీ అండ్ ఏఎస్‌పీహెచ్‌బీసీ.
» **బీకామ్:** జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అనలిటిక్స్. » **బీఏ:**ఈపీహెచ్,హెచ్‌పీఈ,ఐఆర్‌ఈపీ,పీపీజీఈపీ. » బీబీఏ, బీఎఫ్‌టీ.
» **ఎంపిక విధానం:** ప్రవేశపరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.04.2023.
» **హాల్‌టికెట్లు డౌన్‌లోడింగ్ తేది:** 20.04.2023.
» **ప్రవేశపరీక్ష తేది:** 29.04.2023.
» **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

'నెస్ట్'.. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీకి బెస్ట్!



నెస్ట్-2023

» నెస్ట్ స్కోర్ ఆధారంగా నైసర్, సీఈబీఎస్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ
» ఇంటర్మీడియెట్ సైన్స్ గ్రూప్ విద్యార్థులు అర్హులుగా నెస్ట్
» ప్రవేశం పొందితే అయిదేళ్లపాటు స్కాలర్‌షిప్, ఇతర ప్రోత్సాహకాలు
» పరిశోధనల దిశగా అడుగులు వేసే మార్గం

నెస్ట్.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్! ఈ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపితే.. ఇంటర్ పూర్తి చేస్తూనే.. నేరుగా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో అడుగు పెట్టొచ్చు! అది కూడా దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్‌లుగా గుర్తింపు పొందిన.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్), యూనివర్సిటీ ఆఫ్ ముంబై - డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్‌లో అడ్మిషన్ లభిస్తుంది. ఇటీవల నెస్ట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నెస్ట్ వివరాలు, ప్రవేశాలు కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూట్స్ ప్రాధాన్యత, అకడమిక్‌గా లభించే అవకాశాలు, ప్రోత్సాహకాలు, నెస్ట్‌లో విజయానికి ప్రిపరేషన్ విధానం...

దేశంలో సైన్స్ విద్య, పరిశోధనలో పేరున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)-భువనేశ్వర్,అదే విధంగా ముంబై యూనివర్సిటీలో అణు శక్తి విభాగం నెలకొల్పిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(సీఈబీఎస్) ఇన్‌స్టిట్యూట్స్‌లోని ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశం కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఎంట్రన్స్.. నెస్ట్.

అర్హతలు

- సైన్స్ గ్రూప్‌లతో 2021, 2022 సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ● 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** ఆగస్ట్ 1, 2003 తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగులకు గరిష్ఠ వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

మొత్తం 257 సీట్లు

- నెస్ట్ స్కోర్ ఆధారంగా.. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ప్రవేశం కల్పించే నైసర్ -భువనేశ్వర్, సీఈబీఎస్‌లలో మొత్తం 257 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నైసర్ భువనేశ్వర్‌లో 200, సీఈబీఎస్‌లో 57 సీట్లు ఉన్నాయి.
- నైసర్-భువనేశ్వర్‌లో బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ విభాగాల్లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బోధిస్తున్నారు. ●సీఈబీఎస్‌లోనూ ఇవే సబ్జెక్ట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ అందుబాటులో ఉంది.
- నెస్ట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం ఖరారు చేసుకున్న అభ్యర్థులు.. తమ అకడమిక్ అర్హతలకు అనుగుణంగా ఏదో ఒక సబ్జెక్ట్‌లో పీజీ ఎంచుకోవచ్చు. ● మేజర్ సబ్జెక్ట్‌తోపాటు బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ వంటి సబ్జెక్ట్‌లను మైనర్ సబ్జెక్ట్‌లుగా ఎంచుకునే అవకాశం ఉంటుంది.
- నెస్ట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులు రెండు ఇన్‌స్టిట్యూట్స్‌కు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నాలుగు విభాగాలు.. 200 మార్కులు

- నెస్ట్ నాలుగు విభాగాలుగా(బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్) 200 మార్కులకు ఉంటుంది. ప్రతి విభాగానికి 50 మార్కులు కేటాయించారు. అదే విధంగా.. ప్రతి విభాగంలో 17 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 12 ప్రశ్నలు ఎంసీక్యూలుగా, అయిదు ప్రశ్నలు మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు ఉంటాయి.
- మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు 2.5 మార్కులు చొప్పున,మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్ టైప్ కొశ్చన్స్‌కు నాలుగు మార్కులు చొప్పున కేటాయిస్తారు.
- ఇలా ప్రతి సెక్షన్‌లో 17 ప్రశ్నలతో 50 మార్కులు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- మొత్తం రెండు సెషన్లుగా పరీక్షను నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏదో ఒక సెషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.
- నాలుగు సెక్షన్లలో మూడు సెక్షన్లు ఎంచుకునే అవకాశం ఉంది. నాలుగు సెక్షన్లు కూడా రాయొచ్చు.
- మెరిట్ లిస్ట్ రూపకల్పనలో.. నాలుగు సెక్షన్లలో అత్యధిక మార్కులు పొందిన మూడు సెక్షన్లనే పరిగణనలోకి తీసుకుని అందులో పొందిన మార్కులను గణించి మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు.
- ప్రతి సెక్షన్‌లోనూ కొన్ని ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. ● కొన్ని ప్రశ్నలు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలతో ఉంటాయి.
- నెస్ట్‌లో స్కోర్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించే క్రమంలో.. ప్రతి సెక్షన్‌లోనూ అభ్యర్థులు పొందాల్సిన కనీస అర్హత మార్కులను నిర్దేశించారు.

ఓవరాల్ కటాఫ్ నిబంధన

- నెస్ట్ స్కోర్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపకల్పనలో సెక్షన్‌వారీగా కనీస అర్హత మార్కుల నిబంధన మాత్రమే కాకుండా.. మినిమమ్ అడ్మిషబుల్ పర్సంటైల్ పేరుతో ఓవరాల్ కటాఫ్‌ను కూడా నిర్దేశిస్తున్నారు.
- జనరల్ కేటగిరీ అభ్యర్థులు 95 పర్సంటైల్, ఓబీసీ అభ్యర్థులు 90 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీ అభ్యర్థులు 75 పర్సంటైల్ సాధించాల్సి ఉంటుంది.

సీటు సాధిస్తే.. స్కాలర్‌షిప్

- నెస్ట్ స్కోర్ ఆధారంగా.. నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులకు అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ వ్యవధిలో.. స్కాలర్‌షిప్, ఇంటర్న్‌షిప్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం కూడా అందిస్తారు.
- ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్ పేరిట నెలకు రూ.అయిదు వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు స్కాలర్‌షిప్ అందిస్తారు.
- ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌నకు అర్హత పొందని వారికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రవేశ పెట్టిన దిశ ప్రోగ్రామ్ ద్వారా నెలకు రూ.5000 స్కాలర్‌షిప్ లభిస్తుంది.
- ప్రతి ఏటా సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసేందుకు రూ.20 వేలు గ్రాంట్ మంజూరు చేస్తారు.

నెస్ట్‌తో మరిన్ని ప్రయోజనాలు

- నైసర్-భువనేశ్వర్, యూనివర్సిటీ ఆఫ్ ముంబై -డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ పూర్తి చేసిన వారికి పీహెచ్‌డీ ప్రవేశాల్లోనూ ప్రాధాన్యత ఉంటుంది.
- ఈ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి భవిష్యత్తులో రీసెర్చ్ ల్యాబ్స్‌లో, సంస్థల ఆర్ అండ్ డీ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- భవిష్యత్తులో పీహెచ్‌డీ పట్టా అందుకుని యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీగా, ప్రముఖ రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్ట్‌లుగా రూ.లక్షల వేతనంతో కెరీర్ సొంతం చేసుకోవచ్చు.

పరిశోధనలకు మార్గం

- నెస్ట్ ద్వారా ప్రవేశం ప్రవేశం పొందిన విద్యార్థులు.. ఐదేళ్ల వ్యవధిలో పది సెమిస్టర్లుగా ఉండే ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- ఈ పది సెమిస్టర్లలోనూ.. ఆరు సెమిస్టర్లలో సదరు క్యాంపస్‌లోని ఫ్యాకల్టీ సభ్యులు చేస్తున్న రీసెర్చ్‌లో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుంది. దీని ఆధారంగానూ అభ్యర్థులకు మార్కులు, క్రెడిట్స్ కేటాయిస్తారు. ఇలాంటి నిబంధన నేపథ్యంలో విద్యార్థులకు పీజీ స్థాయిలోనే రీసెర్చ్ దిశగా ఆసక్తిని పెంచుకునే అవకాశం, రీసెర్చ్ కార్యకలాపాలపై అవగాహన లభిస్తాయి.

బార్క్‌లో.. పీహెచ్‌డీ!

నెస్ట్ స్కోర్‌తో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో సీటు ఖరారు చేసుకున్న వారికి భవిష్యత్తులో కలిసొచ్చే మరో అంశం.. ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థ బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ ట్రైనింగ్ స్కూల్‌లో ప్రవేశానికి నేరుగా ఇంటర్వ్యూకి హాజరయ్యే అవకాశం కల్పించడం. ఇందుకోసం విద్యార్థులు ఎమ్మెస్సీ కోర్సును నిర్దిష్ట మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ మార్కులను ప్రతి ఏటా బార్క్ నిర్దేశిస్తుంది.

నెస్ట్‌లో విజయం సాధించాలంటే

- నెస్ట్‌లో విజయం సాధించాలంటే.. విద్యార్థులు ప్రధానంగా ఇంటర్మీడియెట్ స్థాయిలో తాము చదివిన అకడమిక్స్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలి.
- ప్రధానంగా..బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించి అడిగే ప్రశ్నలు..విద్యార్థుల్లోని విశ్లేషణాత్మక దృక్పథం, సంగ్రహణ సామర్థ్యం, తులనాత్మక విశ్లేషణను గుర్తించేలా ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించడంతోపాటు వాటిని వాస్తవ పరిస్థితుల్లో అన్వయించగలిగే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందుకోసం చదువుతున్న అంశాలను ప్రాక్టీస్ చేయడం ఎంతో లాభిస్తుంది.
- నెస్ట్ ఎంట్రన్స్.. విభాగాల వారీగా గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే.. ప్రశ్నలు సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా అడుగుతున్నట్లు తెలుస్తోంది. కాబట్టి అభ్యర్థులు పది, పదకొండు, పన్నెండు తరగతుల సీబీఎస్ఈ పుస్తకాలను ఔపోసన పట్టడం మేలు చేస్తుంది. ముఖ్యంగా కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి.
- ఇలా అకడమిక్ సబ్జెక్ట్‌లపై కాన్సెప్ట్‌లతోపాటు అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్ సాగిస్తే నెస్ట్‌లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.
- జేఈఈ-మెయిన్, జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు అదే ప్రిపరేషన్‌తో నెస్ట్‌కు కూడా హాజరై ప్రతిభ చూపే అవకాశం ఉంది.

నెస్ట్-2023 ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 17.05.2023
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 12.06.2023
- నెస్ట్-2023 పరీక్ష తేది: 24.06.2023
- ఫలితాల వెల్లడి: 10.07.2023
- వెబ్‌సైట్: www.nestexam.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
6-3-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
900	272
59,809	17,594

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	11,689	▲	226
డోజోన్స్	33,391	▲	387
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,947	▲	3
డాక్స్	15,578	▲	251
షాంఘై	3,328	▲	18
నికాయ్	27,927	▲	429

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.59	83.26
£	బ్రిటన్ పౌండ్	96.96	100.27
€	యూరో	85.86	88.94
¥	జపాన్ ఎన్ (100)	59.36	61.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.45	56.80
S$	సింగపూర్ డాలర్	60.21	62.15
SAR	సౌదీ రియాల్	20.86	22.53
UAE D	యూఏఈ దిర్హామ్	21.42	23.21
¥	చైనా యువాన్	10.75	12.82

ఈపీఎఫ్‌వో అధిక పెన్షన్.. అంత ఈజీ కాదు!?



- వాస్తవ వేతనం ఆధారంగా పెన్షన్ నిధికి జమ
- ఇది కోరుకుంటే ఆప్షన్ ఇవ్వాలి
- అప్పుడు గత కాలం బ్యాలన్స్ చెల్లించాలి
- అది ఎలా అన్నదానిపై స్పష్టత లేదు
- పెన్షన్ లెక్కింపునూ తేల్చని ఈపీఎఫ్‌వో
- 15 ఏళ్ల సర్వీస్ ఉంటే అధిక పెన్షన్



సుదీర్ఘ పోరాటం తర్వాత వేతన జీవుల ఆకాంక్ష అయిన అధిక పెన్షన్ కల సాకారమైంది. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) పరిధిలోని ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్ 95) కింద అధిక పెన్షన్‌కు అర్హత లభించింది. 2014 సెప్టెంబర్ 1 నాటికి ఈపీఎస్ సభ్యులుగా ఉన్నవారు, అంతకుముందు రిటైర్మెంట్ తీసుకున్న వారు, తమకు అధిక పెన్షన్ కావాలంటూ ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. ఇందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. దరఖాస్తు చేసుకోవచ్చంటూ ఈపీఎఫ్‌వో ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగి తన సంస్థ తరఫున ఉమ్మడి దరఖాస్తు పత్రాన్ని ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అధిక పెన్షన్ కావాలంటూ ఆప్షన్ ఇవ్వాలా? వద్దా..? ఎవరు అర్హులు? తదితర అంశాలపై వేతన జీవుల్లో ఎన్నో సందేహాలు నెలకొనగా.. దీన్ని ఎలా అమలు చేయాలి? అనే విషయమై ఈపీఎఫ్‌వోలోనూ స్పష్టత కొరవడింది. ఈ నేపథ్యంలో దీనిపై ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న వివరాలతో ప్రత్యేక కథనమిది...

ప్రతి నెలా అధికంగా కోత..

అధిక పెన్షన్ ఆప్షన్ ఎంపిక చేసుకుంటే అది 2014 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు అవుతుంది. కనుక సర్వీసులో ఉన్న వారు నాటి నుంచి నేటి వరకు అధిక పెన్షన్ కోసం అదనపు నిధిని జమ చేయాల్సి ఉంటుంది. దీన్ని భవిష్యనిధి నుంచి మళ్లించడానికి ప్రస్తుత నిబంధనలు ఒప్పుకోవడం లేదు. గత కాలానికి సంబంధించిన ఈపీఎస్ బకాయి కనుక, అది సంస్థ (ఎంప్లాయర్) సర్దుబాటు చేయాలా? లేదంటే ఉద్యోగి జమ చేయాలా? దీనిపైనా స్పష్టత లేదు. ప్రస్తుత ఫార్ములా ప్రకారం రూ.15,000 వేతనంపై 12 శాతం (రూ.1,800) ఉద్యోగి వేతనం నుంచి మినహాయించి ఈపీఎఫ్‌కు జమ చేస్తున్నారు. ఉద్యోగి తరఫున సంస్థ కూడా 12 శాతం చొప్పున రూ.1800 జమ చేస్తోంది. కాకపోతే సంస్థ సమకూర్చే వాటాలో 8.33 శాతం (రూ.1,250) ఈపీఎస్‌కు వెళుతోంది. మిగిలినది (రూ.550) ఈపీఎఫ్ ఖాతాకు జమ అవుతోంది. అధిక పింఛను ఆప్షన్ ఇస్తే ఇక మీదట వాస్తవ వేతనం (బేసిక్, డీఏ)పై 12 శాతం అమలవుతుంది. అలాంటప్పుడు ఉద్యోగితో పాటు సంస్థలు కూడా అదనపు భారం మోయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఏ అనే ఉద్యోగికి ప్రస్తుతం మూల వేతనం, డీఏ కలిపి రూ.30,000 ఉందని అనుకుందాం. అయినా కానీ, రూ.15,000 గరిష్ట వేతన పరిమితి ఆధారంగా ప్రతి నెలా రూ.1800 మొత్తాన్ని మినహాయించే వారు. సంస్థ కూడా తన వంతుగా రూ.1800 జమ చేసేది. కానీ, ఇకపై రూ.30 వేలకు 12 శాతం అంటే రూ.3,600 ప్రతి నెలా ఉద్యోగి వాటా నుంచి కోత పడుతుంది. దీనికి సంస్థ కూడా అంతే మొత్తం జమ చేయాల్సి వస్తుంది. దీనివల్ల కంపెనీలపైనా భారం పడుతుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం గరిష్టంగా రూ.15,000 వేతనంపైనే సంస్థ చందా పరిమితమై ఉంది. కనుక ఇంతకు మించి సంస్థలు ఎందుకు చెల్లిస్తాయి? వీటన్నింటిపై స్పష్టత ఇవ్వకుండానే ఈపీఎఫ్‌వో దరఖాస్తు చేసుకోవాలని కోరింది.

దేనికైనా కట్టుబడి ఉండాలి?

ఈపీఎస్ 95 కింద పెన్షన్ లెక్కింపు అనేది పెన్షన్ సర్వీస్, బేసిక్ వేతనంపై ఆధారపడి ఉంటుంది. ఈపీఎస్ 95 పథకం 1995 నవంబర్ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం హామీగా ఉంటుంది. ఆరంభంలో రూ.5,000 బేసిక్ శాలరీ పరిమితి విధించారు. 2001 జూన్ నుంచి రూ.6,500 చేశారు. ఆ తర్వాత 2014 సెప్టెంబర్ నుంచి రూ.15,000కు పెంచారు. ఇంతకంటే అధిక వేతం తీసుకుంటున్నా.. ఈపీఎస్‌కు అధికంగా జమ చేసే అవకాశం లేక రిటైర్మెంట్ తర్వాత తక్కువ పెన్షన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఇప్పటి వరకు ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రూ.15,000 పరిమితి తొలగిపోయింది. రిటైర్మెంట్‌కు ముందు చివరి ఐదేళ్ల కాలంలో ఉన్న సగటు బేసిక్ వేతనం ఆధారంగా పెన్షన్ అందుకోవడానికి అర్హులు అవుతారు. సుప్రీంకోర్టు ఆదేశాలను యథాతథంగా అమలు చేస్తే ఎక్కువ సర్వీస్ ఉండి.. అధిక మూల వేతనం, డీఏ కలిగిన వారికి ఎక్కువ పెన్షన్ రిటైర్మెంట్ తర్వాత వస్తుంది. కానీ, ఈపీఎఫ్‌వో వైపు నుంచి పారదర్శకత లోపించింది. ఎంత పెన్షన్ ఇస్తారో చెప్పకుండా, ఈపీఎఫ్‌వో నిర్ణయించిన సూత్రం మేరకు పెన్షన్ తీసుకునేందుకు సమ్మతమేనంటూ అంగీకారం తెలియజేయాలని ఆన్‌లైన్ దరఖాస్తులో షరతు విధించినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పథకంలో చేసే మార్పులకు అంగీకారం తెలపాలని కూడా కోరుతోంది. అధిక పెన్షన్ ఆప్షన్ ఇచ్చినా, తనపై చెల్లింపుల భారం పడకుండా ఈపీఎఫ్‌వో చూస్తున్నట్టు అర్థమవుతోంది. పైగా 2014 నాటి నిబంధనల సవరణ తర్వాత వాస్తవ వేతనంపై జమలు చేస్తున్న వారు సైతం ఇప్పుడు అధిక పెన్షన్ పొందాలంటే.. నాడు ఈపీఎఫ్‌వో నుంచి ఉద్యోగి, సంస్థ ఉమ్మడిగా తీసుకున్న అనుమతి పత్రాన్ని సమర్పించాలని ఈపీఎఫ్‌వో నిబంధన విధించింది. ఇంతకాలం అధిక చందాలను అనుమతిస్తూ, ఇప్పుడు అనుమతి ఉండాలని కోరడమే విడ్డూరంగా ఉంది.

అంత పింఛను ఎవరు చెల్లించాలి?

ఉదాహరణకు కిరణ్ అనే వ్యక్తి 1996 ఏప్రిల్ 1న ఉద్యోగంలో చేరాడని అనుకుందాం. నాడు అతడి బేసిక్ వేతనం రూ.5,000. నాటి నుంచి ఏటా 7.5 శాతం చొప్పున పెరుగుతూ వచ్చిందని భావిస్తే.. అతడు అధిక పెన్షన్ ఆప్షన్ ఎంపిక చేసుకోకపోతే, 2031 నాటికి 35 ఏళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం, అతడికి ప్రతి నెలా రూ.7,929 పెన్షన్ వస్తుంది. ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కిరణ్ ఒకవేళ అధిక పెన్షన్ ఆప్షన్ ఇస్తే అతడికి 2031 తర్వాత నుంచి ప్రతి నెలా వచ్చే పింఛను రూ.26,879కి పెరుగుతుంది. దీనికోసం ఇప్పుడు రూ.9.74 లక్షలు జమ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తంపై వచ్చే రాబడి రేటు 23.4 శాతం. ఇంత రాబడి అంటే అది కచ్చితంగా ఉద్యోగులకు లాభించేదే. కానీ, అది ఈపీఎఫ్ నిధిపై ఇది గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. అందుకుని ఈపీఎఫ్‌వో ప్రత్యామ్నాయ ఫార్ములా కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తోంది.

సర్వీస్ కాలం..

అదనపు పెన్షన్ కోరుకునే వారు ఎంత అదనపు మొత్తం ఇప్పుడు జమ చేయాలన్నది ఆసక్తికరంగా మారింది. నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ నాటికి ఈపీఎస్ పథకం కింద పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే పెన్షన్‌కు అర్హత లభిస్తుంది. ఈపీఎస్ కింద సర్వీస్ ఎంత ఎక్కువ కాలం ఉంటే అంత అధికంగా పెన్షన్ అందుకోగలరు. అధిక పెన్షన్ ఆప్షన్ ఇవ్వాలా? వద్దా? అనేదానికి కూడా ఇదే ప్రామాణికం అవుతుంది. ఈపీఎస్ 95 కింద 20 ఏళ్లకు పైగా సర్వీస్ ఉన్న వారు అధిక పెన్షన్ ఆప్షన్‌తో ఎక్కువగా ప్రయోజనం పొందుతారన్నది ప్రాథమిక అంచనా.

పెట్టుబడి వారసులకు రాదు..



ఈపీఎస్ సభ్యుడు, అతని జీవిత భాగస్వామి, వారి మరణానంతరం వైకల్యంతో ఉన్న 25 ఏళ్లకు మించని పిల్లల వరకు పెన్షన్ వస్తుంది. వీరి తదనంతరం పింఛను నిధి వారసులకు చెల్లించరు. దీంతో దీన్ని మంచి సాధనం కాదని చాలా మంది అనుకుంటారు. ప్రైవేటు లైఫ్ ఇన్సూరెన్స్ యాన్యుటీ ప్లాన్‌లో చివర్లో పెట్టుబడి తిరిగిచ్చే ప్లాన్‌లో గరిష్ట రాబడి 6.87 శాతంగా ఉంటే.. పెట్టుబడి తిరిగి ఇవ్వని (ఈపీఎస్ మాదిరి) ఆప్షన్‌లో రాబడి 8.6 శాతంగా ఉంది. ఇంతకంటే అధిక రాబడిని, ప్రభుత్వ హామీతో ఇచ్చే ఏదైనా సాధనం ఉందంటే.. నిస్సందేహంగా దానికి వెళ్లొచ్చు. ఈపీఎస్‌లో కనీసం 15 ఏళ్ల సర్వీస్ ఉన్న వారికి సైతం ఇంతకంటే అధిక రాబడే వస్తుంది. రిటైర్మెంట్ తర్వాత ఎక్కువ కాలం జీవించి లేని సందర్భాల్లో పెన్షన్ ఫండ్‌ను తిరిగిచ్చే ప్లాన్ మెరుగైనది అవుతుంది. కానీ, రిటైర్మెంట్ తర్వాత ఎంత కాలం జీవించి ఉంటామన్నది ఎవరికీ తెలియదు.

ప్రత్యామ్నాయం ఎన్‌పీఎస్

అధిక పింఛను ఆప్షన్‌కు ఈపీఎఫ్‌వో దరఖాస్తు తీసుకుంటున్నప్పటికీ.. అందులో పారదర్శకత లేదు. అధిక పింఛను అంటే ఎంత చెల్లిస్తామనే స్పష్టత లేదు. అన్నింటికీ కట్టుబడి ఉంటాము, షరతులకు అంగీకరిస్తాము? అన్న అంగీకారాన్ని తీసుకుంటోంది. కనుక రిటైర్మెంట్ తర్వాత మెరుగైన పింఛను కోరుకునే వారు ఈపీఎస్‌నే నమ్ముకోవాలనేమీ లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్), ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. పన్ను ప్రయోజనంతో కూడిన రాబడి కోరుకునే వారికి ఎన్‌పీఎస్ మెరుగైనది. రిటైర్మెంట్ తర్వాత ఎన్‌పీఎస్ కింద సమకూరిన మొత్తం నిధిలో 60 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. దీనిపై ఎలాంటి పన్ను ఉండదు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. యాన్యుటీ అనేది పెన్షన్ ప్లాన్. ఇక్కడి నుంచి కనీసం మరో 20 ఏళ్ల సర్వీసు ఉన్న వారు ఎన్‌పీఎస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

- 1980 జనవరి 1న జన్మించిన వారు ఎన్‌పీఎస్‌ను ఎంపిక చేసుకుని ప్రతి నెలా రూ.2,000 చొప్పున, ఇక్కడి నుంచి మరో 17 ఏళ్లపాటు అంటే 60 ఏళ్ల వరకు ఇన్వెస్ట్ చేస్తే.. 10 శాతం రాబడి ప్రకారం రూ.10.7 లక్షలు సమకూరుతాయి. 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే 6 శాతం రాబడి రేటు ప్రకారం 2147 పెన్షన్‌గా వస్తుంది. లేదు 100% నిధితో యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే రూ.5,367 పెన్షన్‌గా లభిస్తుంది.
- 1990 జనవరి 1న జన్మించిన వారు ప్రతి నెలా రూ. 2,000ను ఎన్‌పీఎస్‌లో జమ చేసుకుంటే, 60 ఏళ్ల నాటికి 10 శాతం రాబడి రేటు ఆధారంగా రూ.33 లక్షలు సమకూరుతాయి. 40% నిధితో యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే రూ. 16,594గా లభిస్తుంది.

అబాట్ ఇండియా | సెంట్రమ్ బ్రోకింగ్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 20,133 **టార్గెట్:** రూ. 24,450



ఎందుకంటే: హెల్త్‌కేర్ రంగ దిగ్గజం అబాట్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో అంచనాలను మించిన ఫలితాలు ప్రకటించింది. వార్షికంగా అమ్మకాలు 8 శాతం పుంజుకుని రూ. 1,330 కోట్లను తాకాయి. అయితే త్రైమాసిక వారీగా(క్యూ2) 6 శాతం తక్కువ. ప్రధానంగా థెరపీ విభాగంలో జీఐ(జెంటిసిన్), వీఎంఎన్ అమ్మకాలు ఇందుకు దోహదం చేశాయి. కంపెనీకి కీలక బ్రాండ్లు ఉడిలివ్, థైరోనార్మ్, డుఫలాక్ తదితరాలు మెరుగైన అమ్మకాలు సాధించాయి. దీంతో ముడివ్యయాల భారాన్ని విభిన్న ప్రొడక్టులను విడుదల చేయడం ద్వారా బ్యాలన్స్ చేసుకుంది. కాగా.. స్థూల మార్జిన్లు వార్షికంగా 3.17 శాతం, త్రైమాసికవారీగా 1.63 శాతం నీరసించి 43.8 శాతానికి చేరాయి. అయితే ప్రమోషనల్ తదితర వ్యయాలు తగ్గడంతో నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్ల మెరుగుకు సహకరించాయి. వెరసి వార్షికంగా 1.88 శాతం, త్రైమాసికవారీగా 1.03 శాతం బలపడి 24 శాతాన్ని తాకాయి. ఇక నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 17.6 శాతం పుంజుకుని రూ. 320 కోట్లకు చేరింది. నికర లాభం సైతం వార్షికంగా 24 శాతం ఎగసి రూ. 250 కోట్లను తాకింది. అయితే ఇబిటా, నికర లాభం త్రైమాసికవారీగా 7 శాతంస్థాయిలో డీలా పడ్డాయి. కొత్త ప్రొడక్టులు వృద్ధిలో 3 శాతాన్ని ఆక్రమించడంతో భవిష్యత్‌లో ఈ వాటా మరింత ఊపందుకునే వీలుంది. కంపెనీ ఇకపై మరిన్ని బలమైన ప్రొడక్టులను ప్రవేశపెట్టనుండటమే దీనికి కారణం. 2022లో మార్కెట్లో థెరప్యూటిక్ విభాగాలలో 10 కొత్త ప్రొడక్టులను ఆవిష్కరించింది.

మారుతీ సుజుకీ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 8,610 **టార్గెట్:** రూ. 10,700



ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. వార్షికంగా అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నిర్వహణ లాభం(ఇబిటా) 82 శాతం దూసుకెళ్లి రూ. 2,830 కోట్లను తాకింది. అంచనాలకంటే ఇది 8 శాతం అధికంకాగా.. స్థూల మార్జిన్లు 2.6 శాతం బలపడ్డాయి. ఇందుకు పటిష్ట అమ్మకపు ధరలు, విభిన్న ప్రొడక్టుల విడుదల, కరెన్సీ సానుకూల కదలికలు దోహదపడ్డాయి. ఇక ప్రొడక్టులకు తగిన ధరలు లభించడంతో మొత్తం ఆదాయం సైతం 25 శాతం జంప్‌చేసి రూ. 29,040 కోట్లకు చేరింది. ఇది అంచనాలకంటే 2 శాతం అధికం. ఇటీవల ప్రవేశపెట్టిన పలు కొత్త మోడళ్ల నేపథ్యంలో భారీ స్థాయిలో 3.63 లక్షల యూనిట్ల కోసం ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయి. వెరసి రానున్న త్రైమాసికాలలో అమ్మకాల వృద్ధికి పెండింగ్ ఆర్డర్‌బుక్ దారి చూపనుంది. మార్చితో ముగియనున్న ఈ ఏడాది చివరికల్లా ఆదాయం 32 శాతం పుంజుకోగలదని అంచనా. ఈ బాటలో రెండేళ్ల కాలానికి వార్షికంగా 14 శాతం చొప్పున అమ్మకాల్లో వృద్ధి నమోదయ్యే వీలుంది. దీంతో ఇబిటా మార్జిన్లు ఈ ఏడాది 6.5 శాతం నుంచి 9.3 శాతానికి మెరుగుపడనున్నాయి. రెండేళ్లలో అంటే 2025కల్లా 11.3 శాతానికి చేరే అవకాశముంది. ఈ ఏడాది షేరువారీ ఆర్జన(ఈపీఎస్) రూ. 263కు చేరవచ్చని భావిస్తున్నాం. వచ్చే ఏడాది రూ. 380, 2025లో రూ. 428 ఈపీఎస్ సాధించవచ్చని అంచనా. ఆర్థిక మందగమనం, కొత్త ప్రొడక్టులకు అంతంత మాత్రం డిమాండ్ తదితర అంశాలు కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

గోల్డ్ బాండ్ గ్రాము @ రూ. 5,611

నేటి నుంచి కొత్త సావరిన్ గోల్డ్ బాండ్



ముంబై: సావరిన్ గోల్డ్ బాండ్ పథకం 2022–23.. తదుపరి దశలో భాగంగా రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గ్రాముకి రూ. 5,611 ధరను నిర్ణయించింది. ఐదు రోజులపాటు కొనసాగనున్న ఇష్యూ సోమవారం (6న) ప్రారంభంకానుంది. ఈ నెల 10న ముగియనున్న ఇష్యూలో భాగంగా గ్రాముకి ముందస్తు(నామినల్) ధర రూ. 5,611ను ఆర్‌బీఐ నిర్ణయించింది. కాగా.. ఆర్‌బీఐతో సంప్రదింపుల తదుపరి కేంద్ర ప్రభుత్వం గ్రాముకి నామినల్ విలువకు రూ. 50 డిస్కౌంట్‌ను ప్రకటించింది. అయితే ఇందుకు ఇన్వెస్టర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని డిజిటల్ విధానంలో చెల్లింపులు చేపట్టవలసి ఉంటుంది. వెరసి గ్రాము గోల్డ్ బాండ్ ధర రూ. 5,561కు లభించనుంది. ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చేసే సంగతి తెలిసిందే. వీటిని స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్(ఎస్‌హెచ్‌సీఐఎల్), కొన్ని పోస్టాఫీసులు, ఎన్ఎస్ఈ, బీఎస్ఈల ద్వారా విక్రయిస్తారు. వీటి కాలపరిమితి ఎనిమిదేళ్లుకాగా.. ఐదేళ్ల తదుపరి రిడెంప్షన్‌ను అనుమతిస్తారు. ఫిజికల్ గోల్డ్‌కు డిమాండును తగ్గించే బాటలో 2015 నవంబర్‌లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. దేశీ పొదుపు సొమ్మును ఫిజికల్ గోల్డ్‌కు కాకుండా సావరిన్ గోల్డ్ కొనుగోలువైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. పూర్తి స్వచ్ఛత(999)గల బంగారం సగటు ధరను బాండ్లకు నిర్ణయిస్తారు. ఒక గ్రామును ఒక యూనిట్‌గా కేటాయిస్తారు. వ్యక్తిగత ఇన్వెస్టర్లను కనిష్ఠంగా 1 గ్రాము, గరిష్ఠంగా 4 కేజీలవరకూ కొనుగోలుకి అనుమతిస్తారు. హెచ్‌యూఎఫ్‌లకు 4 కేజీలు, ట్రస్ట్‌లకు 20 కేజీల వరకూ యూనిట్ల కొనుగోలుకి వీలుంటుంది.



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

కేవైసీ ఒక్కసారి చేస్తే చాలదా?

ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్ మరణించినట్టయితే అవి నామీనికి బదిలీ అవుతాయి. నామినీ విక్రయ నిబంధనలు ఏమిటి? – విశ్వ ప్రకాశ్

జాయింట్ హోల్డర్ ఉంటే, రెండో వాటాదారునకు అవి బదిలీ అవుతాయి. ఇది అసలు హోల్డర్ లేని సందర్భంగా బదిలీ చేస్తున్నారు కనుక పన్ను వర్తించదు. సంబంధిత యూనిట్లను పొందిన వారు వాటిని విక్రయించినప్పుడు పన్ను చెల్లించాలి. యూనిట్లను ఎంత కాలం ఉంచుకున్నారనే అంశాల ఆధారంగా, స్వల్పకాల, దీర్ఘకాల మూలధన లాభాలపన్ను వర్తిస్తుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అయితే ఏడాది కాలంలోపు విక్రయించినప్పుడు వచ్చే లాభాన్ని, స్వల్పకాల మూలధన లాభాల పన్నుగా పరిగణిస్తారు. ఈ మొత్తంపై 15 శాతం పన్ను పడుతుంది. ఏడాదికి మించిన పెట్టుబడులను విక్రయించినప్పుడు వచ్చే లాభం దీర్ఘకాల మూలధన లాభాల పన్నుగా చట్టం పరిగణిస్తుంది. మొదటి రూ.లక్ష లాభం మినహా మిగిలిన లాభంపై 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈక్విటీయేతర మ్యూచువల్ ఫండ్స్‌లో మూడేళ్ల వరకు పెట్టుబడులపై లాభాన్ని స్వల్పకాల మూలధన లాభంగాను, మూడేళ్లకు మించిన పెట్టుబడులపై లాభాన్ని దీర్ఘకాల మూలధన లాభంగా చూస్తారు. స్వల్పకాల మూలధన లాభం వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను నుంచి ద్రవ్యోల్బణాన్ని మినహాయించి, మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లించాలి. ఒకరి నుంచి వారసత్వంగా లేదంటే నామినీగా వచ్చే పెట్టుబడులను విక్రయించినప్పుడు వాటి అసలు కొనుగోలు తేదీ నుంచి హోల్డింగ్ పీరియడ్ అమలవుతుంది. బదిలీ అయిన తేదీ కాదు. ఉదాహరణకు ఒక ఇన్వెస్టర్ రూ.5 లక్షల విలువైన మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను 2020లో కొనుగోలు చేసి, 2021లో మరణిస్తే,

వివిధ మ్యూచువల్ ఫండ్స్‌కు ఏకీకృత కేవైసీ ప్లాట్‌ఫామ్ ఉందా? – సమీర్ పటేల్

ప్రస్తుతం సెంట్రల్ కేవైసీ అనేది ఉంది. ఇన్వెస్టర్లు వారి కేవైసీ ప్రక్రియను ఒక్కసారి మాత్రమే పూర్తి చేసేందుకు సెంట్రల్ కేవైసీ అవకాశం కల్పిస్తోంది. వేర్వేరు మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసే ప్రతిసారి కేవైసీ ఇవ్వాల్సిన అవసరం దీంతో ఉండదు. పాన్, చిరునామా ధ్రువీకరణను ఇన్వెస్టర్ పంపిణీదారు లేదా సెబీ వద్ద నమోదు అయిన మార్కెట్ ఇంటర్‌మీడియరీ అయిన స్టాక్ బ్రోకర్, డిపాజిటరీ పార్టిసిపెంట్‌కు ఇచ్చినా.. తాజా సమాచారం సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో అప్‌డేట్ అవుతుంది.

హోండా కార్స్ నుంచి న్యూ సిటీ

న్యూఢిల్లీ: హోండా కార్స్ ఇండియా తాజాగా న్యూ సిటీ (పెట్రోల్), న్యూ సిటీ ఈ:హెచ్‌ఈవీ పేరిట రెండు కొత్త మోడల్స్‌ను దేశీ మార్కెట్లో ఆవిష్కరించింది. భద్రత, కనెక్టివిటీ, సౌకర్యాలకు సంబంధించి వీటిలో అదనపు ఫీచర్స్‌ను జోడించినట్లు కంపెనీ తెలిపింది. న్యూ సిటీ (ఐ-వీటెక్) ధర రూ. 11.49 లక్షల నుంచి రూ. 14.72 లక్షల వరకూ ఉంటుంది. న్యూ సిటీ (ఈ–హెచ్‌ఈవీ) ధర రూ. 18.89 లక్షల నుంచి రూ. 20.39 లక్షల వరకూ ఉంటుంది. పెట్రోల్ వేరియంట్లు లీటరుకు 17.8 నుంచి 18.4 కిలోమీటర్ల వరకూ మైలేజీ ఇస్తాయి. న్యూ సిటీలో అధునాతన 20.3 సెం.మీ. టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే ఆడియో, వన్ టచ్ ఎలక్ట్రిక్ సన్ రూఫ్, అలాగే 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హోండా లేన్ వాచ్, యాంటీ థెఫ్ట్ అలారం తదితర ఫీచర్లు ఉంటాయి. రెండు మోడల్స్‌లోనూ 3 ఏళ్ల అపరిమిత కిలోమీటర్ల వారంటీ లభిస్తుంది. కావాలంటే 5 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకూ అదనంగా వారంటీ తీసుకోవచ్చు. లిథియం అయాన్ బ్యాటరీ వారంటీ 8 ఏళ్లు లేదా 1,60,000 కి.మీ.గా (ఏది ముందైతే అది) ఉంటుంది.



హోండా న్యూసిటీ ఎంఎంసీని ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అరుణ్ జ్యోతి, ప్రైడ్ గ్రూప్ ఎండీ సురేష్ రెడ్డి

క్లుప్తంగా...

వ్యాపార సంస్థల్లో ఐటీ సోదాలు

సాక్షి, విశాఖపట్నం: ఆదాయపు పన్ను శాఖ విశాఖ దర్యాప్తు విభాగం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించింది. గత నెల 28 నుంచి 5 రోజుల పాటు ఏకకాలంలో 20 బృందాలతో తనిఖీలు చేపట్టినట్లు ఐటీ విభాగాధికారులు వెల్లడించారు. గూగీ ప్రాపర్టీస్ రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు ఫ్రెష్ అండ్ ఫ్రోజెన్, తాజ్ ఎక్స్‌పోర్ట్స్ మొదలైన మాంసం ఎగుమతులు నిర్వహించే సంస్థల్లో దాడులు చేపట్టారు. ఆయా సంస్థల కార్యాలయాలు, డైరెక్టర్ల ఇళ్లలో తనిఖీలు చేశారు. వ్యాపార లావాదేవీల్లో అవకతవకలు, రూ.కోట్లలో లెక్కలు చూపని లావాదేవీల ద్వారా పన్ను ఎగవేతకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆయా సంస్థలకు చెందిన ఆస్తి పత్రాలు, రూ.కోట్ల లావాదేవీల రశీదులు స్వాధీనం చేసుకున్నారు. ఎంత మొత్తంలో పన్నులు ఎగవేతకు పాల్పడ్డారనే వివరాల్ని త్వరలోనే వెల్లడించనున్నామని ఐటీ బృందాలు తెలిపాయి.

'అధికారాల కేంద్రీకరణను విరమించుకోవాలి'

కృష్ణలంక(విజయవాడతూర్పు): వాణిజ్య పన్నులశాఖలో సంస్కరణల పేరుతో ప్రభుత్వం చేపట్టిన అధికారాల కేంద్రీకరణను విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కోరారు. క్షేత్రస్థాయిలోని సర్కిల్ కార్యాలయాలకు ఉన్న అధికారాలను తీసివేసి వాటిని నిర్వీర్యం చేయడంద్వారా శాఖను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విధానమైన అధికార వికేంద్రీకరణ సూత్రానికి వ్యతిరేకంగా అన్ని అధికారాలు కేవలం నలుగురైదుగురు ఉన్నతాధికారుల చేతుల్లో పెట్టుకునే విధంగా మంత్రాంగం నడుపుతున్నారని పేర్కొన్నారు. ఏసీటీవోలకు ఎటువంటి చట్టబద్ధ అధికారాలు లేకుండా చేయడం వలన క్షేత్రస్థాయిలో జీఎస్టీ చట్టం అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ చర్యలకు నిరసనగా వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు ఏప్రిల్ రెండో వారం నుంచి దశలవారీగా ఆందోళనలు నిర్వహించాలని సమావేశం తీర్మానించిందని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గూడు కట్టి.. గుడ్లు పెట్టి..



- కింగ్ కోబ్రాల గూళ్ల సంరక్షణకు నడుం కట్టిన తూర్పు కనుమల వైల్డ్ లైఫ్ సొసైటీ, అటవీ శాఖ
- వాటి గూళ్లను అటవీ జంతువులు ధ్వంసం చేస్తుండటంతో తగ్గిపోతున్న సంఖ్య

సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే అత్యంత అరుదైన జాతికి చెందిన కింగ్ కోబ్రాలు గుడ్లు పెట్టేందుకు దిబ్బల మాదిరిగా నేలపై గూళ్లు కడతాయి. ఇందుకోసం ఆడ కింగ్ కోబ్రా గర్భం దాల్చిన వెంటనే ఎండిపోయిన వెదురు ఆకులను సేకరించి గూట్లో గుడ్లు పెట్టేందుకు అనువుగా సర్దుతుంది. అందులో 30 నుంచి 40 గుడ్లు పెట్టి పొదుగుతుంది. ఆ సమయంలో నెల నుంచి నెలన్నర పాటు ఆహారం మానేసి గూట్లోనే ఉండిపోతుంది. ఆ తరువాత 15 నుంచి 30 రోజుల్లో గుడ్ల నుంచి పిల్లలు వస్తాయనగా తల్లిపాము గూడు విడిచి వెళ్లిపోతుంది. ఆ గూళ్లను అడవి పందులు, ముంగిసలు ఇతర జంతువులు తవ్వి గుడ్లను తినేస్తాయి. ఫలితంగా కింగ్ కోబ్రాల జాతి అంతరించిపోయే స్థితికి చేరుకుంది.

ఎలా రక్షిస్తున్నారంటే..

మన రాష్ట్రంలో వెదురు పొదలు ఎక్కువగా ఉండే చోట కింగ్ కోబ్రా గూళ్లు ఎక్కువగా పెడుతున్నట్టు తూర్పు కనుమల వైల్డ్ లైఫ్ సొసైటీ, అటవీ శాఖ గుర్తించాయి. పిల్లలు బయటకు వచ్చేంత వరకు వీటి గుడ్లను సంరక్షించేందుకు వైల్డ్ లైఫ్ సొసైటీ, అటవీ శాఖ ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టాయి. గిరి నాగులు గుడ్లు పెట్టే దశ మార్చిలో ప్రారంభమై జూలై, ఆగస్టులో ముగుస్తుంది. ఆగస్టు నెలలో గుడ్లలోంచి పిల్లలు బయటకు వస్తాయి. ఆ గూళ్లను రక్షించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం అనకాపల్లి జిల్లా మాడుగులలో మొదటిసారి ఒక గూడును పరిరక్షించి గుడ్లలోంచి పిల్లలు వచ్చాక వాటిని అడవిలో వదిలేశారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఈ గూళ్లపై సర్వే పూర్తి చేయగా.. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రస్తుతం ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఆడ గిరి నాగులు గుడ్లు పెట్టిన గూళ్లను వదిలి వెళ్లిపోయిన తరువాత గూళ్ల చుట్టూ వెదురు బొంగుల్ని పాతి ఇతర జీవులేవీ గుడ్లను తాకలేని విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆపై గూళ్ల చుట్టూ దోమ తెరలను అమరుస్తున్నారు. గుడ్లలోంచి గిరి నాగు పిల్లలు బయటకు వచ్చిన తరువాత వెదురు బొంగులు, దోమ తెరలను తొలగించి.. ఆ పిల్లల్ని స్వేచ్ఛగా అడవిలో వదిలేస్తున్నారు.

వీటిని ఎందుకు కాపాడుకోవాలంటే..



కింగ్ కోబ్రా ఆహార గొలుసులో అగ్ర స్థానంలో ఉంటుంది. అంటే గిరి నాగులు ఇతర అన్ని రకాల పాముల్ని ఆహారంగా తీసుకుంటాయి. వీటి వల్ల ఇతర పాముల జనాభా నియంత్రణలో ఉంటుంది. పర్యావరణంలో కింగ్ కోబ్రాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. గిరి నాగులు ఉన్నచోట జీవ వైవిధ్యం ఎక్కువగా ఉన్నట్టు లెక్కిస్తారు. సాధారణంగా ఇవి మనుషులు వస్తే.. తప్పించుకుని పోతాయి. ఈ పాముల కాటు వల్ల మనుషులు చనిపోయిన సందర్భాలు తక్కువ.

కింగ్ కోబ్రాల రక్షణ కోసం పని చేస్తున్నాం



ఐదారేళ్ల క్రితం వరకు గిరి నాగుల్ని స్థానికులు ఎక్కువగా చంపేసేవారు. ఆ సమయంలో అటవీ శాఖతో కలిసి కింగ్ కోబ్రా కన్జర్వేషన్ ప్రాజెక్టును మొదలుపెట్టాం. వాటి సంరక్షణ, ఇతర పాము జాతులపై అధ్యయనం, పాము కాటు నివారణే లక్ష్యంగా పని చేశాం. మేం చేపట్టిన చర్యలు ఫలించి గిరి నాగుల్ని చంపడం చాలా వరకూ తగ్గిపోయింది. ప్రస్తుతం వాటి గూళ్లు, వాటి సంతతి పరిరక్షణ కోసం చర్యలు చేపడుతున్నాం.

– కంఠిమహంతి మూర్తి, అధ్యక్షుడు, తూర్పు కనుమల వైల్డ్ సొసైటీ

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న బండి శ్రీనివాసరావు

ప్రొద్దుటూరు/గుంటూరుఎడ్యుకేషన్: వీలైనంతవరకు ప్రభుత్వంతో చర్చల ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సాధ్యంకాకపోతే ఉద్యమిస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు చెప్పారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని ఎన్జీవో హోమ్‌లో ఆధునికీకరించిన కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.30లక్షల మందికి ఒకేసారి ఉద్యోగాలు ఇవ్వడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని పేర్కొన్నారు. నెలకు ఆరేడు వేల కోట్ల రూపాయలు వేతనాల కోసమే ఖర్చవుతుందని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగులను సంక్షోభంలోకి నెట్టి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం తమ సంక్షేమాన్ని కూడా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ తమను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి మాట్లాడుతూ 31 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగానే స్పందించిందని తెలిపారు. తొలుత ఉద్యోగులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌రావు, దస్తగిరిరెడ్డి, కార్యదర్శి రంజిత్‌కుమార్ నాయుడు, కోశాధికారి రంగారావు, జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గుంటూరు జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఇతర కార్యాలయాల్లోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అసోసియేషన్ నాయకులు ఆర్‌వీవీ రమేష్, కూచిపూడి మోహనరావు, కె.శ్రీనివాసరావు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీలో ఏపీ టాప్

- జీఐఎస్‌లో ఇంధనరంగ పెట్టుబడులు రూ.9.57 లక్షల కోట్లు
- 42 అవగాహన ఒప్పందాలపై సంతకం చేసిన రాష్ట్రం
- అగ్రశ్రేణి కంపెనీల ప్రాజెక్టులతో 1.8 లక్షల మందికి ఉద్యోగాలు
- సీఎం వైఎస్ జగన్ స్పష్టమైన విధానాలతో పెట్టుబడిదారులకు విశ్వాసం
- అధికారులతో సమీక్షలో ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి,అమరావతి: గ్రీన్ ఎనర్జీ రంగంలోకి వెల్లువెత్తుతున్న పెట్టుబడులతో దేశంలోనే పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తోందని ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ స్పష్టమైన విధానాలే పెట్టుబడిదారులకు విశ్వాసాన్ని కల్పించాయన్నారు. విశాఖలో రెండురోజులు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) విజయవంతమవడంతోపాటు, పెట్టుబడులను ఆకర్షించడంలో ఇంధనరంగం ప్రథమస్థానంలో నిలిచిన సందర్భంగా ఆయన ఆదివారం ఇంధనశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులను ఆకర్షించడంలో ఇతర రాష్ట్రాల కంటే ఏపీ ముందుందని, జీఐఎస్ వేదికగా ఇంధన రంగంలో రూ.9.57 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చే 42 అవగాహన ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం సంతకాలు చేసిందని చెప్పారు. దేశంలో అగ్రశ్రేణి కంపెనీలైన రిలయన్స్ ఇండియా లిమిటెడ్, అదానీ గ్రీన్ వంటివి ఏపీలో పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను స్థాపించడానికి ముందుకొచ్చాయని, తద్వారా దాదాపు 1.8 లక్షల ఉపాధి అవకాశాలు రావచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రయత్నిస్తోందని, ఈ పెట్టుబడులు రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని వేగంగా పెంచడానికి సహాయపడతాయని చెప్పారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్రం ఇప్పటికే పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం–2020ని ప్రకటించిందని చెప్పారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ రాష్ట్రంలో 10 గిగావాట్ల పునరుత్పాదక సోలార్ ఎనర్జీ ఉత్పత్తికి పెట్టుబడి పెడతామని చెప్పిందని, అదానీ గ్రీన్ ఎనర్జీ 15 గిగావాట్ల సామర్థ్యంతో పునరుత్పాదక ఇంధన యూనిట్లను ఏర్పాటు చేయనుందని వివరించారు. జీఐఎస్‌కు ముందు కూడా రూ.81 వేల కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం రాష్ట్రం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని ఆయన గుర్తుచేశారు. నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి మాట్లాడారు. ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మజనార్దనరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయుల రచనలకు గ్రంథాలయ సంస్థ సహకారం

గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాత్రికేయ రచయితలు తమ సొంత ఖర్చులతో ప్రచురించే పుస్తకాలను ఏపీలోని అన్ని గ్రంథాలయాలకు తీసుకుంటామని, పుస్తకాల కొనుగోళ్లలో ఆ రచనలకు ప్రాధాన్యతనిస్తామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు చెప్పారు. ప్రజా ప్రయోజనకరమైన సాహిత్యాన్ని జన బాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు సహకరిస్తామన్నారు. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వుల కాపీని ఆదివారం విజయవాడలో విడుదల చేశారు. మంత్రి అంబటి రాంబాబు, సి.రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శేషగిరిరావు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థల ద్వారా పుస్తకాలు కొనుగోలు చేసే సమయంలో జర్నలిస్ట్ రచయితలు రాసి, సొంత ఖర్చులతో ప్రచురించిన పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, వాటిని అన్ని పబ్లిక్ లైబ్రరీల్లో అందుబాటులో ఉంచాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని కోరినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలోని పబ్లిక్ లైబ్రరీకి అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేయడానికి, పుస్తక రచయిత రిజిస్ట్రేషన్ కోసం ప్రతి శీర్షికకు 4 కాపీలను పంపాలని కోరారు.

కల్యాణ వైభోగం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పీఠాధిపతి, అర్చకులు

- నయనానందకరం శ్రీ ప్రహ్లాదవరదుడి కల్యాణం
- నల్లమలలో మారుమోగిన గోవింద నామస్మరణ
- పరవశించిన భక్త జనం

ఆళ్లగడ్డ: సకల కల్యాణ గుణ పరిపూర్ణుడైన దేవదేవుడు వరదహస్తుడై ఆశీర్వదించిన వేళ.. స్వామివారి కరుణా కటాక్ష వీక్షణాలకై భక్తజనం పోటెత్తిన సమయాన.. ఉగ్రం వీరం మహావిష్ణుం.. ఓం నమో నరసింహాయ.. అంటూ నామస్మరణలు మిన్నంటిన వేళ జరిగిన శ్రీ ప్రహ్లాదవరదుడి కల్యాణంతో భక్తజన కోటి పరవశించిపోయింది. అహోబిల పుణ్యక్షేత్రంలో ఆదివారం లక్ష్మీనరసింహ స్వామి వారి పరిణయోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా వేద పండితులు పుణ్యాహవచనం చేసి నవగ్రహ మంటపారాధన అనంతరం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించిన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను పెండ్లి కూతురు, పెండ్లి కుమారుడిగా ముస్తాబు చేసి మంటపంలో కొలువుంచారు. ఎదుర్కోళ్లు నిర్వహించిన అనంతరం వైష్ణవ ఆచారంగా వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య మాంగళ్య ధారణ నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం పూర్తి చేశారు. కమనీయ దృశ్యాన్ని తనివితీరా చూసిన భక్తకోటి మురిసిపోయింది. నూతన వధూవరులైన ప్రహ్లాదవరదుడు, అమృతవల్లి స్వామి అమ్మవార్లను దర్శించుకుని పునీతులయ్యారు.

ఆకట్టుకున్న ఎదుర్కోళ్ల ఉత్సవం..

స్వామి వారి కల్యాణోత్సవంలో ఎదుర్కోలు నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా స్వామి తరుపున కొందరు, అమ్మవారి తరుపున మరి కొందరు అర్చకులు బంధువులుగా విడిపోయి పెద్ద మనుషులుగా వ్యవహరిస్తారు. కట్నకానుకలు, ఆడపడుచు లాంఛనాలు, ఇచ్చి పుచ్చుకోవడం తదితర విషయాలు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుకునే మాటలు విశేషంగా అలరించాయి. అనంతరం స్వామి, అమ్మవారిని ఒక్కటిగా చేసి కల్యాణ మండపానికి పల్లకీలో తోడ్కొని పోయారు. కల్యాణోత్సవంలో అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీమన్ శఠకోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆగుతూ.. సాగుతూ..

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో నత్తనడకన ప్లాట్‌ఫాంల నిర్మాణం

- ఐదేళ్లయినా కొలిక్కిరాని పనులు
- అవుటర్‌లో ఆలస్యమవుతున్న రైళ్లు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో రాజమహేంద్రవరం ప్రధానమైన రైల్వే స్టేషన్. విజయవాడ తరువాత అతి పెద్ద స్టేషన్ ఇది. నిత్యం రద్దీగా ఉంటుంది. వందలాదిగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అన్ని ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లతో పాటు కోల్‌కతా – చెన్నై మార్గంలో అనేక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ తప్పనిసరిగా ఆగుతాయి. తూర్పు గోదావరితో పాటు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తమ రైలు ప్రయాణాలకు ఈ స్టేషన్ పైనే ఆధారపడుతూంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఈ స్టేషన్ అభివృద్ధిలో జరుగుతున్న జాప్యం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. ముఖ్యంగా అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణం సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అవుటర్‌లో ఆగిపోతూ..

రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజూ సుమారు 30 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ తదితర రైళ్లు 140 వరకూ ఈ స్టేషన్ మీదుగా నడుస్తున్నాయి. వీటితో పాటు మరో వంద వరకూ గూడ్స్ రైళ్లు కూడా నడుస్తుంటాయి. ఇంతటి కీలకమైన ఈ రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం మూడు ప్లాట్‌ఫాంలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. విజయవాడ వైపు వెళ్లే రైళ్లు 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై, విశాఖపట్నం, కాకినాడ వైపు వెళ్లేవి 3వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగుతూంటాయి. అత్యవసర సమయాల్లో 2వ నంబర్ ప్లాట్‌ఫాం ఉపయోగిస్తారు. ఉన్న ఈ మూడు ప్లాట్‌ఫాంలు వందలాదిగా నడుస్తున్న రైళ్లకు చాలడం లేదు. దీంతో పలు సందర్భాల్లో సిగ్నల్ పడక.. రైళ్లను అవుటర్‌లో నిలిపివేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన స్టేషన్ సమీపానికి వచ్చేసి కూడా, అవుటర్‌లో అధిక సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఒక్కోసారి 10 నుంచి 15 నిమిషాల నుంచి అరగంట వరకూ నిరీక్షించాల్సి వస్తోంది. దీనిపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా మిగిలిన 4, 5 ప్లాట్‌ఫాంలు



అరకొరగా ఫుట్ వే బ్రిడ్జి

2019లో ప్రారంభం

రైళ్ల రద్దీని, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో 4, 5 ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టారు. వీటికి 2018లో టెండర్లు ఖరారయ్యాయి. సుమారు 10 మీటర్ల వెడల్పు, 610 మీటర్ల పొడవున నిర్మించాలని నిర్ణయించారు. ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా రైల్వే యార్డు ఆధునీకరణ పనుల కారణంగా ప్లాట్‌ఫాంల నిర్మాణం ఏడాది పాటు ప్రారంభం కాలేదు. 2019లో ప్రారంభించినప్పటికీ కోవిడ్ ఉధృతి కారణంగా పనులు పడకేశాయి. ఎట్టకేలకు 2021 ఆగస్టులో మళ్లీ పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్‌కు సంబంధించిన కాంక్రీట్ పనులు చేపట్టారు. అయితే బిల్లులు మంజూరు కాకపోవడంతో అదే ఏడాది నవంబర్‌లో పనులు నిలిపివేశారు. 2022 జనవరి నుంచి మళ్లీ పనులు కొనసాగించారు. గత డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలనుకున్నప్పటికీ పనులు పూర్తి కాలేదు. ప్లాట్‌ఫాంలు ఒక రూపు సంతరించుకున్నప్పటికీ చివరి దశగా చేపట్టాల్సిన రేకు షెల్టర్లు, వెయిటింగ్, కంట్రోల్ రూములు, సిగ్నల్స్, ఫుట్ వే బ్రిడ్జి నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. ఈ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తారని చెబుతున్నారు.

కళాశాలలకు కార్పొ'రూటు'

- పరిశ్రమల అవసరాలే బోధనాంశాలు
- సిలబస్‌తో పాటు వృత్తి నైపుణ్యాలు నేర్పుతున్న కంపెనీలు
- ఆ మేరకు ఒప్పందాలు
- కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు
- విద్యా విధానంలో నూతన ఒరవడి



జర్మనీ దేశ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు (ఫైల్)

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పట్టా పొందిన ఏ విద్యార్థీ ఉద్యోగం పొందేందుకు ప్రజాప్రతినిధుల సిఫారసు కోసం తిరగకూడదు. ఉన్నత విద్యపై సమీక్షలో ఉన్నతాధికారులు, వర్సిటీల ఉప కులపతులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే ప్రస్తావిస్తున్న అంశమిది. దీనికి తగినట్టుగానే కళాశాలల్లో మార్పులు వస్తున్నాయి. చదువుకుని ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే పరిస్థితి క్రమంగా మారుతోంది. తమకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పించేందుకు వివిధ కార్పొరేట్ కంపెనీలే నేరుగా కళాశాలల బాట పడుతున్నాయి. అంతే కాదు.. నైపుణ్య శిక్షణ అనంతరం ఉద్యోగాలు కూడా ఇస్తామంటున్నాయి.

ఈ మేరకు ప్రముఖ ఐటీ కంపెనీలు, పరిశ్రమలు జిల్లాలోని ప్రముఖ కళాశాలలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. తమ కంపెనీలో పని చేయడానికి ఉద్యోగులకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, అందుకు తగిన సిలబస్ సైతం రూపొందించి కళాశాలలకు అందజేస్తున్నాయి. ఆ సిలబస్‌ను బోధించేందుకు అవసరమైన అధ్యాపకులు, సిలబస్, మెటీరియల్, ఎగ్జామ్ పేపర్లను కూడా ఆయా కంపెనీలే కళాశాలలకు సమకూర్చుతున్నాయి. తాము స్పాన్సర్ చేసిన కోర్సు పూర్తి చేసిన యువతకు ప్రాధాన్యం ఇచ్చి తమ కంపెనీల్లోనే అత్యధిక ప్యాకేజీలతో ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఉన్నత విద్య పూర్తి చేసి, కళాశాల తరగతి గది మెట్లు దిగిన వెంటనే.. కార్పొరేట్ కంపెనీ లిఫ్ట్ ఎక్కి, ఉద్యోగి హోదాలో ఆఫీసులో అడుగు పెడుతున్నారు. ఈవిధంగా ఐటీ దిగ్గజ కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, అసెంచర్ వంటి బహుళజాతి సంస్థలతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు ఒప్పందాలు కుదుర్చురుంటున్నాయి. విప్రో, టీసీఎస్‌లతో జేఎన్‌టీయూ–కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల; బజాజ్ ఫిన్ కార్ప్‌తో ఆదిత్య డిగ్రీ కళాశాల; ఐటీసీ, హనీవెల్, ఇన్ఫో, విప్రో, మైక్రోచిప్ వంటి కంపెనీలతో ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందాలు చేసుకున్నాయి. విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌తో పాటు ఇంటర్న్‌షిప్, చదువు పూర్తయిన తర్వాత నైపుణ్యాలను బట్టి వారికి ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు ఇస్తారు. అధ్యాపకులకు అవసరమైన శిక్షణను కూడా ఆయా సంస్థలే వారే ఇస్తారు. అప్పుడప్పుడు ఆయా సంస్థల ఉద్యోగులే కళాశాలల తరగతి గదులకు వచ్చి విద్యార్థులతో మాట్లాడి, నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. ఆయా విద్యార్థుల ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు ఎంతో తోడ్పడుతున్నాయి.

శాస్త్రోక్తంగా 'కామదహనం'

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఫాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయప్రాంగణంలోని మనోహర గుండం ఎదురుగా కొలువుంచి విశిష్ట పూజలు నిర్వహించారు. ఆతర్వాత ఉత్సవమూర్తులను పల్లకీలో గంగాధర మండపం వద్దకు తోడ్కొని వచ్చి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేపట్టారు. అనంతరం గడ్డితో చేసిన మన్మథ రూపాన్ని దహనం చేశారు. చివరగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కామదహనం కార్యక్రమాన్ని వీక్షించడంతో శివకటాక్షం లభిస్తుందని పండితులు చెప్పారు. కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ ఎస్. లవన్న, అర్చకులు, వేదపండితులు అధికారులు పాల్గొన్నారు.



కామదహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం ¦ 6 ¦ మార్చి ¦ 2023

అమ్మవారికి చందన సేవ

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే బనశంకరీదేవి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ శాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలు చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధాన చేశారు.


చందన అలంకరణలో బనశంకరీదేవి

న్యూస్‌రీల్

హెల్త్ ఇన్స్‌పెక్టర్ పట్టివేత


నిందితుడు రామయ్య

కృష్ణరాజపురం: బీబీఎంపీ ఆరోగ్య శాఖ విభాగం హెల్త్ ఇన్స్‌పెక్టర్ లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కాడు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కోసం సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి దరఖాస్తు చేశాడు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామయ్య రూ. 18 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో అతను లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం హొసతిప్పసంద్ర వార్డులో హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామయ్య లంచం తీసుకుంటుండగా లోకాయుక్త దాడి చేసి పట్టుకుంది. అతని వద్ద అదనంగా ఉన్న రూ. 50 వేల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు.

రూ.33 లక్షల జరిమానా చెల్లించిన బీఎంటీసీ

బనశంకరి: బెంగళూరు నగరంలో 12 వేల సిగ్నల్ జంప్‌లు చేసిన బీఎంటీసీ డ్రైవర్లు, సంస్థకు కోటి రూపాయలు నష్టం కలిగించారు. నగరంలోని బీఎంటీసీ డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్‌కు అనేక ప్రాణాలు గాల్లో కలిశాయి. ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు 12 వేల సిగ్నల్ జంప్ చేసిన కేసులు మొత్తం జరిమానా కోటి రూపాయలకు చేరుకుంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పక్కా కేసుల్లో రూ.66 లక్షలు జరిమానాలో ట్రాఫిక్ పోలీసులు 50 శాతం రాయితీతో రూ.33 లక్షలు జరిమానాను బీఎంటీసీ పాలక మండలి చెల్లించింది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడిన డ్రైవర్లకు వారి వేతనంలో జరిమానా మొత్తం చెల్లించాలి. అలా చేసినప్పటికీ ట్రాఫిక్ రూల్స్ పట్ల డ్రైవర్లు జాగృతం కాలేదు. దీంతో బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్, సేఫ్టీ డ్రైవింగ్ పట్ల శిక్షణ ఇవ్వాలని బీఎంటీసీ తీర్మానించింది.

దేశ రహస్యాల విక్రయానికి యత్నం


నిందితుడు ఉదయ్‌కుమార్(ఫైల్)

కెలమంగలం: కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలోని రహస్యాలను సెల్‌ఫోన్ ద్వారా ఫోటోలు తీసి విదేశీ గూఢచార సంస్థలకు విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని బైరగొండపల్లి గ్రామానికి చెందిన రామక్రిష్టారెడ్డి కొడుకు ఉదయ్‌కుమార్ (32). బెంగళూరులో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా 2017 నుంచి 2019 వరకు పనిచేశాడు. ఈ సమయంలో కార్యాలయంలో భద్రపరిచిన పలు ధృవీకరణ పత్రాలు, పరిశోధనా ఉపకరణాలను సెల్‌ఫోన్ ద్వారా ఫోటోలు తీసి విదేశీ ఏజెన్సీల వద్ద విక్రయించి డబ్బు సంపాదించడానికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకొన్న తరువాత పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టి ఉదయ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. కేసు విచారణలో ఉంది.

సింహం కన్నుమూత


మృతిచెందిన సింహం (ఫైల్)

బొమ్మనహళ్లి: బెంగళూరు బన్నేరుఘట్ట ఉద్యాన వనంలో రెండేళ్ల నందిని అనే ఆడ సింహం మృతి చెందినట్లు ఉద్యానవన డైరెక్టర్ సునీల్ పన్వార్ తెలిపారు. సానియా, రామ అనే సింహాలకు జన్మించిన నందిని పుట్టినప్పటి నుంచి నరాల రోగంతో బాధపడుతోంది. చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూసింది.

ఆచూకీ లేని ఎమ్మెల్యే

- విరూపాక్షప్ప కోసం లోకాయుక్త లుక్‌ఔట్ జారీ!
- మూడు రోజులుగా అదృశ్యం
- విచారణలో ముడుపుల కేసు

బనశంకరి: లక్షలాది రూపాయల ముడుపుల కేసులో అరెస్ట్ భయంతో పరారీలో ఉన్న దావణగెరె జిల్లా చెన్నగిరి బీజేపీ ఎమ్మెల్యే మాడాళు విరూపాక్షప్పకు లోకాయుక్త పోలీసులు లుక్‌ఔట్ నోటీస్ జారీచేయాలని నిర్ణయించారు. లుక్‌ఔట్ నోటీస్ జారీచేస్తే ఆయన విదేశాలకు వెళ్లిపోవడం కుదరదు. విమానాశ్రయాలు, ఓడరేవులతో పాటు దేశవ్యాప్తంగా ఈ లుక్‌ఔట్ నోటీస్ జారీచేస్తారు. సదరు వ్యక్తి విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తే దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకోవడం లేదా అరెస్ట్ చేసే అవకాశం ఉంది. మాడాళు విరూపాక్షప్ప కోసం లోకాయుక్త పోలీసులు 7 బృందాలతో గాలిస్తున్నారు. అంతేగాక విచారణకు రావాలని నోటీసులు పంపారు. ఆయన కుమారుడు ప్రశాంత్ మాడాళ్ నివాసంలో లభించిన రూ.6 కోట్లు నగదు, ప్రైవేటు కార్యాలయంలో రూ.2 కోట్లుకు పైగా నగదు ఎక్కడి నుంచి వచ్చిందో దర్యాప్తు జరుగుతోంది.


మాడాళ్ విరూపాక్షప్పకు గద్దుకాలం


ఎమ్మెల్యే కోసం పలు బృందాల గాలింపు

లుక్‌ఔట్‌కు సన్నాహాలు

ఈ కేసులో మాడాళ్ విరూపాక్షప్ప ఏ1 నిందితుడు కాగా గత మూడురోజులనుంచి ఆయన ఎక్కడ ఉన్నారనేది లోకాయుక్త పోలీసులు కనిపెట్టలేకపోయారు. దీంతో లుక్‌ఔట్ నోటీస్ ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిసింది. బెంగళూరు డాలర్స్‌కాలనీలోని నివాసం, దావణగెరె, చెన్నగిరి నివాసం, కేఎస్‌డీఎల్ కార్యాలయం, బంధువుల ఇళ్లతో పాటు ఇతర చోట్ల లుక్‌ఔట్ నోటీస్‌లు అతికిస్తారు. లుక్‌ఔట్ నోటీస్ వెలువడితే సంబంధిత వ్యక్తి కచ్చితంగా లొంగిపోవాల్సి ఉంటుంది. ఆయనకు ఆశ్రయం కల్పించినవారు కూడా చట్టాన్ని అతిక్రమించినవారవుతారు.

దర్శకుని వ్యంగ్యోక్తులు

శివాజీనగర: మైసూరు శాండల్ సోప్ ఉపయోగించాలంటే వెనుకంజ వేసే పరిస్థితి వచ్చిందని సినీ దర్శకుడు నాగతిహళ్లి చంద్రశేఖర్ ట్వీట్ చేశారు. మాడాళ్ విరుపాక్షప్ప, కుమారుని ఇంట్లో కోట్లాది రూపాయలు నగదు లభించడంపై వ్యంగ్యంగా స్పందించారు. మాడాళ్ చేసిన అవినీతితో ప్రభుత్వ అనుబంధ సంస్థ, ఉత్పత్తుల్లో విశ్వాసం, గౌరవం కోల్పోయినట్లయింది. నాలాంటివారు చాలా ఏళ్లుగా ఉపయోగిస్తున్న మైసూరు శాండల్ సోప్‌పై నమ్మకం పోయేలా చేశారు అని వాపోయారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు: సీఎం

లోకాయుక్తకు పూర్తి అధికారాలు అందించి తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవడం మా నైతికత. తప్పులను దాచిపెట్టడం కాంగ్రెస్ నైతికత అని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై అన్నారు. ఆదివారం బాళె హొన్నూరులో విలేకరులతో బొమ్మై మాట్లాడుతూ.. సీఎం రాజీనామా చేయాలని కాంగ్రెస్‌వారు అడుగుతున్నారు సరే, సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక మంత్రి ఆఫీసులో రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఆ రోజు సిద్దరామయ్య ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. లోకాయుక్త ఉన్నట్లయితే అప్పుడే అతడిపై కేసు పెట్టేవారు, అవినీతిని దాచి పెట్టుకుని మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే విరూపాక్షప్ప రాజీనామా గురించి ఇంకా నిర్ణయించలేదని, లోకాయుక్తకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రాయగఢలో తాను ఆవిష్కరించిన శివాజీ విగ్రహాన్ని మళ్లీ కాంగ్రెస్ నేతలు ప్రారంభించడం హాస్యాస్పదమని అన్నారు.

ఫాక్స్‌కాన్ వస్తోందా.. లేదా?

- పరిశ్రమ ఏర్పాటుపై భిన్నవాదనలు

సాక్షి, బెంగళూరు: ప్రతిష్టాత్మక ఆపిల్ ఉత్పత్తుల తయారీ కంపెనీ ఫాక్స్‌కాన్ బెంగళూరుకు వస్తోందా, లేదా అనేదానిపై సందిగ్ధం ఏర్పడింది. మార్చి 3న తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సంస్థ అధ్యక్షుడు యంగ్ లియు 17 మంది బృందంతో కలసి పర్యటించారు. దొడ్డబళ్లాపుర వద్ద పారిశ్రామిక ప్రాంతంలో ఉత్పత్తి కేంద్రం ప్రారంభించేందుకు స్థల పరిశీలన కూడా చేశారు. తరువాత సీఎంతో భేటీ అయి చర్చించారు. దొడ్డబళ్లాపురం వద్ద రూ. 5 వేల కోట్ల పెట్టుబడితో యాపిల్ ఫోన్లు, పరికరాల విడి భాగాల తయారీ కేంద్రం రానుందని, ఇందుకోసం ఫాక్స్‌కాన్ ముందుకు వచ్చినట్లు సీఎం ట్విట్టర్‌లో ప్రకటించారు.



సీఎంపై ప్రతిపక్షాల ఆగ్రహం

భారతదేశంలో ఎలాంటి పెట్టుబడులు పెట్టడం లేదని ఫాక్స్‌కాన్ అధ్యక్షుడు స్పష్టం చేసినట్లు ఒక ఆంగ్ల దినపత్రిక వార్తను ప్రచురించింది. ఇది ప్రతిపక్షాలకు ఆయుధమైంది. సీఎం ఎన్నికల విన్యాసాలు చేస్తున్నారని సుర్జేవాలా, ప్రియాంక్ ఖర్గే తదితర కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారు. ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, చెవుల్లో పువ్వులు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎలాంటి ఒప్పందం చేసుకోకుండానే సర్కారు అబద్ధ ప్రచారానికి దిగిందని జేడీఎస్ మాజీ సీఎం కుమారస్వామి విమర్శించారు. దీనిపై ప్రభుత్వం ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు.



ఒప్పందం కుదరలేదని ప్రచారం

పంచమసాలిల రాస్తారోకో

- 2ఏ రిజర్వేషన్ల కోసం డిమాండు

దొడ్డబళ్లాపురం: 2ఏ రిజర్వేషన్లకై డిమాండు చేస్తూ పంచమసాలి సామాజికవర్గం 50 రోజులుగా బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో చేస్తున్న పోరాటానికి మద్దతుగా పంచమసాలి లింగాయత్ జగద్గురు శ్రీబసవ జయమృత్యుంజయ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం నెలమంగల సమీపంలోని జాస్ టోల్ వద్ద భారీ రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రార్థన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన స్వామిజీ పంచమసాలి సామాజికవర్గం వారు రెండేళ్లుగా 2ఏ రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం మాత్రం హామీకే పరిమితమయిందన్నారు. తల్లిమీద ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి మంత్రివర్గంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మాట ఇచ్చి ఇప్పుడు మాట తప్పారన్నారు. అందువల్ల తమ సామాజికవర్గం ఇలా వీధికెక్కాల్సి వచ్చిందన్నారు. ఇకపై పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల తనిఖీ


పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

మండ్య: ఈ నెల 12వ తేదీన మండ్య నగరంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా కలెక్టర్ హెచ్‌ఎస్ గోపాలకృష్ణ, ఎస్పీ ఎన్. యతీష్‌లు ఆదివారం బెంగళూరు–మైసూరు వేగమార్గంపై ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని మోదీ ఈ దశపథ రోడ్డును ప్రారంభించి రోడ్ షో నిర్వహిస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఇరువురూ తనిఖీ చేశారు. పర్యాటక మందిరం నుంచి జేసీ సర్కిల్ మీదుగా నంద సర్కిల్ ద్వారా రోడ్‌షో సాగుతుంది. ఎక్కడా అపరిశుభ్రత అనేది ఉండరాదని ఆదేశించారు. నగరంలో పలు మార్గాల్లో సాధారణ ప్రజల రాకపోకలపై నియంత్రణ ఉంటుంది.




హోలీ ఆయీరే

హోలీ సంబరాలు రావడంతో ఆదివారం బెంగళూరు మల్లేశ్వరంలో రంగులు కొనుగోలులో బాలికలు. ఇక ధార్వాడలో హోలీకి ముందు హలగి హబ్బ సందర్భంగా తప్పెట్లు కొడుతున్న బాలలు

సినీఫక్కీలో మోస్ట్ వాంటెడ్ అరెస్టు

- నగరంలో ఎన్‌ఐఏ ఆపరేషన్

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లాలో బీజేపీ నాయకుడు ప్రవీణ్ నెట్టారు హత్య కేసులో ఎన్‌ఐఏ అధికారులు మోస్ట్ వాంటెడ్ నిందితున్ని అరెస్ట్ చేశారు. బెంగళూరు అమృతహళ్లి స్టేషన్ పరిధిలోని దాసరహళ్లిలో శనివారం రాత్రి తౌఫిల్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతని స్వస్థలం కొడగు జిల్లా కాగా ఇక్కడ దాక్కున్నాడు. ఐదు నెలల నుంచి అమృతహళ్లి మారుతీ లేఔట్‌లో నంజుండప్ప ఇంటిలో తౌఫిల్ బాడుగకు ఉంటున్నాడు. ఎవరితోను మాట్లాడేవాడు కాదు. అతన్ని పట్టుకోవాలని ఆటోలో, ప్లంబర్ పనిచేసేవారిగా ఇద్దరు ఎన్ఐఏ అధికారులు రించ్ పట్టుకొని వెళ్లారు, అదే సమయంలో మాంసం కోస్తున్న తౌఫిల్ వారిపై దాడికి యతిన్చగా, అడ్డుకుని నిర్బంధించారు. గతంలో ఇతని ఆచూకీ చెబితే రూ. 5 లక్షలు నజరానా ఇస్తామని ఎన్‌ఐఏ ప్రకటించింది. ప్రవీణ్ హత్య కేసులో ఎన్‌ఐఏ ఇప్పటికే సుమారు 240 మంది సాక్షులను విచారించి 15 వందల పేజీల చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది.


నిందితుడు తౌఫిల్

మళ్లీ కోవిడ్ గుబులు

- నెమ్మదిగా పెరుగుతున్న కేసులు
- నేడు ఆరోగ్యమంత్రి సమీక్ష



శివాజీనగర: రాష్ట్రంలో గత ఒక వారం నుంచి కరోనా కేసులు పెరుగుతున్నందున సురక్షిత చర్యల అమలుపై ఆరోగ్య మంత్రి కే.సుధాకర్ సోమవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. వారం రోజుల నుంచి రాష్ట్రంలో కరోనా వైరస్ కేసులు పెరిగాయి. అంతేకాకుండా పలువురిలో హెచ్3ఎన్2 అనే వైరస్ కూడా బయటపడింది. జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి లక్షణాలు హెచ్3ఎన్2 కారక ఇన్ఫ్లూయెంజాలో కనిపిస్తాయి. పశుపక్ష్యాదులకు కూడా ఈ వైరస్ బెడదగా మారింది.

ఆదివారం ఉదయం విధానసౌధ వద్ద మంత్రి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఆరోగ్య శాఖ హెచ్3ఎన్2 వైరస్‌పై నిఘా వహించాలని రాష్ట్రానికి సూచించింది. ఈ విషయమై సోమవారం అధికారులు, నిపుణుల సమావేశం జరపనున్నట్లు తెలిపారు.

శనివారం 95 కేసులు

రాష్ట్రంలో ఒక వారం నుంచి కరోనా వైరస్ కేసులు పెరిగాయి, శనివారం 95 మంది కరోనాకు గురైనట్లు తెలిసింది, ఇందులో బెంగళూరులోనే 70 కేసులు బయటపడ్డాయని మంత్రి చెప్పారు. 100 రోజుల తరువాత రాష్ట్రంలో కోవిడ్ కేసుల్లో మార్పు వచ్చిందన్నారు. ప్రతి వంద పరీక్షల్లో 2.44 శాతం పాజిటివ్‌గా వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి సురక్షితా చర్యలను అమలు చేయాలనేదానిపై, వైరస్ నియంత్రణ చర్యల గురించి ఈ భేటీలో చర్చిస్తామని చెప్పారు.

కొడవలితో నరికివేత

- నంజనగూడు తాలూకాలో పాతకక్షలతో హత్య

మైసూరు: పట్టపగలే వ్యక్తి పైన మరో వ్యక్తి వేట కొడవలితో నరికి చంపిన సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకా హెడియాల గ్రామంలో జరిగింది. హతుడు మహేష్ (27). మహేష్ ఆదివారం ఇంటి వద్ద ఆటోలో కూర్చుని ఉండగా గిరీష్ అనే వ్యక్తి హఠాత్తుగా వచ్చి కొడవలతో ఇష్టానుసారం నరికాడు. తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో మహేష్ రక్తపు మడుగులో పడిపోయాడు. స్థానికులు మైసూరులోని ప్రవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. హుల్ళహళ్ళి పోలీసులు పరారీలో ఉన్న గిరీష్‌ను అరెస్టు చేశారు. పాత కక్షలే హత్యకు కారణమని తెలిసింది.


హతుడు మహేష్

ఇద్దరు గొలుసు దొంగల అరెస్టు

మైసూరులో తరచూ గొలుసు చోరీలు జరగడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ఇద్దరు చైన్ స్నాచర్‌లను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ. 7.10 లక్షల విలువ చేసే 205 గ్రాముల 5 చైన్‌లను స్వాధీనం చేసుకొన్నారు. రెండు బైకులు, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. నిందితులు రుమాన్ (25) సుహేల్ (26). ఎన్‌ఆర్ పోలీసులు విచారణ చేపట్టారు.

కాలువలోకి జారి పడి బాలుడు మృతి

కాలువలోకి జారిపడి అభిషేక్ (16) అనే బాలుడు మృతి చెందిన సంఘటన నంజనగూడు తాలూకాలోని హుల్లహళ్ళి గ్రామంలో చోటు చేసుకుంది. ఇతను హుల్ళహళ్ళిలో 9వ తరగతి విద్యార్థి. గ్రామంలో ఆత్వాల్ కట్ట కాలువలో ముఖం కడుక్కుంటూ జారిపడ్డాడు, ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు.

24 నుంచి రవాణా ఉద్యోగుల సమ్మెబాట

శివాజీనగర: తమ డిమాండ్లు పరిష్కారం కాకపోవడంతో రవాణా (ఆర్టీసీ) ఉద్యోగులు మళ్లీ సమ్మె బాటపట్టనున్నారు. ఈ నెల 24 నుంచి బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ధర్నాకు సమాయాత్తమవుతున్నారు.

బీఎంటీసీ, కేఎస్ ఆర్టీసీ, కేకే ఆర్టీసీ, ఎన్ డబ్ల్యూ కే ఆర్టీసీ సిబ్బంది ధర్నాలో పాల్గొననున్నారు. వేతన కమిషన్ సిఫార్సుల మేరకు జీతాలను పెంచాలనే డిమాండ్‌తో సమ్మె చేయాలని నిర్ణయించామని, 2016 నుంచి వేతనాలు పెరగలేదని రవాణా ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. 2021లో ధర్నా చేయగా, రవాణా మంత్రి హామీ మేరకు విరమించామని, అయితే ఈసారి డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని చెప్పారు.

9న కాంగ్రెస్‌చే రాష్ట్ర బంద్

తుమకూరు: అధికార బీజేపీ అవినీతి ఖండిస్తూ ఈనెల 9న రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెలిపారు. ఆదివారం తుమకూరు జిల్లా కొరటిగెరెలో జరిగిన రాజీవ భవన్ ప్రారంభోత్సవంలో మీడియాతో మాట్లాడుతూ...9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రాష్ట్ర మొత్తం బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. రెండు గంటల పాటు వ్యాపారులు అందరూ సహకరించాలని కోరారు.

కులాంతర పెళ్లిపై బహిష్కార కొరడా

- రూ. 6 లక్షల జరిమానా కూడా
- చామరాజనగర జిల్లాలో అమానుషం

బనశంకరి: కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ఐదేళ్ల తరువాత కులపెద్దలు రూ.6 లక్షలు జరిమానా విధించి సంఘ బహిష్కరణ చేశారు. సినిమాలలో కనిపించే ఇటువంటి సంఘటనలు నిజ జీవితంలోనూ ఇంకా జరుగుతున్నాయి. చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూకా కుణగళ్లిలో సంఘటన జరగ్గా, ఈ నెల 1వ తేదీన కొళ్లేగాల డీఎస్‌పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని గోవిందరాజు, శ్వేత దంపతులు మనవిచేశారు.

దళిత యువతిని పెళ్లాడినందుకు

వివరాలు.. ఉప్పారశెట్టి సముదాయానికి చెందిన కుణగళ్లి గోవిందరాజు, మండ్య జిల్లా మళవళ్లి తాలూకా హువినకొప్పలు గ్రామానికి చెందిన దళిత యువతి శ్వేతను ప్రేమించి 2018 సెప్టెంబరు 19న కుటుంబసభ్యుల సమక్షంలో మళవళ్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. మళవళ్లిలో నివాసం ఉండే దంపతులు కుణగళ్లికి అప్పుడప్పుడు వెళ్లేవారు. వీరిద్దరిదీ కులాంతర పెళ్లని గోవిందరాజు కుల పెద్దలకు తెలిసింది. కొన్నిరోజుల కిందట పంచాయతీచేసి గోవిందరాజు కుటుంబానికి రూ.3 లక్షలు జరిమానా విధించారు. ఈ నెల 1వ తేదీలోగా చెల్లించాలని ఆదేశించారు.



ఫిర్యాదు చేశారని జరిమానా రెట్టింపు

తామేం తప్పుచేశామని బాధితులు ప్రశ్నించి కొళ్లేగాల డీఎస్‌పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో కులపెద్దలకు కోపం వచ్చి జరిమానాను రూ.6 లక్షలకు పెంచి ఆ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారు. వారితో గ్రామప్రజలెవరూ మాట్లాడరాదు, దుకాణాల్లో పాలు, కూరగాయలు, నిత్యావసర వస్తువులను అమ్మరాదు అని ప్రచారం చేశారు. ఈ ఘటన పై యళందూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.